ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 27.12.2024 | సంపుటి : 11 సంచిక : 169 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## సినిమా పరిశ్రమపై కక్ష సాధింపు

**సీఎం తీరుపై హరీశ్ మండిపాటు**

**హైదరాబాద్(జనంసాక్షి):** సినిమా వాళ్లను భయపెట్టి సీఎం మంచి చేసుకోకూడదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సంధ్య థియేటర్ ఘటనను ప్రభుత్వం రాజకీయం చేస్తోందని అన్నారు. గురుకులాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను సీఎం పరామర్శించిన సందర్భాలు లేవు.

మిగతా 2లో..



## బోరుబావిలోనే చిన్నారి..

**తీవ్రంగా శ్రమిస్తున్న అధికారులు**
**రంగంలోకి ర్యాట్ హోల్ మైనర్స్**

**జైపూర్(జనంసాక్షి):** రాజస్థాన్‌లో ఓ బోరుబావిలో మూడేళ్ల చిన్నారి పడిపోయింది. ఆ బాలికను బయటకు తీసేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో 'ర్యాట్ హోల్ మైనర్స్' వినియోగిస్తునట్లు అధికారులు

మిగతా 2లో..

### మచ్చలేని మహామనిషి.. ఆర్థిక సంస్కరణల ఋషి..

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఇకలేరు



**వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో ఢిల్లీ ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచిన మహానేత**

## గొప్ప ఆర్థిక వేత్త.. మహా నాయకుడు



**మాజీ ప్రధాని మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన సీఎం రేవంత్**

**హైదరాబాద్(జనంసాక్షి):** మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక వేత్త, మహా నాయకుడు, సంస్కరణ వాది అన్నింటికి మించి గొప్ప మానవతా వాది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతితో దేశం ఒక

మిగతా 2లో..

## దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రముఖులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. తీవ్ర అస్వస్థతకు గురై దిల్లీ ఎయిమ్స్‌లో చేరిన ఆయన చికిత్స పొందుతూ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. దేశంలో ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టిన వ్యక్తిగా నిలిచిన మన్మోహన్ సింగ్.. అక్టోబర్ 1991లో తొలిసారి రాజ్యసభలో డుగుపెట్టారు. 1991 నుంచి 1996 వరకు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పని చేసిన ఆయన.. ఆ తర్వాత 2004 నుంచి 2014 వరకు పదేళ్ల పాటు భారత ప్రధానిగా సేవలందించారు. దేశాన్ని సుదీర్ఘకాలంపాటు పాలించిన ప్రధానుల్లో ఒకరిగా నిలిచారు. ఆయన 26 సెప్టెంబరు 1932లో జన్మించారు. జన్మస్థలం.. మా, పంజాబ్ (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) 14 సెప్టెంబరు 1958లో వివాహం జరిగింది. భార్య గురుశరణ్ కౌర్, కుమార్తెలు ఉపేందర్, దామన్ అమృత్‌లు ఉన్నారు. చదువు పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో 1952లో బీఏ, 1954లో ఎంఏ పట్టాకేంబ్రిడ్జ్ నుంచి ఆర్థిక శాస్త్రంలో ట్రైపోస్ ఆక్స్‌ఫర్డ్ నుంచి ఎం.ఎ. డి.ఫిల్ (1962) హానరిస్ కాసా నుంచి డి.లిట్ 1982-85 మధ్య ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేశారు. 1991-96 మధ్య పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రధాని పీఠాన్ని అధిష్టించిన తొలి హిందూ యేతర వ్యక్తిగా మన్మోహన్ రికార్డు సృష్టించారు. మన్మోహన్ సింగ్ హయాంలో అత్యధిక జీడీపీ (10.2శాతం) వృద్ధిరేటు నమోదైంది.

మిగతా 2లో..

# చిత్రపరిశ్రమ ప్రాధాన్యత అంశమే..

## మనమంతా కలిసి పనిచేద్దాం రండి..

- తెలంగాణ అభివృద్ధిలో మీరూ భాగస్వాములు కండి
- మీపైనా సామాజిక బాధ్యత ఉందని గుర్తించండి
- డ్రగ్స్ తదితర సామాజిక దుర్మార్గాలపై పోరాడండి
- సినీ ప్రముఖులతో భేటీలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**బెనిఫిట్ షో, టికెట్ల రేట్ల పెంపుకు అనుమతి ఇచ్చేదే లేదు**
**చిత్రపరిశ్రమ అభివృద్ధికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు**
**అభిమానులను కంట్రోల్ చేయాల్సిన బాధ్యత సెలబ్రిటీలదే**
**సినీ ప్రముఖులతో సమావేశంలో స్పష్టం చేసిన సీఎం**



**హైదరాబాద్,డిసెంబర్26(జనంసాక్షి):** కలిసి పనిచేద్దాం రండి..తెలంగాణ అభివృద్ధిలో మీరూ భాగస్వాములు కండి అని సిఎం రేవంత్ రెడ్డి చిత్రపరిశ్ర మను ఆహ్వానించారు. సినీ పరిశ్రమలో సమస్యలు, ప్రస్తుత పరిస్థితుల నేప థ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనిపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేర కు అధికారులకు ఆయన సూచనలు చేశారు. సినీ పరిశ్రమ కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. మంత్రివర్గ ఉపసంఘం సినీ పరిశ్రమకు చెందిన పలు అంశాలపై అధ్యయనం

మిగతా 2లో..

**రాజ్యాంగ సంస్థలపై మోదీ సర్కారు**

# గుత్తాధిపత్యం

**ప్రమాదంలో జాతిపిత మహాత్మాగాంధీ వారసత్వం**



పరోక్షంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై సోనియా ధ్వజం

రాజ్యాంగ సంస్థలను గుప్పిట్లో పెట్టుకున్నారు : ఖర్గే

బెళగావిలో సిడబ్ల్యూసి సమావేశాలు ప్రారంభం

2లో


## పట్నం నరేందర్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోర్టును కోరుతాం

**విచారణను ప్రభావితం చేసే విధంగా మీడియా సమావేశం పెట్టడం సరికాదు :ఐజీ సత్యనారాయణ**



**పరిగి(జనంసాక్షి):** కండిషనల్ బెయిల్‌పై ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, భారాస నేత పట్నం నరేందర్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టడంపై ఐజీ సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు .వికారాబాద్ జిల్లా పరిగి సీఐ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఐజీ సత్యనారాయణ మాట్లాడారు. విచారణను ప్రభావితం చేసే విధంగా నరేందర్ రెడ్డి మీడియా సమావేశం పెట్టడం సరైంది కాదన్నారు. అ విషయంలో బెయిల్ రద్దు చేయాలని కోర్టును కోరతామని ఐజీ చెప్పారు."లగచర్లలో 230 మంది పోలీసులతో బందోబస్తుగా ఏర్పాటు చేశాం. సురేష్ పథకం ప్రకారమే కలెక్టర్‌ను గ్రామంలోకి తీసుకెళ్లాడు.

మిగతా 2లో..



## హైదరాబాద్‌లో వర్షం..

**పెరిగిన చలి తీవ్రత**

**హైదరాబాద్(జనంసాక్షి):** అల్పపీడనం ప్రభావంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం మోస్తరు వర్షం కురిసింది. వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని సికింద్రాబాద్, తిరుమలగిరి, జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, బోరబండ, కూకట్‌పల్లి, బాచుపల్లి, తార్నాక, కోఠి, నాంపల్లి, హిమాయత్ నగర్ తదితర ప్రాంతాల్లో వర్షానికి

మిగతా 2లో..

## గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్లు కొట్టివేత

**హైదరాబాద్(జనంసాక్షి):** గ్రూప్-1 పరీక్షపై పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లతో పాటు పలు అంశాలపై అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రిజర్వేషన్లు తేలేంతవరకు గ్రూప్-1 ఫలితాలు ప్రకటించవద్దని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. ఫలితాలు నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషన్లను కొట్టివేసింది.



## ఆరు గ్యారంటీల అమలెక్కడ?



**భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఆరు గ్యారంటీలు ప్రకటించి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను కూడా అటకెక్కించారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టుచేయడం దుర్మార్గమైన చర్య అని కేటీఆర్

మిగతా 2లో..

## భారాస నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు

**బెయిల్ మంజూరు**

**హైదరాబాద్(జనంసాక్షి):** బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు సమయంలో దురుసుగా ప్రవర్తించారంటూ ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈనేపథ్యంలో గురువారం ఉదయం నోటీసులు ఇచ్చేందుకు మారేడ్‌పల్లిలోని

మిగతా 2లో..





## కామారెడ్డిలో కలకలం

**ఒకే చెరువులో విగతజీవులుగా కనిపించిన ఎస్సై, మహిళా కానిస్టేబుల్, మరో యువకుడి మృతదేహాలు**


**పోస్టుమార్టం తర్వాతే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి..**
**ముమ్మర దర్యాప్తు చేస్తున్నాం: జిల్లా ఎస్పీ సింధు శర్మ**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):** పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేగింది. ఒకే రోజు ముగ్గురు సిబ్బంది అదృశ్యం కాగా ఇద్దరు చెరువులో విగతజీవులుగా కనిపించారు. ఓ ఎస్సై, లేడీ కానిస్టేబుల్ సహా కంప్యూటర్ ఆపరేటర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట ఠాణాలో పనిచేస్తోన్న కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట సహకార సంఘంలో ఆపరేటర్‌గా పని చేస్తోన్న నిఖిల్ అనే యువకుడు ఒకేసారి అదృశ్యం కావడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు ఒడ్డున వారి వస్తువులు కనిపించడంతో పోలీసులు బుధవారం రాత్రి గాలింపు చేపట్టారు. అర్ధరాత్రి సమయానికి శ్రుతి, నిఖిల్ మృతదేహాలు లభ్యమయ్యాయి. అటు, జిల్లా ఎస్పీ సింధుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు

మిగతా 2లో..

**భారత్‌పై చైనా**

# జలయుద్ధం




**సరిహద్దు వద్ద అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుకు చైనా శ్రీకారం!**

**త్రీగోర్జెస్ డ్యామ్ కంటే కొత్త జలాశయం సామర్థ్యం మూడురెట్లు అధికం**

**బీజింగ్(జనంసాక్షి):** ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ డ్యామ్ నిర్మాణానికి చైనా ఆమోదం తెలిపింది. టిబెట్ తూర్పు అంచులో యార్లంగ్ జంగ్బో నది దిగువ భాగంలో ఈ జలాశయాన్ని నిర్మించనున్నట్లు అక్కడి మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 300బిలియన్ కిలోవాట్ అవర్స్ అని 2020లో ఆ దేశానికి చెందిన పవర్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ అంచనావేసింది. ప్రస్తుతం చైనాలో ఉన్న అతి పెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్ సామర్థ్యం 88.2 బిలియన్ కిలోవాట్ అవర్స్. అంటే కొత్త జలాశయం సామర్థ్యం దానికి మూడురెట్లు అధికం. టిబెట్‌లో జన్మించిన బ్రహ్మపుత్ర నది (దీనిని టిబెట్‌లో యార్లంగ్ జంగ్బోగా పిలుస్తారు) భారత్ గుండా బంగ్లాదేశ్‌లోకి ప్రవహిస్తోంది. మన దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు ఇది వరదాయిని. ఈ నదీ జలాల ప్రవాహ తీరు, పంపిణీ వంటి అంశాలపై సమాచార మార్పిడి కోసం భారత్-చైనా మధ్య ఒప్పందం ఉంది. వర్షాకాలంలో ఈ నదికి విపరీతంగా వరదలు వస్తుంటాయి. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో అపారనష్టాన్ని కలగజేస్తుంటాయి. ఒప్పందం ప్రకారం మే 15వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు బ్రహ్మపుత్ర జలసంబంధ (హైడ్రలాజికల్) విషయాల్ని ఎగువనున్న చైనా దిగువనున్న భారత్‌తో పంచుకోవాల్సి ఉంది. ముఖ్యంగా వరదలొచ్చే అవకాశం ఉన్నప్పుడు నదీ మట్టాల్ని దిగువనున్న దేశాలకు తెలియజేయాలి. కానీ, ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు

మిగతా 2లో..

**అజర్ బైజన్ ఎయిర్‌లైన్స్ ప్రమాదంలో**

## కుట్రకోణం!

**విమానంపై రంధ్రాలు ఏర్పడటంపై పలు అనుమానాలు**

**ఆక్టావ్(జనంసాక్షి):** అజర్ బైజన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన జె2-8243 విమానం కూలిపోవడంతో 38 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. ఈ క్రమంలో పలు కుట్రకోణాలు వినిపిస్తున్నాయి. అజర్ బైజన్‌లోని బాకు నగరం నుంచి రష్యా లోని చెచెన్ ప్రాంతానికి చెందిన గ్రోజ్నికి ప్రయాణిస్తుండగా కజఖ్‌స్థాన్ లోని ఆక్టావ్‌లో ఈ విమానం కూలిపోయింది. పక్షి ఢీకొనడంతో పైలట్ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తుండగా ప్రమాదం జరిగిందని రష్యా ఏవియేషన్ పేర్కొంది. అయితే, ప్రమాద దృశ్యాలను చూసిన నెటిజన్లు మాత్రం పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఆ సమయంలో రష్యా-ఉక్రెయిన్ మధ్య దాడులు జరగడమే

మిగతా 2లో..





## ఉత్తరాది గజ..గజ..

**హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్‌లపై పరుచుకున్న మంచుదుప్పటి..**

**మంచు కారణంగా జాతీయ రహదారుల మూసివేత.. పలు రాష్ట్రాల్లో పెరిగిన చలిగాలులు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, ఉత్తరాఖండ్ లపై దట్టమైన మంచు దుప్పటి పరుచుకుంది. దట్టమైన మంచుతో పలు జాతీయ రహదారులను మూసివేసినట్లు అధికారులు ప్రకటించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో మూడు జాతీయ రహదారులతో పాటు సుమారు 266 రహదారులు మూసివేయబడ్డాయి. మూసివేసిన 266 రహదారుల్లో సిమ్లాలో 123, లాహౌల్‌లో 36, స్పితి, కులులో

మిగతా 3లో..

## ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపేదిలేదు

**అదంత తేలికైన విషయం కాదు:రష్యా**

**మాస్కో(జనంసాక్షి):** ఉక్రెయిన్‌తో యుద్ధం తేలిగ్గా ఆపేదిలేదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ గురువారం తేల్చిచెప్పారు. రష్యా, పొరుగు దేశాల్లో సుదీర్ఘకాలం శాంతి నెలకొనేలా చట్టబద్ధమైన ఒప్పందాన్ని మాస్కో కోరుకుంటోందని పేర్కొన్నారు. ఇప్పట్లో సంధికి మార్గాలు కనిపించడంలేదన్నారు. ఒక వేళ బలహీనమైన ఒప్పందం చేసుకొంటే.. పశ్చిమ దేశాలు మళ్లీ ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరా చేసి బలోపేతం చేస్తామని రష్యా అనుమానిస్తున్నట్లు తెలిపారు."రష్యా భద్రతకు హామీ ఇచ్చే షరతులన్న చట్టపరమైన ఒప్పందం మాకు అవసరం. ఆ సంధిని ఉల్లంఘించలేని విధంగా దానిని తయారు చేయాలి. అదే సమయంలో మా పొరుగు దేశాల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకోవాలి"

మిగతా 3లో..

## ఇండియాకూటమిలో భగ్గుమన్న విభేదాలు

**ఆప్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు..?**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రతిపక్ష ఇండియా కూటమిలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ముఖ్యంగా కూటమి భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆప్ మధ్య వైరం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆమ్ ఆద్మీ పార్టీపై కాంగ్రెస్ ఆరోపణలతో ఈ వైరం మరింత ముదురుతోంది. తాజాగా ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని బయటకు పంపించేందుకు అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆమ్ ఆద్మీ పార్టీ ఇస్తున్న ఎన్నికల హామీలపై కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల సందర్భంగా ఆచరణ సాధ్యం కాని హామీలు అమలు చేస్తామని కేజ్రీవాల్ ప్రజలను

మిగతా 2లో..



### మచ్చలేని మహా మనిషి.. ఆర్థిక సంస్కరణల ఋషి..

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్

# ఇకలేరు

మన్మోహన్ హయాంలోనే వెనుకబడిన వర్గాలకు 27శాతం సీట్ల కేటాయిం పు జరిగింది. 1987లో మన్మోహన్‌కు పద్మవిభూషణ్ ప్రదానం.ప్రణాళిక సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గానూ బాధ్యతలు నిర్వహించారు.ప్రధానిగా రోజూ 18 గంటల పాటు అవిశ్రాం తంగా పనిచేశారు. 2005లో సమా చార హక్కు చట్టాన్ని తీసుకొచ్చారు. 2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. 2017లో ఇందిరా గాంధీ శాంతి బహుమతి అందుకు న్నారు.1993, 94లో ఉత్తమ ఆర్థిక మంత్రిగా యూరో మనీ అవార్డు అందుకున్నారు.1998-2004 మధ్య రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు.2010లో వరల్డ్ స్టేట్స్ మెన్ అవార్డు వరించింది.ఫోర్బ్స్ అత్యంత శక్తిమంతుల జాబితాలోనూ మన్మోహన్‌కు చోటు దక్కింది.



మన్మోహన్ సింగ్ ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

### దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసిన గొప్ప వ్యక్తి

**మాజీ ప్రధాని మృతి పట్ల ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డిగ్ర్భాంతి**

**హైదరాబాద్(జనంసాక్షి):**మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడం పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని, ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం సహా దేశ అత్యున్నత అనేక పదవులు నిర్వహించిన ఘనత మన్మోహన్ సింగ్ కు దక్కుతుందని చిన్నారెడ్డి పేర్కొన్నారు.ఆర్థిక శాఖ మంత్రిగా, రిజర్వ్ బ్యాంకు గవర్నర్ గా, కేంద్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ గా, యూజీసీ ఛైర్మన్ గా వంటి అనేక పదవులు నిర్వహించిన గొప్ప మేధావి మన్మోహన్ సింగ్ అని చిన్నారెడ్డి కొనియాడారు.మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులకు చిన్నారెడ్డి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

### గొప్ప ఆర్థిక వేత్త, మహా నాయకుడు

గొప్ప కుమారుడిని కోల్పోయిందని సీఎం అవేదన వ్యక్తం చేశారు. మాజీ ప్రధానమంత్రి మృతిపై తన సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని సీఎం తెలియజేశారు.. నిర్ణయాల తీసుకోవడంలో సమ గ్రత, పారదర్శకత అన్నింటికీ మించి మానవీయ స్పర్శను జోడించ ేవారని, నవ భారత శిల్పుల్లో మన్మోహన్ సింగ్ ఒకరని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు..రాజకీయ, ప్రజా జీవితంలో గౌరవ మర్యాదలు ఎలా పాటించాలో తన ప్రవర్తన ద్వారా చూపించారని సీఎం పేర్కొన్నారు.

## చిత్ర పరిశ్రమ అభివృద్ధే గురించే ముఖ్యమంత్రిని కలిశాం

**ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు**

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం అనంతరం ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు మీడియాతో మాట్లాడారు. సీఎంతో చర్చించిన విషయాల గురించి తెలియజేశారు.తెలుగు చిత్ర పరిశ్ర మ అభివృద్ధే ఈ మీటింగ్ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. తెలుగు సినిమా స్థాయిని పెంచేందుకు ముఖ్యమంత్రి తమకు కొన్ని విషయాల్లో దిశా నిర్దేశం చేశారని చెప్పారు. ఇటీవలి కాలంలో పరిశ్రమ, ప్రభుత్వం మధ్య దూరం ఏర్పడిందనే ప్రచారం జరిగిందని, అదంతా కేవలం అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. త్వరలోనే మరోసారి సీఎంతో భేటీ అవుతామని చెప్పారు.

## పట్నం నరేందర్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోర్టును కోరతాం

పోలీస్ నిఘా వైఫల్యం అనడం సరికాదు. ఫార్మా భూసేకరణ విషయంలో నరేందర్ రెడ్డిని అరెస్టు చేయలేదు. కలెక్టర్‌పై దాడి కేసులోనే అరెస్టు చేశాం. ఈ కేసులో ఎవరినీ కొట్టలేదు. అనుమానితులను మూడు విడతల్లో అదుపులోకి తీసుకున్నాం.. ఘటనతో సంబంధం లేని వారిని వదిలేశాం. ప్రెస్‌మీట్‌లో అవాస్తవాలు చెప్పడం మానేయాలి. ఏ ప్రభుత్వం కూడా రైతులకు బేడీలు వేయమని చెప్పదు. సురేష్ వాయిస్ రికార్డు మా దగ్గర ఉంది. అతనే మొత్తం ప్లాన్ చేసింది. సమయం వచ్చినప్పుడు బయ టపెడతాం. పట్నం నరేందర్ రెడ్డి ఫోన్ పాస్‌వర్డ్ చెప్పడం లేదు. నరేందర్ రెడ్డి, సురేష్.. విచారణకు సహకరించడం లేదు" అని ఐజీ తెలిపారు.

## భారాస నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు

ఆయన నివాసానికి టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున్న శ్రీనివాస్ నివాసానికి చేరుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని మాసబ్‌ట్యాంక్ పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేస్తున్నదని విమర్శించారు. ప్రశ్నించిన వారిని కాంగ్రెస్ సర్కార్ వేధిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 14 ఏండ్లపాటు ఉద్యమంలో పాల్గొన్నానని, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా పనిచేశానని చెప్పారు. తెల్లవారుజామున వచ్చి ఇంటి డోర్లు కొట్టడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం కుట్రపూరితంగా కేసులు పెడుతున్నదని మండిపడ్డారు. ఎన్నికేసులు పెట్టినా, ఎంత నిర్బంధం విధించినా ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు.కాగా ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది..

## సందేశాత్మక సినిమాలను విస్మరించిన చిత్రరంగం

**టిక్కెట్ల రేట్ల పెంపు సామాన్యులపై భారం కాదా?**

**చిత్రపరిశ్రమ తీరుపై మండిపడ్డ సీపీఐ నేత నారాయణ**

**అమరావతి(జనంసాక్షి):** సాధారణంగా ప్రయోజనాత్మ మైన సినిమాలు తీస్తే ప్రజలు ఆదరిస్తారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. మధ్యమధ్యలో మంచి సందేశాత్మక సినిమాలైనా ఒకోసారి ఆడకపోవడం కారణంగా నష్టాలు రావడంతో నిర్మాతలు ముందుకు రావడంలేదని నారాయణ అన్నారు. వేలకోట్లు లాభాలు ఆర్జించే సినిమాలకు టిక్కెట్లు రేట్లు పెంచి సామాన్యులను గుల్ల చేయడాన్ని నారాయణ తప్పుపట్టారు. గురు వారం మీడియాతో మాట్లాడుతూ.. కొందరు నిర్మాతలు వందల కోట్లతో చిత్రాలు నిర్మించి, అధికంగా వసూలు చేసే నిమిత్తం ప్రేక్షకులపై భారం వేస్తున్నారని తెలిపారు. ఆ క్రమంలో బ్లాక్‌లో టికెట్లు అమ్మేందుకు ప్రయ త్నిస్తున్నారని మండిపడ్డారు. అదే విధంగా ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహాలు పొందుతూ కూడా ప్రభుత్వం అనుమతితోనే టికెట్ల ధరలు పెంచడానికి ప్రయత్నిస్తూ ఉంటారన్నారు. ఒకవైపు వేయి కోట్ల పెట్టుబడి పెట్టి రెండు వేల కోట్ల వసూళ్ళతో విజయం సాధించామని గర్వంతో ప్రకటించుకొనే ఈ భారీ చిత్ర నిర్మాతలకు అసలు ప్రాథమికంగా ప్రభుత్వాలు సహాయం చేయడమేమిటి అని ప్రశ్నించారు. సందేశాత్మక చిత్రాలకు కొంతైనా సహాయం చేయకుండా మొండి చేయి చూపిస్తున్నారని విమర్శించారు. నేర ప్రవృత్తి, హింసాయుత ఇతివృత్తం, అసభ్య వ్యంగ్యార్థ సంభాషణలు కలిగిన సినిమాలను ప్రభుత్వాలెందుకు ప్రోత్సహించాలని నిలదీశారు.



# చిత్రపరిశ్రమ ప్రాధాన్యత అంశమే..

చేయనుంది. రానున్న రోజుల్లో ఇండ స్ట్రీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, అదనపు షోల నిర్వహణకు సంబంధిం చిన మార్గదర్శకాలు, టికెట్ రేట్ల పెంపుపై నివేదిక రూపొందించి ప్రభుత్వా నికి అందజేయనుంది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టనుంది. సినీ పరిశ్రమ కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించిన నేపథ్యంలో ఇండస్ట్రీ ప్రముఖులు తమ సూచనలను ఉప సంఘం దృష్టికి తీసుకెళ్లనున్నారు.తెలుగు సినిమా ఇండస్ట్రీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. సినిమా పరిశ్రమ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు నేతృత్వంలో సినీ ప్రముఖులు సిఎం రేవంత్ ను కలిశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. సినీ పరిశ్రమకు చెందిన పలు అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని చెప్పారు. రానున్న రోజుల్లో ఇండస్ట్రీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై నివేదిక రూపొందించి సర్కార్ అందజేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్‌లో ఇండస్ట్రీ సోషల్ రెస్పాన్సిబిలిటీతో ఉండాలని చెప్పారు. డ్రగ్స్ క్యాంపెయిన్, మహిళా భద్రత క్యాంపెయిన్‌లో చొరవ చూపాలని, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజంను ప్రమోట్ చేయాలని సిఎం సూచించారు. ఈ క్రమంలో సినీ పరిశ్రమను ప్రోత్సహించడమే తమ ముఖ్య ఉద్దేశమని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండస్ట్రీ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సహకారం అందిస్తుందని భరోసానిచ్చారు. సినీ ప్రముఖులతో సీఎం భేటీ గురువారం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధిలో సినీ పరిశ్రమ సామాజిక బాధ్యతతో ఉండాలని ముఖ్యమంత్రి సినీ పెద్దలకు సూచించారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో సుమారు 50 మంది సీఎంతో సమావేశమయ్యారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీజీపీ జితేందర్ తదితరులు హాజరయ్యారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట, అల్లు అర్జున్ అరెస్ట్ అనంతర పరిణామాల నేపథ్యంలో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. సమావేశం ప్రారంభంలో సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన వీడియోను సినీ ప్రముఖుల ఎదుట సీఎం ప్రదర్శించారు. అనంతరం పలువురు సినీ పెద్దలు తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రితో పంచుకున్నారు. ప్రభుత్వం వైఖరిని సీఎం వారికి వివరించారు.'ప్రభుత్వం ఇండస్ట్రీతోనే ఉంది. శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. అభిమానుల్ని కంట్రోల్ చేసుకోవాల్సిన బాధ్యత సెలబ్రిటీలదే. తెలంగాణ అభివృద్ధిలో పరిశ్రమ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన, మహిళా భద్రతపై ప్రచారంలో సినీ ప్రముఖులు చొరవ చూపాలి. ఆలయ పర్యటకం, ఎకోటూరిజంను ప్రచారం చేయాలి. ఇన్వెస్ట్‌మెంట్ల విషయంలోనూ ఇండస్ట్రీ సహకరించాలి. ఇకపై బౌన్సర్ల విషయంలో సీరియస్‌గా ఉంటాం' అని ముఖ్యమంత్రి రేవంత్ తేల్చి చెప్పారు. సినీ పరిశ్రమ సమస్యలను ప్రముఖులు మా దృష్టికి తెచ్చారు. అనుమానాలు, అపోహలు, ఆలోచనలు పంచుకున్నారు. మా ప్రభుత్వం ఇండస్ట్రీకి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. సినీ పరిశ్రమను ప్రోత్సహించడమే మా ముఖ్య ఉద్దేశం. 8 సినిమాలకు మా ప్రభుత్వం స్పెషల్ జీవోలు ఇచ్చింది. పుష్ప సినిమాకు పోలీసు గ్రౌండ్ ఇచ్చాం. తెలుగు ఇండస్ట్రీకి ఒక బ్రాండ్ సృష్టించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఐటీ, ఫార్మాతో పాటు మాకు ఈ రంగం కూడా ముఖ్యమే. తెలంగాణలో అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి గద్దర్ అవార్డును తీసుకొచ్చాం. ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్యవర్తిగా ఉండాలని దిల్ రాజును ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించాం. సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. పరిశ్రమ కూడా కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. హాలీవుడ్, బాలీవుడ్ హైదరాబాద్ వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో పెద్ద సదస్సులు నిర్వహించి ఇతర సినీ పరిశ్రమలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తున్నాం. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి నైపుణ్యాలను పెంచి ఉద్యోగాలు కల్పిస్తున్నాం.హైదరాబాద్ ప్రపంచ సినిమా రాజధాని కావాలనేదే మా కోరిక. యూనివర్సల్ లెవల్‌లో స్టూడియో సెటప్‌లు ఉండాలి' అని తెలిపారు. మర్రి చెన్నారెడ్డి, అక్కినేని వల్లే పరిశ్రమ హైదరాబాద్‌కు వచ్చిందని దర్శకుడు త్రివిక్రమ్ చెప్పారు. 'తెలంగాణలో అద్భుతమైన పర్యటన ప్రదేశాలున్నాయి. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను హైదరాబాద్‌లో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అందరు సీఎంలూ పరిశ్రమను బాగానే చూసుకున్నారు. ఈ ప్రభుత్వం కూడా మాకు ప్రోత్సాహం అందిస్తోంది. దిల్‌రాజును ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించడం హర్షణీయం అని దర్శకుడు రాఘవేంద్రరావు అన్నారు. 'నేను చిన్నప్పటి నుంచి పరిశ్రమను చూస్తున్నా. హైదరాబాద్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాలి. చిన్న చిన్న విషయాలను పట్టించుకోవద్దని నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి అన్నారు. సంధ్య థియేటర్ ఘటన మమల్నీ ఎంతగానో బాధించింది. ఎన్నికల ఫలితాల మాదిరిగానే సినిమా రిలీజ్ ఫస్ట్‌డే ఉంటుంది. సినిమా రిలీజ్‌లో పోటీ వల్లే ప్రమోషన్ కీలకంగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా సినిమాలు విడుదలవుతున్నందున విస్తృతంగా ప్రమోషన్లు చేస్తున్నాం అని మురళీ మోహన్ అన్నారు. ప్రభుత్వంపై మాకు పూర్తి నమ్మకం ఉంది. ప్రభుత్వం సాయంతోనే ఆ రోజుల్లో సినీ పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చింది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ సహా అన్ని ఏజెన్సీలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా ఉండాలి. నగరాన్ని ఇంటర్నేషనల్ ఫిల్మ్ డెస్టినేషన్‌గా చేయాలనేది మా కల అని నిర్మాత దగ్గుబాటి సురేశ్ బాబు అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం అనంతరం ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు మీడియాతో మాట్లాడారు. సీఎంతో చర్చించిన విషయాల గురించి తెలియజేశారు. తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధే ఈ మీటింగ్ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. తెలుగు సినిమా స్థాయిని పెంచేందుకు ముఖ్యమంత్రి తమకు కొన్ని విషయాల్లో దిశా నిర్దేశర చేశారని చెప్పారు. ఇటీవలి కాలంలో పరిశ్రమ, ప్రభుత్వం మధ్య దూరం ఏర్పడిందనే ప్రచారం జరిగిందని, అదంతా కేవలం అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. త్వరలోనే మరోసారి ముఖ్యమంత్రితో భేటీ అవుతామని చెప్పారు. తెలుగు సినీ పరిశ్రమ పట్ల తనకు ఉన్న విజన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాతో పంచుకున్నారు. తెలుగు సినిమాను ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం, పరిశ్రమ కలిసి పనిచేయాలనే దానిపై ఆయన చర్చించారు. అందుకు అనుగుణంగా మేమంతా కలిసి వర్క్ చేస్తాం. ఇండియన్ సినిమా వాళ్లే కాకుండా హాలీవుడ్ వాళ్లు కూడా హైదరాబాద్‌లో షూటింగ్స్ చేసుకునేలా ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలనే విషయంపై చర్చించారు. దానిపై చిత్రపరిశ్రమ మొత్తం మరోసారి చర్చించుకుని ఎఫ్‌డీసీ ద్వారా ఆయనకు సలహాలు, సూచనలు ఇస్తాం. హైదరాబాద్‌ను సినిమా ఇండస్ట్రీకి ఇంటర్నేషనల్ హబ్‌గా మార్చేందుకు అడుగులు వేస్తాం. డ్రగ్స్ విషయంలో ప్రభుత్వానికి సహకరిస్తాం. ఈ మధ్య జరిగిన కొన్ని అనివార్య సంఘటనల వల్ల పరిశ్రమ, ప్రభుత్వం మధ్య దూరం పెరిగిందనే ప్రచారం జరుగుతోంది. అది అపోహ మాత్రమే. ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నేను బాధ్యతలు తీసుకుని వారం రోజులు అయింది. యూఎస్ వెళ్లి రాగానే ముఖ్యమంత్రిని కలిశాను. ఇండస్ట్రీ అభివృద్ధి మాత్రమే ఇక్కడ విషయం. బెనిఫిట్ షోలు, టికెట్ రేట్లు అనేది చిన్న విషయం. అది ముఖ్యం కాదు. ఇంటర్నేషనల్‌గా తెలుగు చిత్రపరిశ్రమను అభివృద్ధి చేయడం అనేది అజెండా' అని దిల్ రాజు తెలిపారు.

**శాంతిభద్రతల్లో రాజీపడే ప్రసక్తే లేదు: సీఎం రేవంత్**

శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అభిమానులను నియంత్రించాల్సిన బాధ్యత సెలబ్రిటీలదేనని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇకపై బౌన్సర్లపై విషయంలో సీరియస్‌గా ఉంటామన్నారు. టికెట్ల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. అసెంబ్లీలో చేసిన ప్రకటనకే కట్టుబడి ఉంటామన్నారు. సినీ పరిశ్రమకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరిశ్రమ అభివృద్ధికి, ఇండస్ట్రీ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో సినీ పరిశ్రమ సామాజిక బాధ్యతతో ఉండాలని చెప్పారు. మహిళల భద్రత, డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చొరవ చూపాలన్నారు.

## కామారెడ్డిలో కలకలం

ఎస్సై ఆచూకీ కోసం గాలించగా కొద్దిసేపటి తర్వాత ఎస్సై మృతదేహం లభ్యమైంది. గాంధారి మండల కేంద్రానికి చెందిన శ్రుతి బీబీపేటలో పని చేస్తుండగా.. మెదక్ జిల్లాకు చెందిన సాయికుమార్ గతంలో బీబీపేట ఎస్సైగా పని చేసి బదిలీపై భిక్కనూరు వచ్చారు. ఎస్సై అక్కడ పని చేసిన సమయంలోనే వీరిద్దరికీ పరిచయం ఏర్పడిందని పోలీసులు భావిస్తున్నారు. వీరి ఆత్మహత్యకు గల కారణాలేంటి.? అసలేం జరిగింది.? అనే దానిపై ఆరా తీస్తున్నారు. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సెల్‌ఫోన్ బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి స్విచ్ఛాఫ్ రావడంతో పోలీసులు ఆయన కోసం ఆరా తీయడం ప్రారంభించారు. అటు, బీబీపేట ఠాణాలో పనిచేస్తోన్న లేడీ కానిస్టేబుల్ శ్రుతి బుధవారం ఉదయం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నట్లు స్టేషన్‌లో చెప్పి బయటకు వచ్చారు. మధ్యాహ్నం అయినా కూతురు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బీబీపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీరు గాంధారి మండలం గుర్జాల్‌లో ఉంటున్నారు. అయితే, శ్రుతి స్టేషన్ నుంచి ఎప్పుడో వెళ్లిపోయినట్లు పోలీసులు తెలపడంతో పేరెంట్స్ అధికారులను సంప్రదించారు. ఫోన్ సిగ్నల్ ఆధారంగా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఎస్పీ ఆధ్వర్యంలోని బృందాలు వెంటనే అక్కడికి చేరుకున్నాయి. బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చెరువు వద్ద కానిస్టేబుల్ శ్రుతి సెల్‌తో పాటు బీబీపేటకు చెందిన నిఖిల్ సెల్ కూడా దొరికింది. అలాగే, భిక్కనూరు ఎస్సై సాయికుమార్‌కు చెందిన చెప్పులు, నిఖిల్ చెప్పులు కనిపించాయి. అనుమానంతో చెరువులో గాలించగా లేడీ కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రుతి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఎస్సై ఫోన్ స్విచ్ఛాఫ్ అని వస్తుండడంతో ఆయన ఆచూకీ లభించలేదు. ఏం జరిగి ఉంటుందన్నది అంతుచిక్కడం లేదు. ముగ్గురూ కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్సై సాయికుమార్ మృతదేహం సైతం లభ్యం కావడంతో ఏం జరిగిందనే దానిపై ఆరా తీస్తున్నారు.

## భారత్‌పై చైనా జలయుద్ధం

పెరిగిన తర్వాత చైనా ఆ సమాచారాన్ని భారత్‌కు సరిగా ఇవ్వడంలేదు. బ్రహ్మపుత్ర నదీ జలాలపై తొలిసారిగా 2002లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2008, 2013, 2018లో నాటి పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేశారు. చివరి సారిగా కుదిరిన ఒప్పందం 2023తో ముగిసింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ తర్వాత కొత్త ఒప్పందం జరగలేదు. ఈ తరుణంలో ప్రాజెక్టు నిర్మాణానికి చైనా సిద్ధమవడం కలవర పెడుతోంది.ఒక వేళ చైనా ప్రతిపాదిత ప్రాజెక్టును పూర్తి చేస్తే భారత్‌కు పక్కలో బల్లెంలా మారే ప్రమాదముంది. ఎండాకాలంలో బ్రహ్మపుత్ర నీటిని మళ్లించేందుకు బీజింగ్‌కు అవకాశం ఏర్పడుతుంది. దీంతో అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రమాదముంది. మరోవైపు వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నదికి భారీగా వరద ఉంటుంది. ఒకేసారి పెద్దమొత్తంలో నీటిని విడుదల చేస్తే.. దిగువనున్న ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. ఈ ప్రాజెక్టు భారత్-చైనా సరిహద్దుకు కేవలం 30కి.మీ దూరంలోనే ఉంది. అందువల్ల రక్షణ పరంగానూ భారత్‌కు సమస్యలు పొంచి ఉన్నాయి.

### రాజ్యాంగ సంస్థలపై మోదీ సర్కారు

# గుత్తాధిపత్యం



**బెంగళూరు,డిసెంబర్26(జనంసాక్షి):** మహాత్మాగాంధీ వారసత్వం ముప్పులో ఉం దని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఈ రోజు అన్నారు. ఢిల్లీలో అధికారంలో ఉన్న వారు, వారికి మద్దతు ఇచ్చే సంస్థల నుంచి మహాత్మా గాంధీ వాం సత్వం ముప్పును ఎదుర్కొంటోందని అన్నారు. పరోక్షంగా బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్‌పై సోనియా గాంధీ దాడి చేశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో గాంధీ సిద్ధాంతాలు, సంస్థలు దాడులకు గురవుతు న్నాయని అన్నారు. ఈ శక్తుల్ని ఎదుర్కో వడానికి మన సంకల్పాన్ని పునరుద్ధరించడం తమ పార్టీ పవిత్ర కర్తవ్యమని ఆమె చెప్పారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమా వేశాలు కర్ణాటక బెలగావిలో జరుగుతోంది. శతాబ్దం క్రితం ఇదే వేదికగా మహాత్మాగాంధీ కాంగ్రెస్‌కి అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి అనారోగ్య కారణాల వల్ల సోనియా గాంధీ హాజరు కాలే దు. ఈ సందర్భంగా లిఖితపూర్వక ప్రక టన లో రాజ్యాంగ విలువలు, గాంధీ ఆశయా లను పరిరక్షించడం పార్టీ కర్తవ్యమని పేర్కొ న్నారు. మహాత్మా గాంధీ బెలగావిలో కాంగ్రెస్ అధ్యక్షుడవ్వడం పార్టీకి, స్వాతంత్య్ర ఉద్యమానికి మలుపు అని ఆమె తన సందేశంలో పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కోసం ఎలాంటి పోరాటం చేయని సంస్థలు మహాత్మా గాంధీని తీవ్రంగా వ్యతిరేకించాయని, ఒక విషతుల్యమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశాయని, వీటి వల్లే ఆయన హత్య జరిగిందని, కేంద్రంలో అధికారంలో ఉన్న వారి వల్ల గాంధీ ఘటన ప్రమాదంలో పడిందని అన్నారు. న్యూఢిల్లీలో అధికారంలో ఉన్నవారు, వారి సిద్ధాంతాలు, సంస్థల నుంచి మహాత్ముడి వారసత్వానికి ముప్పు ఉందని చెప్పారు. ఇదే వేదిక నుంచి భాజపాపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగపరమైన సంస్థలను తమ గుప్పిట్లో ఉంచుకునేందుకు ఆ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. 'జవహర్‌లాల్ నెహ్రూ, గాంధీ సిద్ధాంతాలు, బీఆర్ అంబేద్కర్ గౌరవం కోసం చివరి శ్వాస వరకు మేమంతా పోరాడుతాం. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగపరమైన సంస్థలను భాజపా తన గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రయత్ని స్తోంది. ఎన్నికల పక్రియపై ప్రజల్లో విశ్వాసం క్రమంగా సన్నగిల్లుతోంది. ఈసీ నిష్పాక్షికతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల నియమావళిలో మార్పుల ద్వారా కేంద్రం ఏం చేయాలను కుంటోంది..?' అని ఖర్గే ప్రశ్నించారు. వచ్చే ఏడాదిలో పార్టీలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేస్తామని మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఎన్నిక ల్లో నెగ్గేందుకు అవసరమైన నైపుణ్యాలతో పార్టీని మరింత బలంగా సన్నద్ధం చేస్తామని స్పష్టం చేశారు.

## అజర్ బైజన్ ఎయిర్‌లైన్స్ ప్రమాదంలో కుట్రకోణం!

అందుకు కారణం. దానిని కీవ్‌కు చెందిన డ్రోన్‌గా భావించడం వల్లే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ కూల్చివేసినట్లు అనుమానిస్తున్నారు. ఉక్రెయిన్ డ్రోన్ దాడులను రష్యా తిప్పికొడుతున్న సమయంలోనే పైలట్ అప్రమత్తమై ఓ కాల్ పంపించారని కొన్ని మీడియా సంస్థల కథనాలు పేర్కొన్నాయి. అలాగే కొన్నిచిత్రాల్లో విమానం బాడీపై బుల్లెట్ ఆనవాళ్లు కనిపించినట్లు వెల్లడించాయి. అయితే, ఈ కథనాలపై కజఖ్‌స్థాన్ డిప్యూటీ ప్రధానిని మీడియా ప్రశ్నించగా కచ్చితమైన సమాధానం రాలేదు.ఇదిలాఉంటే.. నిన్న క్రిస్మస్ సమయంలో కూడా ఉక్రెయిన్‌పై రష్యా దాడుల ఉద్ధృతి కొనసాగింది. ఆ దేశంలోని పలు విద్యుత్తు కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని 70కిపైగా క్షిపణులు, 100కుపైగా డ్రోన్లతో దాడులు చేసింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్వయంగా ఈ వివరాలను వెల్లడించారు. రష్యా ప్రయోగించిన వాటిలో బాలిస్టిక్ మిసైల్స్ కూడా ఉన్నాయని తెలిపారు. తాము కనీసం 50 క్షిపణులను, పలు డ్రోన్లను కూల్చివేసినట్లు వెల్లడించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉద్దేశపూర్వకంగానే క్రిస్మస్ రోజున భీకర దాడులు జరిపించారని జెలెన్‌స్కీ ఆరోపించారు.

## ఇండియాకూటమిలో భగ్గుమన్న విభేదాలు

తప్పుదోవ పట్టిస్తున్నారంటూ హస్తం పార్టీ ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని బయటకు పంపించేందుకు ఆప్ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు కూటమి నుంచి కాంగ్రెస్‌ను బయటకు పంపించేలా ఇతర పార్టీలను ఒప్పించేందుకు ఆప్ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి దించేయాలన్న ప్రధాన లక్ష్యంతో సుమారు 24 విపక్ష పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి బీటలు వారుతున్నది. ఇప్పటికే కూటమిలో ఉన్న విభేదాలు లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్ఫుటం కాగా, ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్ గాంధీ పట్ల అందులోని పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. 'ఎన్నికల్లో విజయం సాధించి పెట్టలేని నాయకుడిని మనం ఇంకా ఎంతకాలం భరించాలి' అన్న ధోరణి ఆ పార్టీల్లో ఇటీవల అధికమైంది. రాహుల్ నాయకత్వంలో బీజేపీని ఎదుర్కోవడం కష్టమేనని, కాంగ్రెస్‌ను నమ్ముకుంటే తామూ మునగడం ఖాయమని ఆయా పార్టీల నేతలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రత్యామ్నాయంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నాయకత్వానికి జై కొడుతున్నారు.

## బోరుబావిలోనే చిన్నారి..

తెలిపారు. కోర్‌పుత్లీ జిల్లాలో చేతన అనే చిన్నారి తన తండ్రి పొలంలో ఆడుకుంటూ సోమవారం 700 అడుగుల బోరుబావిలో పడిపోయింది. 150 అడుగుల లోతు వద్ద బాలిక చిక్కుకునట్లు అధికారులు గుర్తించారు. తొలుత కుటుంబ సభ్యులు ఆ పాపను రక్షించేందుకు యత్నించగా.. మరింత కిందకు జారుకుంది. ఈ క్రమంలోనే ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించారు. పైపుతో బోర్‌లోకి ఆక్సిజన్ పంపిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మంగళవారం క్లిప్‌ల సాయంతో 30 అడుగులు పైకి లాగినట్లు తెలిపారు.'ఇప్పటికే 160 అడుగుల గొయ్యి తవ్వాం. ఇక చిన్నారి ఉన్న బోరుబావికి సమాంతరంగా రంధ్రం చేయాల్సి ఉంది. అది పైలింగ్ మిషన్‌తో కుదరదు. కాబట్టి మనుషులే తవ్వాల్సి ఉంటుంది. నేడు ఆ చిన్నారిని బయటకు తీస్తాం' అని ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి యోగేశ్ కుమార్ మీనా తెలిపారు. ప్రస్తుతం ర్యాట్ హోల్ మైనర్స్ సాయం తీసుకుంటునట్లు వెల్లడించారు.

## ఆరు గ్యారంటీల అమలెక్కడ? : కేటీఆర్

అన్నారు. ఎన్నికల ప్రచారంలో దళిత, బహుజన వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ తరపున ప్రశ్నిస్తున్నందుకే ఎర్రోళ్లపై కక్షగట్టి అక్రమ కేసులతో వేధించాలని చూస్తున్నారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా తెల్లవారుజామున ఎర్రోళ్ల ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారెంటీలను అటకెక్కించి, ఏడో గ్యారెంటీగా ఎమర్జెన్సీని ముఖ్యమంత్రి అమలుచేస్తున్నారు. ప్రజల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక.. నిర్బంధం, అణచివేతతో బీఆర్ఎస్ గొంతునొక్కే విఫల యత్నం చేస్తున్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో పూర్తిగా చేతిలెత్తేసి, ప్రధాన ప్రతిపక్షాన్ని ఎలా నియంత్రించాలనే దానిపైనే సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అక్రమంగా అరెస్టుచేసిన ఎర్రోళ్ళ శ్రీనివాస్ ను వెంటనే విడుదల చేయాలి. రోజురోజుకూ పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో పూర్తిగా చేతిలెత్తేసి, ప్రధాన ప్రతిపక్షాన్ని ఎలా నియంత్రించాలనే దానిపైనే సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అక్రమంగా అరెస్టుచేసిన ఎర్రోళ్ళ శ్రీనివాస్ ను వెంటనే విడుదల చేయాలి. తప్పుడు కేసులతో రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టాలని చూసే విష సంస్కృతికి చరమగీతం పాడాలి. బీఆర్ఎస్ పార్టీకి కేసులు కొత్తకాదు, అరెస్టులు అంత కన్నా కాదు.. ఆత్మగౌరవ పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో ఇలాంటి బెదిరింపు చర్యలకు భయపడే వారెవరూ లేరంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## తమిళనాడులో అదుపుతప్పిన శాంతిభద్రతలు

- డిఎంకెను గద్దె దించే వరకు చెప్పులు ధరించను
- రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై భీష్మ ప్రతిజ్ఞ




**కోయంబత్తూర్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నాయూనివర్సిటీలో ఓ విద్యార్థినిపై అత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టిస్తోంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పిపోయాయని, దీనికి అధికార డీఎంకే ప్రభుత్వమే కారణమని భాజపా విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై భీష్మ ప్రతిజ్ఞ చేశారు. డీఎంకే అధికారం కోల్పోయేంత వరకు తాను పాదరక్షలు ధరించబోనని ప్రతినబూనారు. గురువారం కోయంబత్తూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. డీఎంకే ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు నేను పాదరక్షలు ధరించను. చెప్పులు లేకుండానే నడుస్తా. ఎన్నికల్లో విజయం సాధించడానికి ఎప్పటిలాగే డబ్బులు ఎరగా చూపం. రూపాయి కూడా పంచకుండా ఎన్నికలకు వెళ్తాం. ఎన్నికల్లో విజయం సాధించేంత వరకు చెప్పులు ధరించను' అని అన్నామలై అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో చెడు అంతమైపోవాలని కోరుతూ కోయంబత్తూరులోని తన నివాసంలో ఆరు కొరడా దెబ్బలు భరించి... మురుగన్‌కు మొక్కు చెల్లించుకుంటానని అన్నారు. రాష్ట్రంలోని ఆరు మురుగన్ క్షేత్రాలను దర్శించుకునేందుకు 48 గంటలపాటు ఉపవాస దీక్ష చేపడతానన్నారు. మరోవైపు అన్నా యూనివర్సిటీకి చెందిన బాధిత విద్యార్థిని ఫిర్యాదుకు సంబంధించిన 'ఎఫ్ఐఆర్'ను లీక్ చేయడంపై అన్నామలై మండిపడ్డారు. ఆమె వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లేలా పోలీసు అధికారుల తీరు ఉందని విమర్శించారు. లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు జ్ఞానశేఖరన్‌పై రౌడీషీట్ తెరవలేదని, డీఎంకేతో అతడికున్న సంబంధాలే అందుకు కారణమని ఆరోపించారు. పక్కా ప్రణాళిక ప్రకారం కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

## విశాఖ ఉక్కుపై మోడీ సవతితల్లి ప్రేమ

- తక్షణమే సెయిల్‌లో విలీనం చేయాలి
- కర్నాటకపై ఉన్న ప్రేమ విశాఖపై లేదు
- పిసిసి చీఫ్ షర్మిల ఘాటు విమర్శలు



**విజయవాడ, డిసెంబర్26 (జనంసాక్షి) :** విశాఖ ఉక్కును ఉద్ధరిస్తున్నామని కేంద్రం చెప్తున్నవన్నీ అసత్యాలేనని, స్టీల్ ఎ÷-లాంట్ మీద కేంద్రానికి ఉండేది ఎన్నటికీ సవతి తల్లి ప్రేమనేనని పిసిసిచీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. మోడీకి కన్నడ ఉక్కు మీదున్న ప్రేమ ఆంధ్రుల హక్కు మీద లేదని తీవ్ర విమర్శలు చేశారు. విశాఖ స్టీల్ ను దివాలా తీయించే ఎత్తుగడలు సాగుతూనే ఉన్నాయని,- మోడీ సన్నిహితులకు పదో పరక కింద అమ్మే కుట్రలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రైవేటీకరణ లేదు అంటూనే రూపాయి సహాయం చేయకుండా ప్లాంట్ ను మూసేసే కుట్ర కేంద్రం చేస్తుందన్నారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి ఊఆ కుమారస్వామి ప్రాతినిధ్యం వహించే రాష్ట్రంలో కర్ణాటక స్టీల్ ప్లాంట్ కి రూ.15వేల కోట్ల సహాయం అందించి ఆ స్టీల్ ప్లాంట్ ను బ్రతికించారని అన్నారు. కేవలం 243 మంది పనిచేసే కర్ణాటక స్టీల్ ప్లాంట్ కు పెద్ద మొత్తంలో నిధులు ఇచ్చిన కేంద్రానికి.. 26 వేల మంది పనిచేసే విశాఖ స్టీల్ ను ఆదుకోవడానికి మనసు లేదని విమర్శించారు. ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం ఉండే జెడిఎస్ రూ.15వేల కోట్లు నిధులు రాబట్టుకుంటే.. బిజెపికి ఊపిరి పోసిన టీడీపీ,- జనసేన పార్టీలు మోడీకి సలాం కొడుతున్నాయని.. 18 మంది ఎంపీలు కేంద్రానికి గులాంగిరి చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని, ముడిసరుకు కొరతతో ఉత్పత్తి తగ్గిందని, - ప్లాంట్ దివాలా తీసే స్థాయిలో ఉందని, కేంద్రం తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించి ఆదుకోవాలని కోరారు. కార్మికులు 1400 రోజులుగా ఉద్యమాలు చేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మోడీతో మిట్టల్ స్టీల్ గురించి చర్చ చేస్తున్నారని మండిపడ్డారు. -వైజాగ్ స్టీల్ కు కేంద్రం నిధులు ఇవ్వాలని.. ప్లాంట్ ను సెయిల్‌లో వెంటనే విలీనం చేయాలని డిమాండ్ చేశారు. 7 మిలియన్ టన్నుల ఉత్పత్తి ప్రారంభించి.. భవిష్యత్తులో 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం పెంచాలని సూచించారు. - ఇవి సాధించడం చేతకాకపోతే వెంటనే ఔఆం భాగస్వామ్యం నుంచి టీడీపీ, జనసేనలు తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

## కూటమి తప్పుడు ప్రచారం వల్లే ఓడాం

- జైల్లో పెట్టుకుంటావా పెట్టుకో...చూసుకుంటాం
- పార్టీ సమావేశంలో మాజీమంత్రి రోజా సవాల్



**నగరి, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** ఎన్నికల్లో తప్పులు చేసి మనం ఓడిపోలేదు.. కూటమి ప్రభుత్వ తప్పుడు ప్రచారం వల్ల ఓడిపోయాం అని మాజీమంత్రి, నటి రోజా అన్నారు. ఈసారి కచ్చితంగా మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది అని పార్టీ శ్రేణులకు ఆమె ధైర్యం చెప్పారు. ఈ మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కీలక నేత ఆర్కే రోజా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం నగరిలో జరిగిన వైఎస్సార్ సిపి పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఏపీ సిఎం చంద్రబాబునుద్దేశించి 'జైల్లో పెడతావా..? పెట్టుకో.. కేసులు పెడతావా? పెట్టుకో.. ఉద్యోగాలు తీసేస్తావా తీసేసెయ్..! ' అని సవాల్ విసిరారు. మళ్లీ మా ప్రభుత్వం వస్తుంది.. వడ్డీతో సహా తిరిగి ఇస్తామని' ఆమె కూటమి ప్రభుత్వాన్ని ఆమె హెచ్చరించారు. ఈ ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు పడ్డ కార్యకర్తల పేర్లను గుడ్ బుక్‌లో రాసి పెట్టుకుంటాం.. వారిని గుర్తుపెట్టుకుంటామని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగస్తులందరూ ఎగిరెగిరి పడ్డారు.. మన ప్రభుత్వాన్ని దించేంతవరకు ఉద్యోగులందరూ కంకణం కట్టుకొని పనిచేశారు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో వారే నరకయాతన అనుభవిస్తున్నారు. పవన్ కల్యాణ్‌కు, చంద్రబాబుకు, లోకేష్ కు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. ఏపీ యువతకు ఉద్యోగాలు రాలేదు రోజా ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆమె.. మనం తప్పులు చేసి ఓడిపోలేదు.. ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం ఆలీబాబా ఆరడజను దొంగల్లా మారిందని విమర్శించారు. ఏపీ ప్రజలకు నరకం అంటే ఎంటో కూటమి ప్రభుత్వం చూపిస్తుందన్నారు.. జగన్‌ను ఓడించి తప్పుచేశామని ప్రజలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.. పశ్చాత్తాప పడుతున్నారని వ్యాఖ్యానించారు.. సంపద సృష్టిస్తా అని చెప్పిన చంద్రబాబు అప్పుల మీద అప్పులు సృష్టిస్తున్నారు? ఎన్నికల ప్రచారంలో పచ్చ చొక్కాలు వేసుకుని, పచ్చ చీరలు కట్టుకుని నీకు 15 వేలు నీకు 15 వేలు అంటూ టిడిపి నేతలు అబద్దాలు చెప్పారని ఆమె మండిపడ్డారు. జగన్ బిజినెస్ మాన్ గా, పార్టీ అధినేతగా, ఫ్యామిలీ మెన్ గా సక్సెస్ అయిన వ్యక్తి అని ఆమె అభివర్ణించారు. మరోవైపు పార్టీ కీలక నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉద్దేశించి మన పార్టీలోని కొందరు చేసిన దిగజారుడు రాజకీయాల వల్ల ఎప్పుడూ అత్యధిక స్థానాలు గెలిచే జిల్లాలో ఈసారి గెలవలేకపోయామన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా భుమన కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కుప్పంతో సహా 14 స్థానాలను గెలుస్తామని రోజా ధీమా వ్యక్తం చేశారు.

## రాబోయే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు

- టాటా గ్రూప్సంస్థల ద్వారా కల్పనకు నిశ్చయం
- టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్




**ముంబయి, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** రాబోయే ఐదేళ్లలో టాటా గ్రూప్సంస్థల ద్వారా 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. తయారీ రంగంలో త్వరలో భారత్‌లో స్వర్ణయుగం రాబోతోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాల కల్పన తమ లక్ష్యమని పేర్కొన్నారు. బ్యాటరీలు, సెమీ కండక్టర్లు, విద్యుత్ వాహనాలు, సోలార్ వంటి రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అనిశ్చితులు 2024 సంవత్సరాన్ని అనూహ్య సంవత్సరంగా మార్చేశాయని పేర్కొన్నారు. కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్న వేళ ఇయర్ ఎండ్ నోట్‌ను విడుదల చేశారు. 2024 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా భౌగోళికంగా, రాజకీయంగా అస్థిర పరిస్థితులు నెలకొన్నాయని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇవి ప్రపంచ స్థూల ఆర్థిక ముఖచిత్రాన్నే మార్చి వేశాయన్నారు. ఉక్రెయిన్, గాజా, సూడన్‌లో నెలకొన్న యుద్ధ వాతావరణం, బంగ్లాదేశ్, దక్షిణ కొరియాలో ప్రజా ఆందోళనలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. భవిష్యత్‌లోనూ ఇమ్మిగ్రేషన్, టెక్నాలజీ, ప్రపంచ వాణిజ్యం వంటి అంశాల్లో సవాళ్లు ఎదురుకానున్నాయని పరోక్షంగా ట్రంప్ పాలన గురించి ప్రస్తావించారు. వయో భారంతో అక్టోబర్ 9న దూరమైన రతన్ టాటా గురించీ తన లేఖలో ప్రస్తావించారు. తనదైన వ్యక్తిత్వం, దూరదృష్టి, వ్యూహాలతో టాటా గ్రూప్ వ్యాపార నమూనాను సమూలంగా మార్చివేసిన రతన్ టాటా ఈ ఏడాదే దూరం కావడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయనలేని లోటు పూడ్చలేనిదన్నారు. వ్యక్తిగతంగా తాను ఓ మార్గదర్శకుడిని కోల్పోయానంటూ ఆవేదన వ్యక్తంచేశారు. అదే విధంగా 2024లో గ్రూప్ సాధించిన ఘనతలను ఈ సందర్భంగా ప్రస్తావించారు.

## రేవంత్‌కు సోఫా పంపాల్సిందే

- ఎక్స్ వేదికగా అంబటి సెటైర్లు

**గుంటూరు, డిసెంబర్26 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలపై తరచూ విమర్శలు చేసే వైసీపీ నేత అంబటి రాంబాబు ఈసారి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేశారు. సినీ ప్రముఖులు ఆయనతో భేటీ అయిన టైంలో ఓ సెటైరిక్ పోస్టు పెట్టారు. ఎక్స్ వేదికగా పూర్తి పరిష్కారానికి 'సోఫా' చేరాల్సిందేనంటూ రాసుకొచ్చారు. పుష్ప-2లో 'సోఫా' సీన్స్ ఉంటాయి. తనకు వ్యతిరేకంగా ఉన్న వాళ్లను కొనేందుకు, తనకు అనుకూలంగా పని చేసే వాళ్లకు పుష్పరాజ్ 'సోఫా' పంపిస్తుంటారు. అందులో భారీ స్థాయిలో డబ్బు ఉంచి పంపిస్తుంటారు. అదే అంశాన్ని అంబటి రాంబాబు ప్రస్తావించారు. అంటే డబ్బులు ఇస్తే సినిమా ఇండస్ట్రీ సమస్యలు పరిష్కరిస్తామంటూ అర్థం వచ్చేలా ఆయన ఈ ట్వీట్ చేశారు. సంధ్య థియేటర్ కేసులో మొదటి నుంచి అల్లు అర్జున్‌ను వైసీపీ వెనకేసుకొచ్చింది. అల్లు అర్జున్‌ను అనవసరంగా రేవంత్ ప్రభుత్వం అరెస్టు చేసిందని ఆరోపించింది. ఇందులో ఏపీలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పాత్ర ఉందని విమర్శలు కూడా చేసింది.



## మందాకు హరీష్ పరామర్శ

**హైదరాబాద్, డిసెంబర్26 (జనంసాక్షి) :** నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథంను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు హరీశ్‌రావు. అనంతరం జగన్నాథం ఆరోగ్య పరిస్థితి వివరాలను వైద్యులను అడిగి హరీశ్‌రావు తెలుసుకున్నారు. మందా జగన్నాథంను పరామర్శించిన వారిలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, మాజీ మంత్రులు దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి కూడా ఉన్నారు. రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురైన జగన్నాథంను ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించిన సంగతి తెలిసిందే. 1996లో ఆయన తొలిసారిగా టీడీపీ తరపున నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో తెలుగు దేశం టికెట్‌పై మళ్లీ విజయం సాధించారు.

ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 2009 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2014లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో ఆయనకు టికెట్ దక్కలేదు. ఈ నేపథ్యంలో 2022, జూలై 1న ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా అప్పటి సీఎం కేసీఆర్ ఆయనను నియమించారు. 2023 నవంబర్ 17న బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే నాగర్‌కర్నూల్ టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీ తీర్థం పుచ్చుకున్నారు.

## ఉత్తరాది గజగజ

- హిమాచాల్, కాశ్మీర్‌లపై మందుదుప్పటి
- మంచు కారణంగా జాతీయ రహదారుల మూసివేత
- ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగిన చలిగాలులు

25 ఉన్నాయి. 173 ట్రాన్స్‌ఫార్మర్‌లకు అంతరాయం ఏర్పడిరదని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిరదని తెలిపింది. హిమాచల్‌ప్రదేశ్‌లో తీవ్రమైన చలి పరిస్థితుల కారణంగా భారత వాతావరణ విభాగం (ఐఎండి) 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసింది. దట్టమైన పొగమంచు ఉండే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో వారాంతంలో వర్షం, మంచు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో భారీ హిమపాతం కురిసింది. త్యుని-చక్రతా-ముస్సోరి జాతీయ రహదారిపై 30 కి.విరీ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. రాష్ట్రంలోని ధరణాధర్-కోటి కనసర్ రహదారిపై భారీ మంచుతో ఢల్లీ నుండి వచ్చిన ఇద్దరు పర్యాటకులు చిక్కుకుపోయారని స్థానిక వీరిడియా తెలిపింది. ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లోనూ దట్టమైన మంచు కమ్మేసింది. జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 7 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఇకపోతే చలి తీవ్రతతో ఉత్తర భారతం గజగజలాడుతోంది. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. కశ్మీర్‌లోని పలు ప్రదేశాలు చలికి అల్లాడిపోతున్నాయి. జలాశయాలు గడ్డకట్టుకుపోయాయి. నీటి సరఫరా గొట్టాల్లో నీరు గడ్డకట్టేస్తోంది. శ్రీనగర్‌లో మైనస్ 7.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోద్కెంది. రాబోయే రెండ్రోజుల్లో ఇది మరో 2-3 డిగ్రీల వరకు తగ్గిపోతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. కశ్మీర్‌లో అత్యంత చల్లగా ఉండే 40 రోజుల కాలం ఈ నెల 21న ప్రారంభమైంది. అప్పటి నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా ఉంటున్నాయి. అమర్‌నాథ్ యాత్రకు బేస్‌క్యాంపు అయిన పహాల్గామ్‌లో మైనస్ 8.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంది. రాజస్థాన్‌లోని అనేక ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాలకు అత్యంత చల్లని రోజుగా బుధవారం నిలిచిపోయింది. పంజాబ్, హరియాణాల్లోనూ శీతల గాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దిల్లీని పొగమంచు కప్పేసింది. దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామున 9.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచు దట్టంగా కురుస్తూ.. 100 విరీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కన్పించని పరిస్థితి నెలకొంది. దీంతో పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. వాయు నాణ్యతా సూచీ (ఏక్యూఐ) 334గా నమోదైంది.




## భారతదేశ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- సమసమాజ స్థాపనకు పోరాటాలకు సిద్ధం కావాలి
- సిపిఐ శతవార్షికోత్సవ సభలో రామకృష్ణ పిలుపు

**గుంటూరు, డిసెంబర్26 (జనంసాక్షి) :** భారతదేశ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ త్యాగాలు, పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. గుంటూరులో గురువారం జరిగిన సిపిఐ శతవార్షికోత్సవ సభలో ఆయన పాల్గని మాట్లాడారు. తొలుత బిఆర్ స్టేడియం నుండి గాంధీ పార్క్ వరకు ప్రదర్శన నిర్వహించారు. నగర కార్యదర్శి కె.మల్యాద్రి అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి స్వాతంత్య సమరయోధులు అంటే గౌరవం లేదని, రాజ్యాంగం పట్ల విశ్వాసం లేదని విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను సైతం అవమాని స్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ దేశ సంపదను అంబాని, అదానిలకు దోచిపెడుతోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో దేశంలో సోషలిస్టు సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు సమాయత్తం కావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కమ్యూనిస్టు నాయకులపై కుట్రలు పన్ని జైలుకు పంపినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగి దేశానికి సంపూర్ణ స్వాతంత్యం కావాలని గొంతెత్తిన పార్టీ సిపిఐ అని అన్నారు. స్వాతంత్యం అనంతరం భూ పోరాటాలు పెద్ద ఎత్తున చేపట్టినట్లు చెప్పారు. నాటి పోరాటం, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. సభలో పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజరుకుమార్, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి తదితరులు ప్రసంగించారు.

## ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపేదిలేదు

అని లావ్రోవ్ పేర్కొన్నారు. ఇక ఇటీవల తిరుగుబాటు చోటు చేసుకొన్న సిరియాపై తాజాగా లావ్రోవ్ స్పందిస్తూ.. ఆ దేశ కొత్త పాలకులు మాస్కోతో దీర్ఘకాలం వ్యూహాత్మక సంబంధాలను కోరుకుంటున్నారు. దీనిపై క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉస్కోవ్ ఇటీవల మాట్లాడుతూ తాము సిరియా పాలకులతో దౌత్య, సైనిక స్థాయిలో సంప్రదింపులు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా కాబోయే అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చించేందుకు సానుకూలంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో భూభాగాలను వదులుకోవడానికి, కీవ్ నాటోలో చేరడానికి తాము అంగీకరించమని తేల్చిచెప్పిన విషయం తెలిసిందే.

## కౌలుదారుడి భూమి కౌలు రద్దుచేసి జరిమానా



**స్టేషన్ ఘన్పూర్, డిసెంబర్ 26 (జనం సాక్షి) :** చిల్పూర్ మండలంలోని చిన్న పెండ్యాల గ్రామంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కు సుమారు 206 ఎకరాల భూమి కలదని, అందులో 361 సర్వే నెంబర్లో తాటికొండ గ్రామస్తుడు మోడం రాజు 1 ఎకరం భూమి కౌలుకు తీసుకోవడం జరిగిందని,అందులోనుండి కొందరు వ్యక్తులు అక్రమం గా మట్టి తరలిస్తున్నారని తెలిసి కౌలుదారుడికి కౌలు రద్దుచేసి జరిమానా విధించడం జరిగిందని ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న తెలిపారు.దేవాలయ భూమి నుండి అనుమతిలేకుండా మట్టి తరలిస్తున్నారని తెలిసి బుధ వారం ఆలయ ఈవో, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు ఇల్లందుల యాదగిరి, రామడుగు బుచ్చి కొమురయ్య, తాళ్ల పెల్లి బుచ్చయ్య, భీమగోని మొగిలి, కొత్తపెల్లి యాకరాజు, తాళ్ల పెల్లి శివకుమార్ తదితరులు తనిఖీ చేయగా ఆలయ భూమిలో అక్రమంగా మట్టి తరలిస్తు న్నారని నిర్ధారించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మాట్లాడుతూ దేవాదాయధర్మాదాయ సహాయ కమిష నర్ నల్గొండ(భాస్కర్ )మౌఖిక ఆదేశాల మేరకు కౌలు దారుడి భూమి కౌలు రద్దు చేస్తూ, జరిమాణ విధించ డం జరిగిందన్నారు.చిన్న పెండ్యాల గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూమిలో కౌలు దారులు అనుమతి లేకుండా ఎటువంటి కార్యకలాపా లు చేయవద్దని, అక్రమంగా భూమిలో మట్టి తరలిస్తే దేవాదాయ ధర్మాదాయ చట్టం 30/1987 ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు.

# నాటి మూలవాసులే నేటి ముస్లింలు

మన భారతదేశాన్ని ఎంతోమంది ముస్లిం రాజులు పరిపాలించారు. అందరూ ఈ సంస్కృతిలో మమేకమై ఈ మట్టిని ప్రేమించి ఈ మట్టిలోనే కల్సిపోయారు. అయితే వీరంతా ఇస్లాం మత విస్తరణ కాంక్షతో వచ్చారని ఇక్కడి ప్రజలను బలవంతంగా మతం మార్చారు కనుకే ముస్లింల జన సంఖ్య పెరిగిందని కొంతమంది చరిత్రకారులు చర్విత చరణంలా అసంబద్ధ, అసత్య ప్రచారాలు చేశారు. ఏ మతానికి చెందిన రాజులు పరిపాలిస్తే ఆ మతానికి ప్రోత్సాహం లభించిన మాట వాస్తవమే అయినా మొత్తం మత విస్తరణకు అది కారణం కాదు. ఆనాడు సమాజంలో నెలకొనివున్న సామాజిక, ఆర్థిక రాజకీయ, మత పరిస్థితులు ఇస్లాం వ్యాప్తికి దోహద పడ్డాయి. నాడు నెలకొనివున్న చాతుర్వర్ణ వ్యవస్థ, అమానవీయ అంటరానితనం మొత్తం సమాజాన్ని అనేక పాయలుగా చీల్చింది. దిగువ వర్ణాలన్నీ వివక్షత అనే చట్రంలో నలిగిపోయాయి. ఈ పరిస్థితులలో చింపిరిగుడ్డలతో, జోలె సంచులతో వచ్చిన సూఫీ సన్యాసులు ఇస్లామ్ను ప్రేమ, సమానత్వం ప్రాతిపదికగా అందించారు. వారి ప్రభావానికి గురైన వేలాదిమంది నాటి మూలవాసులు ఇస్లామ్ స్వీకరించి ఆత్మ గౌరవాన్ని పొందారు. అజ్మీర్కు చెందిన ఖాజా గరీబ్ నవాజ్ అనే సూఫీ గురువు చేతుల మీదుగా వేలాది మంది ప్రజలు ఇస్లామ్లో ప్రవేశించారంటే వారి ప్రభావం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ విధంగా చారిత్రకంగా నాటి తొలితరం మూలవాసులే నేటి ముస్లింలని చెప్పవచ్చు.నేటి వర్తమాన స్థితిగతుల్ని బట్టి చూస్తే ముస్లింలు దళితులకన్నా బాగా వెనుకబడివున్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి అభద్రతా భావంలో కొట్టుమిట్టాడుతున్నారు. దేశ జనాభాలో సుమారు 20 శాతం వుండి కూడా విద్య, ఉద్యోగ విషయాలలో, చట్ట సభల్లో నేటికీ తను వాటా పొందలేక పోయారు. 1991 సం౹౹ం జనాభా లెక్కల ప్రకారం ముస్లింలలో దాదాపు సగానికి పైగా దారిద్ర్య రేఖకు దిగువగా వున్నారంటే ఎంత దయనీయమైన స్థితిలో వున్నారో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ముస్లింలలో నేటికీ 2 ఎకరాల పొలంకంటే తక్కువగా వున్నవారు దాదాపు 90% పై చిలుకు వున్నారని గణాంక వివరాలు తెలియపరుస్తున్నాయి. ఇక ఐ.ఏ.యస్., ఐ.పి.యస్., వంటి క్యాడర్లలో కనీసం 1% కూడా మించలేదు. ప్రభుత్వ ఉద్యోగాలలో సైతం చెప్పుకోదగ్గ పరిస్థితి లేదు. ఒక రకంగా చెప్పాలంటే కార్యనిర్వాహక వర్గంలో వీరికి ఏ పాత్ర లేదు. పల్లెలలో నివసించే ముస్లింలు కూలీలుగా జీవనం సాగిస్తూ. అక్కడి పెత్తందార్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బ్రతుకున్నారు. అయితే మెజారిటీ ముస్లింలు పట్టణాలలోనే స్థిర పడ్డారు. వీరంతా మెకానిక్లుగానో, టైలర్లుగానో, డ్రైవర్లుగానో కొనసాగుతున్నారు. ఇంకా రోడ్డు ప్రక్కన చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూనో, చేతివృత్తులు చేసుకుంటూనో పొట్ట పోసుకుంటున్నారు. ఎంతకీ ఎదుగు బొదుగులేని జీవితాలతో, చాలీచాలని ఆదాయంతో దరిద్రాన్ని అనుభవిస్తున్నారు. ఉత్పత్తి రంగంలో స్త్రీలు పాలు పంచుకోవడంపై ఇస్లామ్ ఎటువంటి నిషేధం విధించక పోయినా పురుషాహంకారం వల్ల స్త్రీలు కుటుంబ ఆర్థికాభివృద్ధిలో పాలు పంచుకోలేక పోతున్నారు. తత్ఫలితంగా వీరి జీవన ప్రమాణస్థాయి దారుణంగా పడిపోయింది.

నేటి ముస్లిం సమాజం ఇంతగా వెనుకబడి వుండటానికి ప్రధాన కారణం నిరక్షరాస్యత, అవిద్య ముస్లింలకు తీరని హాని కల్గించింది. దశాబ్దాల చీకటి గోతుల్ని తవ్వింది. చదివించే స్తోమత లేక పిల్లల్ని పనుల్లోకి పంపటం సహజమై. పోయింది. విద్యా ఉద్యోగాలలో సరియైన రిజర్వేషన్ సౌకర్యం లేక పోవటం వలన నిరాశానిస్పృహలతో ముస్లింలు విద్యకు దూరంగా జరిగి పోయారు. ముస్లింలు మొదటగా ఉద్యమించాల్సింది విద్య, ఉద్యోగాలలో ప్రాతినిధ్యం కోసం మాత్రమే. ఇస్లామ్లో విద్యకు, జ్ఞానానికి పెద్ద పీట వెయ్యడం జరిగింది. పవిత్రఖురఆన్లో మొదటి వాక్యం చదువుతోనే ప్రారంభమౌతుంది. స్వయాన దైవ ప్రవక్త ముహమ్మద్ (స) విద్యార్జన కోసం భూమి చివరి అంచుల వరకైనా వెళ్ళండి అని ఉపదేశించారు. అయినా ముస్లిం సమాజం విద్యను గురించి తీవ్రంగా ఆలోచిస్తున్న దాఖలాలు లేవు. ఇటీవలి విద్యా సర్వేప్రకారం ముస్లిం విద్యార్థుల డ్రాపవుట్స్ శాతం పెరిగింది. ఈ డ్రాపవుట్స్ శాతాన్ని తగ్గించేందుకై ప్రభుత్వం, ముస్లిం సమాజం కల్సి కృషి చేయాల్సిన అవసరం ఎంతో వుంది.

ముస్లిం సమాజంలో మదరసాలకు ఎనలేని ప్రాధాన్యత వుంది. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మదరసాలు కీలకమైన పాత్ర పోషించాయి. అటువంటి మదరసాలు నేడు ఆధునిక విద్యకు దూరమై కేవలం ధార్మిక విద్యకు మాత్రమే పరిమితమయ్యాయి. ఇహలోక సంబంధమైన విషయాలకు, పరలోక సంబంధమైన విషయాలకు ఇస్లామ్ సమాన ప్రాతినిధ్యం ఇచ్చినా ముస్లిం పండితులు మదరసాలలో కేవలం ధార్మిక విద్యను మాత్రమే బోధించటం వల్ల సామాజిక శాస్త్రాల్ని, గణితం, ఇంగ్లీషు, తెలుగు తదితర బోధనాంశాలను ప్రక్కన పెట్టడం ద్వారా నేటి వర్తమాన ప్రపంచంలో ముస్లింల విద్యాస్థాయిని దారుణంగా దెబ్బతింది.ఇప్పుడిప్పుడే ఆధునిక విద్య మదరసాలలో




చోటుచేసుకోవటం,ఈ కోణంలో ఉలేమాలు ఆలోచించటం హర్షణీయం.. కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నట్లుగా మదరసాలు తీవ్రవాద నిలయాలు కావు. ఇవి విద్యార్థులలో నైతిక వర్తన పెంచుతూ ధార్మిక నియమాలు పాటించే వారిగా మాత్రమే తయారు చేస్తాయి. ఇందులో చదివే విద్యార్థులకు తమ చుట్టూ వున్న ప్రపంచం గురించి ఏమాత్రం తెలియపర్చకుండా, కనీసమైన సామాజిక స్పృహను కలిగించకుండా కొంతమంది మత పండితులు ఉపేక్షించడం ఇస్లామ్ స్ఫూర్తికే విరుద్ధం. ఇప్పటికైనా మత పండితులు ఆత్మ విమర్శ చేసుకుని ధార్మిక విద్యతో పాటు సామాజిక శాస్త్రాల్ని కూడా బోధనాంశాలుగా పెట్టి మదరసాల్ని ఆధునీకరించాల్సిన అవసరం వుంది.

మతపరమైన విషయాలలోనూ ముస్లింలు ఇస్లామ్ వాస్తవిక రూపాన్ని దర్శించలేక పోతున్నారు. ఇస్లామ్ అత్యంత ప్రగతిశీలమైన ధర్మం. కాని ఒక డ్రైవింగ్ తెలియని డ్రైవర్ చేతిలో చిక్కిన కారులా కొన్ని విషయాలకే పరిమితమై నడుస్తున్నది. ఇస్లామ్లో లేని అనేక దురాచారాలను తలకెత్తుకున్న ముస్లిమ్ సమాజం స్వీయ సంస్కరణల బాటలో నడవవల్సి వున్నది. ఆర్థికాభివృద్ధి కోసం దేబిరించే బదులు 'జకాత్' వ్యవస్థను పటిష్ట పర్చుకోవడం ద్వారా స్వీయ సమృద్ధిని సాధించాలి. మతపరమైన ఉద్రిక్తతలకు తావిచ్చే అంశాలలో అత్యంత వివేకంతో సంయమనం పాటించాలి. ఇంటి గడప దాటకుండా, సామాన్య ముస్లిం ప్రజల కష్టనష్టాలు తెలియకుండా బాధ్యతలేని ప్రకటనలతో ఉద్రేకపూరిత ఉపన్యాసాలు చెప్పే రాజకీయ నాయకులు ముస్లింలకు ఒరగబెట్టిందేమీ లేదు. ముస్లింల దోలయాన స్థితిని ఆసరా చేసుకొని కొన్ని శక్తులు మెజార్టీ సమాజంలో మసిపూసి మారేడు కాయ చేసిన చందంలా ముస్లింల ఉనికి పట్ల భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. తమకు అందుబాటులో వున్న మీడియాద్వారా తమ పట్ల ఇతర సమాజాలలో పెరుగుతున్న అపోహలను, అపార్థాలను తొలగించే కార్యక్రమాన్ని ముస్లిం మేధావులు చేపట్టాలి. మతోన్మాదానికి సమాధానం మతోన్మాదం కాకూడదు. స్వయాన ప్రవక్త ముహమ్మద్(స) మలినాన్ని మలినంతో శుభ్రపర్చలేమని చెప్పారు. మతోన్మాదం, టెర్రరిజం పరస్పర ఆధారితాలు ఈ రెండు వివేక శూన్యమయినవే.

ఇప్పుడు ముస్లిమ్ సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సమస్య అభద్రతాభావం. ఈ వలయంలో చిక్కి ముస్లిమ్ సమాజం విలవిలలాడి పోతున్నది. ముస్లింలు స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి కరువైంది. చివరికి క్రికెట్ కూడా టి.వి.లో అందరితో కలిసి చూడలేని దౌర్భాగ్యపు పరిస్థితులు చుట్టు ముట్టాయి. కొన్ని శక్తులు ఒక పథకం ప్రకారం ముస్లింల దేశభక్తిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. స్వాతంత్ర్య పోరాటంలో ఎనలేని త్యాగాలు చేసిన ముస్లింల చరిత్ర ఉద్దేశ్యపూర్వకంగా విస్మరించబడింది. నిజానికి దేశవిభజన వల్ల ఎక్కువగా నష్టపోయిన వారు భారతీయ ముస్లింలే. భారతీయ ముస్లింలకు దేశ విభజన వల్ల జరిగిన నష్టం అపారమైనది. స్వీయ ప్రయోజనాల కోసం నిత్యం పాకిస్తాన్ పాలకులు అనుసరిస్తున్న దుష్ట వైఖరి భారతీయ ముస్లింలకు పెను శాపంలా మారింది. భారత్లో ఐ.యస్.ఐ. కొనసాగిస్తున్న విధ్వంసకర కార్యక్రమాలతో భారతీయ ముస్లింలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా తదనంతర పరిణామాలకు ముస్లిం సమాజం బలి అవుతున్నది. పరాన్న భుక్కులుగా కాక శ్రమ విలువలతో కూడిన జీవన విధానం కలిగి వున్న ముస్లింలు సామాజిక, ఆర్థిక, సమస్యలతో పాటు అభద్రతాభావాన్ని మోయాల్సి రావడం విచారించదగ్గ విషయం.

వర్తమాన ఆధునిక కాలంలో సమస్యలు పెరిగాయి. ప్రతి సమాజానికీ కొన్ని ప్రత్యేక సమస్యలు వున్నాయి. ఈ పరిస్థితులలో అనేక ఉమ్మడి సమస్యలపై ముస్లిం సమాజం ఇతర సమాజాలతో కల్సి నడవవల్సిన అవసరం వుంది. అయితే అన్ని సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ముస్లిం సమాజం అదనపు సమస్యలను ఎదుర్కొంటుంది. ఇలాంటి విచిత్ర పరిస్థితులలో స్వీయ తప్పిదాలను సవరించుకునే వైపుగా అడుగులు పడాలి. ముందుగా ముస్లింలు తాము అగ్రవర్ణీకులమని,నవాబులమనే భావనను తొలగించుకోవాలి. ప్రత్యేకమైన భాష, సంస్కృతిని కలిగి వుండటం తప్పుకాదు. కాని ఉర్దూభాష ఇస్లామ్ భాషనే భావ జాలం నుండి బయటపడాలి. తెలుగు లేదా ఇతర స్థానిక భాష మాట్లాడే ముస్లింలను చిన్న చూపు చూడటం మానుకోవాలి. సాంస్కృతిక వైరుధ్యం శృతిమించితే అది విభిన్న సమాజాల మధ్య విభజనకు దారితీస్తుంది. ప్రాంతీయ భాషల్ని సామాన్యీకరణ చేసుకోవడం ద్వారా ముస్లిం సమాజం ఇతర సమాజాలకు దగ్గరవుతుంది. తద్వార ఒకరి సమస్యలు మరొకరు తెల్సుకోవటానికి వీలవుతుంది. ఒకరి పట్ల మరొకరికి వున్న అనుమానాలు దూరమై ఉమ్మడి సామాజిక ఐక్యత సాధ్యమవుతుంది.

ముస్లింలు తమ మూలాల్ని వెతుక్కోవాల్సిన అవసరం వుంది. సామాజిక స్పృహను కలిగి వుండాలి. పీడక వర్గాలేవో, పీడిత వర్గాలేవో గుర్తించి తమతో సారూప్యమున్న అట్టడుగు బలహీన వర్గాల ప్రజలతో ఐక్యవేదికను నిర్మించుకోవాలి. అయితే ఇటీవలి కాలంలో ఈ ప్రయత్నాలు జరుగుతూ వుండటం హర్షించదగ్గ విషయం. ముస్లిం యువత ఇప్పుడు తీవ్రమైన నిరాశ నిస్పృహలమధ్య కొట్టుమిట్టాడుతుంది. అసంతృప్తి ఆలోచనాత్మకమైన నిర్మాణం వైపుకు కదలాలి, అంతే కాని అవేశపూరితమైన విధానాల వైపుకు కాదు. ప్రజాస్వామ్యబద్ధమైన ప్రగతిశీల, సెక్యులర్ శక్తులతో కలిసి నడుస్తూ విద్యాభివృద్ధి, ఆర్థికాభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరించాలి. తద్వారా మాత్రమే ముస్లిం సమాజం సమస్యల సుడిగుండం నుండి బయట పడగలుగుతుంది. ముస్లింలు ఇప్పుడు పాకులాడాల్సింది గుప్పెడు సానుభూతి కోసం కాదు. ఆత్మవిశ్వాసం కోసం, అచంచలమైన విజయ విశ్వాసం కోసం.

# గ్రామీణ మార్కెట్ల కార్పొరేటీకరణ ప్రజల జీవనాధికారాలకు ముప్పు

ఇటీవలికాలంలో మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలు భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయనున్నాయి. అందులో గ్రామీణ సంతలను కూడా ప్రైవేటీకరించి, కార్పొరేట్ల దిగ్గజాల అధీనంలోకి తేవడమే కీలకంగా మోదీ ప్రభుత్వం పూనుకుంది.ఇది ఒక దుర్మార్గ చర్య. సంతలు, వందల ఏళ్లుగా గ్రామీణ జీవనానికి ప్రాణాధారంగా నిలిచిన ఓ సాంప్రదాయ మార్కెట్లు వ్యవస్థ. గ్రామీణ రైతుల,చిరు వ్యాపారుల బ్రతుకు తెరువు. ఇప్పుడు అలాంటి జీవనాధారం అయిన చిరు సంతలను కూడా ఓర్వలేని మోదీ ప్రభుత్వం ఆధునీకరణ పేరుతో కార్పొరేట్ వ్యవస్థల్లోకి లీనం చేయటానికి పూనుకొంది. అందుకు అనువుగా అనేక కుట్రపూరిత చర్యలను చేపడుతుంది.

ఇప్పుడు రాష్ట్రాలకు పంపిన జాతీయ ఏకీకృత మార్కెట్ విధానం ప్రకారం, గ్రామీణ మార్కెట్లను ఆధునిక వ్యవసాయ కేంద్రాలుగా మలచాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీని లక్ష్యం మార్కెట్లకు మౌలిక వసతులు, రైతుల ఆదాయాలను పెంచడమేనని చెప్పబడుతున్నా, ఈ ప్రతిపాదన వెనుక గ్రామీణ ప్రజల జీవన స్వావలంబనను దెబ్బతీసే కుట్రపూరిత పథకం దాగి ఉంది.

భారతదేశంలో సుమారు 23,000 సంతలు ఉన్నాయి. వీటి ఆధిక్యమంతా ప్రజల ఆత్మనిర్భరతకు చిహ్నంగా నిలుస్తాయి. రైతులు, చిన్న వ్యాపారులు ఈ మార్కెట్ల ద్వారా తాము ఉత్పత్తి చేసిన పూలు,పండ్లు,కూరగాయలు,ఆకు కూరలు గ్రామీణ పిండివంటలు,చిరు తిండ్లు,చేతి వృత్తి ఆధారిత వస్తువులను గ్రామీణ,పట్టణ,నగర ప్రాంతంలోని వినియోగదారులకు వారంలో రోజుకొక వీధిలో నేరుగా విక్రయిస్తారు. కానీ, నేడు కేంద్ర ప్రభుత్వం ఈ సంతలను ప్రయివేటు రంగంలోకి తీసుకొచ్చి పబ్లిక్,ప్రయివేట్ పార్ట్నర్ షిప్స్ (పీపీపీ)మోడల్ ద్వారా కార్పొరేట్ల వశం చేయటానికి పూనుకుంది.

ప్రభుత్వం గ్రామీణ మార్కెట్లలో మౌలిక వసతులు లేవని, ధరల నిర్ధారణ వ్యవస్థ ఏకీకృతంగా లేదని పేర్కొంటూ వాటిని ఆధునీకరించాలనుకుంటోంది. కానీ ఈ పరిష్కారం గ్రామీణ ప్రజల ఆర్థిక వ్యవస్థను కార్పొరేట్ ఆధీనంలోకి నెట్టివేయడమే తప్ప మరొకటి కాదు. కార్పొరేట్ల రంగ ప్రవేశం వల్ల పెద్ద ఎత్తున స్థానిక చిన్న వ్యాపారులు, రైతులు తమ ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే వినియోగదారులు కార్పొరేట్ సంస్థల కబంధ హస్తాలలో చిక్కి పెరిగిన అధిక ధరలకు బలవుతున్నారు. అక్కడ వినియోగదారులు వ్యాపారులతో బేరసారాలు ఆడలేరు. ప్రతి వస్తువుకు ఫిక్సిడ్ ధరల లేబుల్ ఉంటుంది. ప్రతి వస్తువుకూ ట్యాక్స్ ఉంటుంది. ఈ బడా మాల్స్లో వినియోగదారుణ్ణి ఆకర్షణీయమైన వస్తు సంచయం వ్యామోహంలోకి పడవేస్తుంది. ఒక అవసరమైన వస్తువు కొనబోయిన వినియోగదారుడు తనకు ప్రస్తుతం అవసరం లేని వస్తువులను కూడా బల్క్ గా కొనిపిస్తుంది. అనేక వస్తువులు తమను చౌక ధరలకు,నాణ్యమైన వెరైటీ వస్తువులను కొనమని వారిని ఊరిస్తుంది. అక్కడ అమ్మేవాడు (షాపు యజమాని)మన కంటికి కనిపించడు. మనతో బేరసారాలు మాట్లాడడు. కేవలం తూకాలు , కొలతలు, వెరైటీలు,ప్రతి వస్తువుపై ఫిక్స్ డ్ ధర లేబుల్ ఉంటుంది.ఆ వస్తువు పై ఆఫర్ లేదా రెబిట్ ధర ఉండే లేబుళ్ళు ఉంటాయి.కేవలం వస్తువులను నిర్ణీత ర్యాకుల్లో సర్దుబాటు చేసేవారు. బిల్లులు వసూలు చేసే కౌంటర్ ఉద్యోగులు,సెక్యూరిటీ సిబ్బంది మాత్రమే మనకు కనపడతారు. అదో "మయసభ లా...మాయా ప్రపంచం". వినియోగదారుడు కేవలం చూద్దాం అని వచ్చిన వాడిచేత తప్పక కొనిపించే మాయాతంత్రం. లక్షల కోట్ల పెట్టుబడులతో 'డీ-మార్ట్,'రిలయన్స్ మాల్స్' ,'బిగ్ మార్కెట్ ' పేర్లతో అనేక మార్కెట్లు కార్పొరేట్, పట్టణ ప్రాంతాల్లో తిష్టవేశాయి. ఇప్పుడు మండలాలకు కూడా వాటి విస్తరణా దండయాత్ర కొనసాగుతుంది.వీటి ప్రభావంతో సంప్రదాయ వ్యాపారులు దివాలా దిశగా అడుగులు వేస్తున్నారు.




దేశంలో కోట్లాదిమందికి ఉపాది పోతుంది.

ఇప్పుడు గ్రామీణ సంతలపై కేంద్ర ప్రభుత్వం కన్ను పడింది. ఈ చర్య వల్ల ముఖ్యంగా గిరిజన చిరు వ్యాపారులు మరింతగా వీటి ప్రభావంలో చిక్కిపోతారు. ఇప్పటి వరకు సాంప్రదాయంగా అడవుల్లో సేకరించిన ఉత్పత్తులను సంతల్లో అమ్మడం ద్వారా గిరిజనులు తమ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. కార్పొరేట్ల అధికమూల్య విధానాలు గిరిజనులకు తక్కువ ధరలు అందుబాటులోకి తెస్తాయి. ఇకపై యూజర్ ఛార్జీలు, లైసెన్సు ఫీజుల భారంతో ఈ సమూహాలు మరింతగా దెబ్బతింటాయి.

పిపిపి మోడల్ వల్ల లబ్ధిపొందేది ఎవరో అనేది ఓ పెద్ద ప్రశ్న. ఈ విధానం ద్వారా కేవలం కార్పొరేట్ల లాభాలను పెంచడంకాక, గ్రామీణ వ్యాపారులను మూలాలకు నెట్టివేయడం జరుగుతుంది. తర తరాలుగా ఆస్తుల్లేకుండా చిన్న వ్యాపారులు ఈ సంతలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పుడు పెద్దసంస్థల ఆర్థిక శక్తి ముందు వారు నిలబడలేరు. ఆత్మహత్యలు రైతుల నుండి,రైతు కూలీలకు,అక్కడ నుండి చేతివృత్తులకు ఇప్పుడు గ్రామీణ మార్కెట్ల వంతు వచ్చింది. పెద్ద ఎత్తున మానవ మారణ హోమం త్వరలో జరగనుంది. ఈ ప్రైవేటీకరణ వల్ల ప్రజాస్వామ్య హక్కులకు పెద్ద ముప్పు తలెత్తుతుంది. సంతల నిర్వహణలో స్థానిక ప్రజల పాత్రను పూర్తిగా తొలగించి, వారి జీవన విధానాన్ని ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకోవడం అన్యాయమేకాదు కేంద్ర ప్రభుత్వ దుర్మార్గం,కుట్రకోణం దాగివుంది.వామపక్ష విమర్శకులు దీనిని నయా వలసవాద విధానమని అంటున్నారు. ఈ విధానం స్థానిక అభివృద్ధి కన్నా కార్పొరేట్ల ప్రయోజనాలకు ప్రాముఖ్యత ఇస్తోంది. గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలైన ధరల నియంత్రణ, సాంకేతిక మద్దతు, మధ్యవర్తుల దోపిడీ నివారణ వంటి అంశాలను ఈ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు పట్టించుకోవు. దీనికి ప్రత్యామ్నాయంగా సహకార వ్యవస్థలను ప్రోత్సహించడం మంచిదైన దిశగా ఉంటుంది. సహకార సంఘాలు కార్పొరేట్లలోకి వెళ్లకుండా మౌలిక వసతులను అందించగలవు. స్థానిక పాలనా సంస్థల ఆధ్వర్యంలో సంతలను అభివృద్ధి చేసి, గ్రామీణ ప్రజల హక్కులను కాపాడే దిశగా చర్యలు తీసుకోవాలి. సంతలు కేవలం ఆర్థిక కేంద్రాలు కాదు, అవి గ్రామీణ సంస్కృతి, సామాజిక జీవనానికి చిహ్నాలు. వాటిని కార్పొరేట్ ఆధీనంలోకి తీసుకెళితే ఈ సంప్రదాయాలను కోల్పోవాల్సి వస్తుంది. గ్రామీణ మార్కెట్ల కార్పొరేటీకరణ అనేది ఆర్థిక అభివృద్ధి పేరిట సామాజిక సమానత్వాన్ని తగ్గించే చర్య. ప్రభుత్వం ఈ విధానాన్ని పునఃపరిశీలించి, స్థానిక ప్రజల హక్కులను, గ్రామీణ జీవితాన్ని కాపాడే దిశగా పని చేయాలి. ప్రజాస్వామ్యంలో ఆర్థిక విధానాలు కొద్దిమంది బడా కార్పొరేట్ల లాభాల కోసంకాదు, సమాజంలోని ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని పరిరక్షించే బాధ్యత ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలపై ఉంది.



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్, 9849328496

# గరీబోడి గుండె చప్పుడు పిజెఆర్

*అవును ఆయన గరీబోడి గుండె చప్పుడు. సామాన్యుడి సమస్యల మీద స్పందించే నిజమైన నేల మీది నాయకుడు. మానవత్వం ఉట్టిపడే మనిషి పీజెఆర్!.నా యాభై ఏండ్ల ప్రజా జీవిత ప్రయాణం లో, జర్నలిస్ట్ క్యారియర్ లో చాలా మంది నేతలను, వివిధ రాజకీయ పార్టీ లకు చెందిన నేతలను,కలిసి మాట్లాడడం, వారిని దగ్గరగా, దూరంగా చూసాను. స్నేహితులు, నా హితులు కూడ అందులో ఉన్నారు.*

**చెన్నారెడ్డిని చూసాము**

చెన్నారెడ్డి సీఎంగా ఉన్నపుడు, అయన కారును మందమర్రిలో ఆపి మేము నల్ల జెండాలు చూపిన సంఘటన నాకు గుర్తు ఉంది. కారు దిగకుండానే అయన ఒక నల్ల జెండాను కారు లోనికి లాక్కుని విసుగుగా కాగజ్ నగర్ కు వెళ్లి పోయాడు. అక్కడ సభలో కమ్యూనిస్ట్ లను తొక్కుతా అని ఆవేశంగా మాట్లాడారు.ఇందుకు సంబందించిన కేసులలోనూ నేను, నా మిత్రులు లాకప్ లోనూ ఉన్నాము, అనుకోండి. ఇలాంటి చాలా అనుభవాలు, జైలు జీవితం చవి చూసిన సందర్భాలు ఉన్నాయి.అభిమానాలు, అవమానాలు, నిర్బందాలు చూసాను.



**ప్రజాప్రతినిధి పిజెఆర్లా ఉండాలి**

నా జీవితంలో ప్రజా ప్రతినిధి అంటే ఇలా ఉండాలి అనేవారి లో పీజెఆర్ అతి ముఖ్యమైన వాడు!మాజీ కేంద్ర మంత్రి 'కాకా' గడ్డం వెంకటస్వామి తర్వాత హైదరాబాద్ లోని పేదల్లో, ముఖ్యంగా స్లమ్స్లో నేటికీ పేదల గుండెలలో అంతటి గౌరవం దక్కిన నేత పీజెఆర్!అనక తప్పదు,అన్నా! అని పిలిస్తే పలికే పక్కా గరీబోడి నేత పిజెఆర్! అయన లోటు నేటికి ట్విన్ సిటీస్ లో కొట్టొచ్చినట్లు కనిపిస్తూ ఉంటుంది. హైదరాబాద్ లోని నిరుపేదల గల్లీలు కాలనీల గుండె చప్పుడు పిజెఆర్.. హైదరాబాద్..తెలంగాణ రాజధాని నగరం ఇక్కడి ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యే గా గెలిచి పలుమార్లు రాష్ట్ర మంత్రి గా కూడా పని చేసిన కార్మిక నేత పి.జనార్దన్ రెడ్డి,జనవరి 12-1948, లో హైదరాబాద్ లోని దోమలగూడా లో పాపిరెడ్డి..శివమ్మ దంపతులకు జన్మించారు.పాలిటెక్నిక్ లో ఎలక్ట్రికల్ డిప్లమా చేసిన పిజెఆర్ సనత్ నగర్ లోని ఏపి ఎలక్ట్రికల్ ఎక్యుప్మెంట్ కార్పొరేషన్ లో సూపర్ వైజర్ గా పని చేసారు. పిజెఆర్ కు భార్యా, నలుగురు కూతుర్లు ఒక కుమారుడు ఉన్నారు.2007 డిసెంబర్28న గుండెపోటుతో 59 సంవత్సరాల వయసులో మృతి చెందారు.ఆయన కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి కూడా శాసన సభ్యుడిగా పనిచేశారు. కూతురు విజయారెడ్డి కార్పొరేటర్ గా ప్రస్తుతం హైదరాబాద్ లో ఉన్నారు.




**యూనియన్ నేతగా మొదలయింది**

1967లో ట్రేడ్ యూనియన్ నేతగా తన పొలిటికల్ క్యారియర్ ప్రారంభించిన పిజెఆర్ ఆల్విన్..కేశవరాం సిమెంట్స్.. ఎన్టీపీసీ.. వైజాగ్ స్టీల్.. ఆగ్రో.. ఇలా పదుల సంఖ్యలో 50కిపైగా యూనియన్లకు అధ్యక్షుడుగా పనిచేసారు. 1978లో మొదటిసారి ఏపీ అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. రిక్షా కార్మికులు మొదలు ప్రతి అసంఘటిత కూలీల కార్మికుల సమస్యలను పరిష్కరించేవారు. లిబర్టీ దగ్గరి ఆయన ఇంటి వద్ద ఉదయం నుంచి అర్థరాత్రి వరకు జనం ఉండేవారు. మంత్రిగా ఉన్నపుడు అత్యంత సామాన్యుడు సైతం ఆయనను చాలా సులువుగా కలిసే అవకాశం ఉండేది.అద్భుతమైన వ్యక్తిత్వం ఆయనది. మానవత్వం ఉట్టిపడే పెద్ద మనసు ఆయనది.. ఖులా దిల్.. ఖులే హాత్ వాలా పిజెఆర్ అంటే అతిశయోక్తి కాదు.

**రిక్షా కార్మికుడి కోసం ఆరాటం**

పిజెఆర్ ప్రజా జీవితం అద్భుతమైనది. రాజకీయాల్లో నటన తెలియని వాడు ఆయన! పేదోడి కోసం ఏ లెవల్ కైనా వెళ్లే గుణం ఆయనది!ఒకసారి ఒక రిక్షా కార్మికుడి కోసం ఉస్మానియా ఆసుపత్రి వైద్యుడి పై పీజేఆర్ చేయి చేసుకున్నారు..ఇంకేముంది డాక్టర్లు సమ్మెకు వెళ్లడం వగైరా జరిగింది.ఇలా పేద ప్రజల కోసం వారి హక్కుల కోసం మంత్రిగా ఉండి కూడా ప్రభుత్వం తో గొడవకు దిగే వారు పిజెఆర్..అసెంబ్లీ లో విపక్షము లో ఉన్నా అధికారం లో ఉన్నా ఆయన గొంతు ప్రజల కోసమే అన్నట్లు ఉండేది..ఆయన పని తీరు ఎప్పుడూ ప్రతి పేదోడి గుండెను




తట్టేదిగా ఉండేది.. మాజీ సీఎం టిడిపి అధ్యక్షుడు ఎన్టీఆర్ మొదట ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంలో పిజెఆర్ ఎమ్మెల్యే గా లేరు..అప్పుడు ఆయనతో నాకో పని పడింది..నేను ప్రభాకర్..మధు అనే నా మిత్రులతో కలిసి ఆయన ఇంటికి వెళ్ళాము..అప్పటికే చీకటి పడింది.నన్ను ఉదయం 7 గంటలకు రమ్మన్నాడు పీజేఆర్ అన్న...నేను కార్వాన్ నుంచి సైకిల్ మీద వచ్చాను.అన్న అప్పుడే బయటికి వచ్చాడు..నన్ను చూసి తమ్మి లేటయ్యింది అంటూ వైట్ పైజామా బనియన్ మీద వైట్ షర్ట్ తొడుక్కుంటూ కండ్లలో ఊసులు తుడుచుకుంటూ, షర్ట్ బటన్స్ పెట్టుకుంటూ తన టాప్ లెస్ జీపులో నన్ను కూర్చుండ బెట్టుకుని అప్పటి దేవరకొండ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఇంటికి తానే డ్రైవ్ చేసుకుంటూ తీసుకెల్లాడు..నా అప్లికేషన్ కు ఎమ్మెల్యే కవరింగ్ లెటర్ నిమిషాల్లో సీఎం పేరిట రెడీ అయిపోయింది.అప్పుడు ఎన్టీఆర్ మొదటి క్రైసెస్ ఎదుర్కొంటున్న రోజులు సీఎం గా నాదెండ్ల భాస్కరరావు ఉన్నారు.28 రోజులు ఆయనప్పుడు సీఎం గా ఉన్నారు.నేరుగా ఆయన ఇంటికి వెళ్ళగానే పిజెఆర్ నన్ను ఆయనకు పరిచయం చేసి పని చెప్పి దరకాస్తు ముందు పెట్టారు.సీఎం శాంక్షన్డ్ యాస్ ఫర్ ది పిటిషన్ అని రాసి సంతకం చేశారు.ఆ కాగితాలు చేతిలో తీసుకుని సీద హోమ్ డిపార్ట్మెంట్ కు వెళితే సెక్రటరీ రాలేదు.కొద్ది సేపు లిబర్టీ కేఫ్ లో( ఇప్పుడు అది లేదు )ఆగి టీ తాగి వెళ్ళాము..పీజేఆర్ అన్న హోమ్ సెక్రటరీ దగ్గరికి వెళ్లి 20 నిమిషాలకు ఆర్డర్ తో బయటకు వచ్చారు..ఇంతకీ అది నా పేరోల్ ఎక్స్టెన్షన్ ఆర్డర్ అన్నమాట..ఆ ఆర్డర్ నా షర్ట్ జేబులో పెట్టి ఇగ వెల్లు తమ్మి, ఆల్ది బెస్ట్ అంటూ నన్ను తన ఇంటి వద్ద నే ఉన్న నా సైకిల్ దాకా తీసుకెల్లి వదిలి ఇంటిలోకి వెళ్ళి పోయాడు ఆ మహా నేత!..పీజేఆర్ వాహ్ లీడర్ హోతో అయిసా పిజెఆర్ జైసా! అనుకున్నాను.

**ఆర్భాటాలు లేని నేత**

ఆర్భాటాలు లేవు. తాను ఏదో పెద్ద పని చేసిన బిల్డప్ లేదు..నా కండ్లలో అనుకోకుండానే నీళ్లు తిరిగాయి.నన్ను కనీసం కృతజ్ఞతలు కూడా చెప్పనీయకుండా..తమ్మీ నీవు ఎవరికోసం ఇంత గోస పడుతున్నావో నాకు తెలుసు..నీలాంటి వాడికి హెల్ప్ చేస్తే నాకు మేలు జరుగుతది..ఏమన్నా అవసరముంటే కలువు అన్నాడు..నిజానికి నేను పీజేఆర్ అన్నకు పరిచయమై కొన్ని గంటలే అవుతున్నా ఆయన అంత హెల్ప్ చేసాడు.ఆయన పని తీరు అద్భుతం..తాను అధికారం లో ఉన్నా, లేకున్నా ఇలాగే ఉంటాడు! ఆయన సహాయ చర్యల్లో ఇదో మచ్చుతునక మాత్రమే!నా లాంటి వారికి ఎందరికో ఆయన ఎన్నో సహాయాలు చేశారు.ఆయన ఎన్నో గుప్త దానాలు చేస్తుండగా నేను చూసాను..చాలా గొప్ప మనిషి పిజెఆర్..ఇప్పుడు ఏదో పిడికెడు మంది మినహా ప్రోటోకాల్ ల యావలో పడిపోయి చాలామంది ఎమ్మెల్యేలు, ఎంపీలు అహంకారం తో విర్రవీగుతూ అధికారం శాశ్వితం అనుకునే ప్రస్తుత పరిస్థితుల్లో పీజేఆర్ లాంటి వారి నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉంది.ఆయన గురించి తెలుసు కోవాలి... పీజేఆర్ అంతిమ యాత్రలో లక్షలమంది పాల్గొని కన్నీరు మున్నీరైనారు...హైదరాబాద్ గుండె చెరువైంది..పేదల గల్లీలు ఏడ్చాయి..అందులో నేనూ ఉన్నాను...ఖైరతాబాద్ నియోజకవర్గమే కాదు హైదరాబాద్ లోని చాలా కూడలులలో పీజేఆర్ కాంస్య ఇతర విగ్రహాలు కనిపిస్తాయి.జనంలో ఆయనను ఆయన ఫోటోను ఇంటిలో పెట్టుకుని నేటికీ ఆరాదిస్తుంటారు..ఆయన ఓ ప్రజల నిజమైన నాయకుడు ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం..కొందరికి రాబిన్ హుడ్ లాంటి వాడు. నేటికి పిజెఆర్ స్థానాన్ని భర్తి చేసిన నేత హైదరాబాద్ కు లభించలేదు. పీజేఆర్ అమర్ రహే.. అర్ధరాత్రి అన్నా.. అని పిలిస్తే నేను ఉన్నాను వస్తున్నాను, అని లేచి వచ్చే పిలిస్తే పలికే నేత కనుచూపులో కూడా కాన రావడం లేదు. సమాజంలో మంచి లీడర్ల కొరత ఉంది. అలాంటి వారిని జనం ఒక్కోసారి ఓడిస్తున్నారు. నిజాయితీ గా జనం వెంట వచ్చి పని చేసిపెట్టే వారి కోసం ఇంకా జనం కండ్లు వెతుకుతున్న పరిస్థితి ఉంది అంటే అతిశయోక్తి కాదు.పీజేఆర్ అమర్ రహే. తెలంగాణకి జాన్ పిజెఆర్ పేద ప్రజల గుండెల్లో సజీవం అనక తప్పదు. పిజెఆర్ లాంటి నేతల కొరత తీవ్రంగా ఉన్నది.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

# ఆర్టీసీ బస్సా.. అమ్మో నేను రాను..!

- ఉచిత ప్రయాణంతో ఇక్కట్లు, సమయానికి రాని బస్సులు
- ప్రయాణికులను దోచేస్తున్న ఆర్టీసీ

అత్తో పోదాం రావే మన ఊరి దవాఖానాకు.. నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అంటూ ఓ సినీ గాయకుడు పాడిన ఆ పాట అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది.ప్రభుత్వ దవాఖానాల్లో వెక్కిరిస్తున్న సమస్యలు, రోగులకు అందుతున్న అరకొర వైద్య సేవల దుస్థితిని దృశ్యరూపంలో ఎత్తిచూపారు. ప్రస్తుత ఆర్టీసీ వ్యవస్థ నాటి సర్కారు దవాఖానాల తీరుకు అద్దం పడుతుంది అని చెప్పుకోవచ్చు.

**హత్నూర, డిసెంబర్ 26 (జనంసాక్షి)**
బస్సు ఎక్కాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. ఆర్టీసీ బస్టాండుల్లో ఎటు చూసినా ప్రయాణికులు కిక్కిరిసి పోతున్నారు. వృద్ధులు,చిన్నపిల్లలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

### సమయానికి రాని బస్సులు..

టైం టేబుల్ ప్రకారం ఆయా గమ్యస్థానాలకు వెళ్ళేందుకు ఏర్పాటు చేసిన బస్సులు సమయానికి రాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల కోసం ఎదురు చూస్తూ బస్టాండుల్లో పడిగాపులు కాస్తున్నారు.గంటల తరబడి బస్సులు రాకపోవడంతో ప్రయాణికుల రద్దీ పెరిగి ఒక్కో బస్సులో నిలబడేందుకు చోటు లేనంతగా పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు.సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కూర్చునేందుకు స్థలం లేక తప్పనిసరి పరిస్థితుల్లో గత్యంతరం లేక ఉక్కిరిబిక్కిరి అవుతూనే గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

### ఉచిత ప్రయాణంతో ఇక్కట్లు...

మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ప్రయాణికులకు ఇక్కట్లు తెచ్చిపెట్టింది.గతంలోకంటే మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుండటం అందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు.ఏ బస్సులో చూసినా 70 నుచి 80 శాతం మంది మహిళలు ఉంటే, కేవలం 20 శాతం మంది మాత్రమే పురుషులు ప్రయాణిస్తున్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం



కల్పించాలనే ప్రభుత్వ ఆశయం గొప్పదైనప్పటికి దాని ఫలితంగా ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే మార్గాలను కూడా ప్రభుత్వం అన్వేషించాలని ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

### ఆర్టీసీ నయా దోపిడీ...

ఆర్టీసీ శాఖ నయా దోపిడికి పాల్పడుతోందని ప్రయాణికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.తెర మీద ఉచితాన్ని చూపుతూ తెర వెనుక దోపిడీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని చెబుతూ పురుషుల ప్రయాణ టిక్కెట్ల ధరలను అమాంతం పెంచేశారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఆర్డినరీ బస్సులను ఎక్స్ ప్రెస్ బస్సులని నమ్మిస్తూ కండక్టర్లు అధికంగా కిరాయి వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామాల అభివృద్ధికి పరిశ్రమల సహకారం అభినందనీయం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్‌చెరు, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వాములు కావడం అభినందనీయమని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలో తోషిబా పరిశ్రమ సహకారంతో కోటి 8 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన పల్లె దవఖాన భవనం, మూడు ఆరో ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. అనంతరం 60 లక్షల రూపాయల గ్రామపంచాయతీ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రతి పల్లె దవాఖానాలో వైద్యుడు తో పాటు ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రుద్రారం గ్రామ అభివృద్ధికి తోషిబా సంస్థ సహకారం అందించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ గ్రామ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండు, మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు హరిప్రసాద్ రెడ్డి, రాజు, వెంకన్న, తోషిబా సంస్థ ప్రతినిధి రామకృష్ణ, గ్రామ పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

- అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



**మక్తల్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** మక్తల్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మక్తల్ అఖిలపక్షం అద్వర్యంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మక్తల్ కు అన్ని రకాల వనరులు పుష్కలంగా ఉన్న సందర్భంలో మక్తల్ ను రెవెన్యూ డివిజన్ అంశంలో ప్రభుత్వానికీ సానుకూలంగా నివేదిక పంపాలని అఖిలపక్షం అధ్వర్యంలో ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డా. వాకిటి శ్రీహరి, అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా



**సంగారెడ్డి, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** సంగారెడ్డిలో కన్వీనర్ బీరయ్య యాదబ్ రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఐబీ నుంచి కొత్త బస్టాప్ వరకూ ధర్నా నిర్వహించారు. అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కమిటీ కన్వీనర్ బీరయ్య యాదవ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి బాబాసాహెబ్ డాక్టర్ బి అర్ అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు మాణిక్యం, మందుల వరలక్ష్మి, దుర్గాప్రసాద్, అశోక్, రమేష్ గౌడ్ జైపాల్ నాయక్, ప్రభుదాస్, యండి అన్వర్, గొల్ల ఆంజనేయులు, బాలయ్య, లావణ్య, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# పాతికేళ్ల పాఠశాల..పెను ప్రమాదం..!

- శిథిలావస్థతో విషసర్పాలు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా..
- ప్రహరీ నిర్మాణం లేక కబ్జాలకు గురైన బడి స్థలం

**న్యాల్‌కల్, డిసెంబర్ 26 (జనంసాక్షి)**
స్థానికంగా సౌకర్యవంతమైన పాఠశాల భవన నిర్మాణం లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో మెరుగైన రోడ్డు, రవాణా సౌకర్యం లేకున్నా ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యనభ్యసించేందుకు కిలోమీటర్ల మేర కాలినడకన, లేదంటే సైకిళ్ళ పైన చిన్నారులు బడులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. బాలికలు బడులకు వెళ్ళలేని పరిస్థితి నెలకొనేది. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పలుమార్లు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకు పోవడంతో సమస్యను గుర్తించిన అధికారులు అదనపు గదుల నిర్మాణాలను చేపట్టారు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా సౌకర్యవంతంగా ఉన్న పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది.
పాఠశాలను గుర్తించిన ఉన్నతాధికారులు తాజాగా రూ: లక్షలు వెచ్చించి నూతన పాఠశాల భవనాన్ని నిర్మించారు. నూతనంగా నిర్మించిన భవనానికి సమీపంలో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం విద్యార్థులకు పెను ప్రమాదకరంగా మారింది. శిథిల భవనాన్ని కూల్చివేసి సౌకర్యవంతంగా మార్చాలని గ్రామస్తులు, యువకులు, పాఠశాల విద్యార్థులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

### పాతిక సంవత్సరాల క్రితం నిర్మాణం..

సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, గుంజేటి గ్రామంలో విద్యార్థులకు సౌకర్యవంతమైన నూతన పాఠశాల భవనాన్ని నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం దృష్టిసారించింది. నూతనంగా.."నిర్మించిన అదనపు గది పాఠశాల భవనాన్ని" ఆగస్టు, 04,1998లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి (ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ అధినేత) కే.చంద్రశేఖర రావు,



నాటి ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు ప్రాథమికోన్నత పాఠశాలను ప్రారంభించారు. నిర్మాణం చేపట్టి పాతిక సంవత్సరాల పై పడటంతో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. విష సర్పాలు, అసంఘిక కార్యక్రమాలకు శిథిల భవనం కేంద్రంగా మారింది. శీతల భవనాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు అక్రమార్కులు పాఠశాల స్థలాన్ని దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడు తరగతులకు గాను కేవలం 45 గురు విద్యార్థులు మాత్రమే పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ఒక ప్రధానోపాధ్యాయుడితో పాటు మరో ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. రూ: లక్షలు వెచ్చించి నూతన భవన నిర్మాణం చేపట్టిన సమీపంలో గల శిథిల భవనంతో నూతన పాఠశాల ఆవరణ అసౌకర్యంగా, ప్రమాదకరంగా మారడంతో వందల సంఖ్యలో ఉన్న విద్యార్థులు ఏటేటా పదుల సంఖ్యలకు తగ్గుముఖం పడుతోంది.



### గ్రంథాలయ నిర్మాణం చేపట్టాలి



పాతిక సంవత్సరాల క్రితం నిర్మించిన పాఠశాల ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అసాంఘిక కార్యక్రమాలకు కేంద్రంగా మారింది. కొందరు పాఠశాల స్థలాన్ని ఆక్రమణలకు పాల్పడుతున్నారు. శీతల భవనాన్ని తొలగించి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలి. పాఠశాల ఆవరణలో గ్రంథాలయ భవనాన్ని నిర్మించాలి.

**బాలకృష్ణ, గుంజేటి**

### జిల్లా పరిషత్ అనుమతితో త్వరలో తొలగిస్తాం

గుంజేటిలోని ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల ఆవరణలో పాతిక సంవత్సరాల క్రితం నిర్మించిన అదనపు గతుల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంపీడీఓ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారుల నివేదికల ఆధారంగా జిల్లా పరిషత్ కు సమర్పిస్తాం. జిల్లా పరిషత్ అధికారుల అనుమతి రాగానే వెంటనే శిథిల భవనాన్ని కూల్చివేస్తాం. విద్యార్థులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. ప్రహరీ నిర్మాణానికై అవసరమగు నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదికను పంపుతాం.

**ఎంఈఓ మారుతి**

## బుదేరాలో కారులో నుంచి రూ.10 లక్షలు చోరి


- దొంగిలించిన డబ్బులు రికవరీ



**మునిపల్లి, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** మునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బుదేరా సమీపంలోని ఓ ధాబా ముందు ఆపిన కారులో నుంచి దొంగలు దొంగిలించిన డబ్బును పోలీసులు రికవరీ చేశారు.సీఐ వెంకటేష్ వెల్లడించిన వివరాల ప్రకారం హైదరాబాద్ కు చెందిన అబ్దుల్ వాజీద్ ఈ నెల 16న తన స్నేహితులతో కలిసి కలిసి కర్ణాటకలోని బసవకళ్యాణ్ వెళ్ళడానికి బ్రీజా కారులో బయలు దేరారు. మార్గ మధ్యలో భోజనం చేయడానికి మునిపల్లి మండలం బుదేరాలోని ఓ ధాబాలోకి వెళ్లారు.వారి ధాబాలోకి వెళ్ళగానే గుర్తు తెలియని దొంగలు వాజీద్ కారు లో గల పది లక్షల నగదును దొంగిలించారు. కారులో గల నగదు చోరికి గురైందని అదే రోజు బుదేరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడాన్నారు.సీఐ వెంకటేష్, ఎస్సై రాజేష్ నాయక్‌లు తమ సిబ్బందితో సీసీ కెమెరాలు తనిఖీ చేయగా హైదరాబాద్‌లోని ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ అలీ ఖురేషి, అబ్దుల్ వహీద్, రహీంఖాన్‌లు దొంగిలించినట్టు గుర్తించారు. గురువారం నాడు వారి నుంచి పది లక్షల రూపాయలను రికవరీ చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

## సమాచార లేని సమాచారం బోర్డు

**మల్దకల్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలోని సమాచార హక్కు చట్టం 2005 బోర్డుపై రాయాల్సిన అధికారుల పేరు, హోదా రాయకుండా మర్చిపోయారు.ప్రతిరోజు హాస్టల్ వార్డెన్ వస్తుంటాడు పోతుంటాడు కానీ బోర్డు పై నిఘా ఉంచకుండగా వెళ్ళిపోతున్నాడు.ఇప్పటికీ ఐదు సార్లు మండల స్పెషల్ ఆఫీసర్ కూడా హాస్టల్ సందర్శించి వెళ్లిపోయారు. కానీ ఆమె కూడా చూసిచూడనట్లు ఉన్నట్లు తెలుస్తుంది. సమాచార అధికారి, పౌర సహాయ సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి పేర్లు రాయకుండగా మర్చిపోయారా లేదా కావాలని రాయించడం లేదా అని పలువురు అంటున్నారు.




## ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలతోనే వాయు కాలుష్యానికి అంతం



- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలతో వాయు కాలుష్యాన్ని నిర్మూలించవచ్చని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తాండూరు పట్టణంలో ఎడిఎంఎస్ ఎలక్ట్రానిక్ బైక్ షోరూంను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలతో వాహన కాలుష్యాన్ని నిర్మూలించవచ్చని తెలిపారు.అనంతరం యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి.కౌన్సిలర్ ప్రబాకర్ గౌడ్ ,పట్లోళ్ల నర్సింలు, పరిమళ్, కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి
- కేఎల్ఆర్ స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారులకు కిట్ల పంపిణీ

**పెబ్బేరు, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఉత్సాహం ఏర్పడుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి అన్నారు. గురువారం పెబ్బేరు పట్టణ కేంద్రంలో కేఎల్ఆర్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు కే కృష్ణ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాకారుల కిట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ జి. చిన్నా రెడ్డి, హాజరయ్యారు .మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణ శ్రీ సాయినాథ్, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కారుపాకుల వెంకట్ రాములు యాదవ్ సింగిల్ విండో అధ్యక్షులు గౌని కోదండరామిరెడ్డి పాల్గొని క్రీడాకారులకు కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ, క్రీడలతోనే మానసిక ఉల్లాసం భౌతిక దృఢత్వం ఏర్పడుతుందని అప్పుడే చదువుపై శ్రద్ధ వస్తుందని సూచించారు. క్రీడారంగంలో రాణించాలని, విద్యారంగంలో కూడా రాణిస్తారని కోరారు. క్రీడలకు సంబంధించిన ఏ విషయంలోనూ ప్రభుత్వ





పరంగా మీకు తోడుంటామని హామి ఇచ్చారు. సంస్థ నిర్వాహకులు కృష్ణ కుమార్ రెడ్డి కృషిని డాక్టర్ జి చిన్నారెడ్డి కొనియాడారు. ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా మత్స్య కార్మిక చైర్మన్ నందిమల్ల యాదయ్య, శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాములు యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు మన్యం, బీసీ సెల్ మండల అధ్యక్షులు వెంకటరత్నం నాయుడు, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వల్లపు రెడ్డి రణధీర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ముస్తాక్, నరేందర్, మహేశ్వర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, హరి కుమార్ రెడ్డి ఈశ్వర్ రెడ్డి పాతపల్లి చంద్రశేఖర్, ఆనంద్ సాగర్ , సాయి రెడ్డి లక్ష్మీకాంత రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి విజయ్ గౌడ్, విజయవర్ధన్ గౌడ్, కోళ్ల వెంకటేష్ చీర్ల జనార్దన్ సాగర్ ఎండి బాబా వెంకటేష్ పి అనిల్ నరేష్, మాజీ ఎంపిటిసి సభ్యులు ఎల్లస్వామి అశోక్ రెడ్డి,శేరుపల్లి వెంకటేష్ సాగర్,డైరెక్టర్ కృష్ణయ్య, శ్రీనివాస్ యాదవ్, దేవన్న గౌడ్ బొట్టన శ్రీను ,ఎండి అప్సరు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కొత్తగా గద్దర్ రాష్ట్ర అవార్డ్సను ప్రవేశపెట్టండి

**• గద్దర్ పేర సినీ అవార్డ్స్ విషయంలో పునరాలోచన చేయాలి**



**హైదరాబాద్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** సినిమా అనేది నటన, కల్పితమైన సన్నివేశాలు, ఆలోచనలు ఎక్కువ శాతం ఉంటాయి. నాలుగుగోడల మధ్యలో తెరమీద ప్రదర్శించేది మాత్రమే. కానీ గద్దర్ ఒక నిజం. గద్దర్ ప్రజాక్షేత్రంలో నాయకుడు. ప్రజా గొంతుక. తెలంగాణ పోరాట వీరుడు" అని స్కై ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్. వై. సంజీవ కుమార్ గుర్తుచేశారు. గద్దర్ జీవితంలో జరిగిన ప్రతి సంఘటన నిజం. నిజమైన జీవితాన్ని అనుభవించిన వ్యక్తి గద్దర్. అలాంటి మహనీయుని పేరుమీద నటనలకోసం అవార్డ్స్ ఇవ్వడం తగిన ఆలోచన కాదన్నారు. తెలంగాణ సామజిక పరిస్థితులను అన్నిటిని పరిగణంలోకి తీసుకోని మార్పులు చేయవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సినిమాల అవార్డ్స్ కోసం మరో పేరును ప్రతిపాదించి అవార్డ్స్ ఇవ్వండి, గద్దర్ పేరిట గద్దర్ రాష్ట్ర అవార్డ్స్ పేరిట కొత్తగా ప్రవేశపెట్టి ప్రజాక్షేత్రంలో లేదా ప్రభుత్వ పాలనలో, నిస్వార్థమైన సేవలు అందించినవారిని గుర్తించి, ఎన్నిక చేసి గద్దర్ రాష్ట్ర అవార్డ్స్ ను ప్రతి సంవత్సరం జరుపుకునే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ రెండవ తేదీన ఇవ్వగలరని, నిజమైన నాయకుని ఇచ్చే అద్భుతమైన గౌరవం అవుతుందని అన్నారు. నిజమైన ఆ మహనీయుడు గద్దర్ పేరుమీద అవార్డ్స్ తీసుకునే ప్రతి ఒక్కరూ నిజమే అవుతారు. నిజజీవిత విజేతలవుతారని స్పష్టం చేశారు.

## భర్తను సోదరితో కలిసి హత్య చేసిన భార్య

**రాజేంద్రనగర్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** మద్యానికి బానిసై భార్యను నిత్యం వేధిస్తున్నాడని కక్ష గట్టుకొని భార్య అతని సోదరితో కలిసి హత్య చేసిన సంఘటనలో మైలార్ దేవ్పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కి తరలించారు. మైలార్ దేవ్ పల్లి ఇన్స్పెక్టర్ నరేందర్ తెలిపిన ప్రకారం ఈనెల 24న దుర్గానగర్ నుండి ఆరాంఘర్ చౌరస్తా మధ్య హ్యాపీ వైన్స్ ఎదురుగా నీరులేని డ్రైనేజీలో మృతదేహం కేసులో పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా పర్యవేక్షించి మృతుడు ఎమ్డి ముంతాజ్ ఆలం (40) బీహార్కు చెందిన ఉడమ్గడ్డ వద్ద చికెన్ సెంటర్లో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై నిత్యం సేవిస్తూ భార్యను హింసించేవాడని 5 తట్టుకోలేని అతని భార్య రౌషన్ కటూన్(35)ఆమె సోదరి తో కలిసి మధ్య మధ్యలో ఉన్న తన భర్తకు గుడ్డతో గొంతుకు బిగించి ఊపిరి ఆడకుండా చేయడంతో మృతి చెందిన అతన్ని ఈనెల 21 న రాత్రి 1గంటల సమయంలో మృతదేహాన్ని ప్యాసింజర్ ఆటోలో తీసుకెళ్లి డ్రైనేజీలో పడేశారు. నిందితులిద్దర్ని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించారు.

# అధ్వానంగా ఝరాసంగం గ్రామీణ రోడ్లు..!

**• ఇబ్బందుల్లో ఆయా గ్రామాల ప్రజలు**

**• అత్యవసరం ఉంటే అంతే సంగతి**

**గ్రామీణ ప్రజల సౌకర్యార్థం వేసిన తారు రోడ్లు పూర్తిగా గుంతలమాయంగా, కంకర తేలడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారిన రోడ్లను బాగు చేసే వారే లేకుండా పోయారు. దీంతో ఈ రోడ్ల పై ప్రజలు ప్రయణం కొనసాగించాలంటే నరకయాతన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చి హామీలు గుప్పించడమే తప్పా తిరిగి గ్రామాలకు వచ్చి సమస్యలను తెలుసుకునే వారు కరువయ్యారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొంది.**



**ఝరాసంగం, డిసెంబర్ 26 (జనంసాక్షి)**

ఝరాసంగం మండలంలోని గ్రామీణ ప్రాంతా రోడ్లు అధ్వాన్నంగా మారడంతో ఆయా గ్రామాల ప్రజలకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మాచూనూర్ నుంచి బర్దీపూర్ కు వెళ్లే తారు రోడ్డు పై గుంతలు ఏర్పాడడంతో ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. ఈ రోడ్డు గుండా ప్రతి రోజు చీలపల్లి, చీలపల్లి తాండ, న్యాల్కల్, నారాయణఖేడ్ ప్రాంతాలకు ప్రజలు రాకపోకలు జరుపుతారు. అదే విధంగా మేదపల్లి నుంచి దిగ్వాల్ వరకు తారు రోడ్డు దెబ్బతింది. ఈ రోడ్డుపై గత ప్రభుత్వ హాయంలో సన్న కంకర వేసి వదిలిపెట్టారు. దీంతో ప్రతి రోజు దుమ్ము, దూళి విపరీతంగా లేవడం వల్ల ఈ రోడ్డు గుండా వెళ్ళలంటేనే జంకుతున్నారు. ఈ రోడ్డు గుండా వివిధ పనుల నిమిత్తం సంగారెడ్డి, హైదారాబాద్ పట్టణలకు ద్విగాల్ హైవే మీదుగా ప్రయాణం కొనసాగిస్తారు. అదే విధంగా బోజ్యానాయక్ తాండా, పూర్యనాయక్ తాండల రోడ్లు కూడా పూర్తిగా కంకర తేలడంతో తాండ వాసులు ప్రయాణం అగమ్యగోచరంగా మారింది. రెండు తాండల గిరిజనలు వివిధ పనలు కోసం మండల కేంద్రమైన ఝరాసంగంలోని ప్రభుత్వ కార్యలయాలకు వెళ్తుంటారు. రోడ్లు కంకర తేలడంతో ప్రతి నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గత నెల రోజుల క్రితం బోజ్యానాయక్ తండాకు చెందిన మహిళకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ప్రసవం కొరకు ఝరాసంగంలోని ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తరిలిస్తుడంగా మార్గ మధ్యలోని ప్రసవించింది. ఈ తాండల నుంచి కక్కర్వాడ గ్రామం వరకు పూర్తిగా కంకర తెలిన రోడ్డు ఉండడం వల్లే ఈ సంఘటన చోటుచేసుకుందని గ్రామస్తు వాపోయ్యారు. తాండ రోడ్లను బాగు చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న ఏలాంటి ఫలితం లేకుండా పోయందని తాండ వాసులు పేర్కోన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోని గ్రామీణ ప్రాంతాల రోడ్లను బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### తండాలకు తారు రోడ్డును వేయండి



తమ తండాలకు సక్రమంగా రోడ్డు లేక పోవడంతో ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నాం. ఏదైన అత్యవసరం వస్తే ఎప్పుడు ఏమి జరుగుతుందోననే భయాందొళన కలుగుతుంది. గత నెల రోజల క్రితం తమ తాండ నుంచి నా ఆటోలోనే గర్భిణీ స్త్రీని ఝరాసంగం ప్రభుత్వ ఆస్పత్రికి తరిలిస్తుండగా కంకర వల్ల మార్గ మధ్యంలోనే ప్రసవించి అడ శిశువుకు జన్మనిచింది. గత ప్రభుత్వ హాయంలో పాలకులకు పలుమార్లు తెలిపిన ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా పాలకు అధికారులు తమ కష్టాలను గుర్తించి చొరవ తీసుకొని తాండలకు రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

**వినోద్, బోజ్యానాయక్ తాండ**

# విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయానికే అధిక ప్రాధాన్యం

**• ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**




**మహబూబ్నగర్ బ్యూరో, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయానికే ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ప్రజా ఇస్తుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ పట్టణంలోని మథర్సా ఇస్లామీయా కాషిఫ్ ఉల్ ఉలూమ్ సంస్థలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఉచితంగా దుప్పట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా నిబద్ధతతో విద్య అభివృద్ధికి పాటుపడుతున్న ఇటువంటి సంస్థలు చాలా ఉన్నాయని, అటువంటి సంస్థలకు కావలసిన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గతంలో ఈ విద్య సంస్థలో విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు, అవసరమైన కంప్యూటర్ కూడా అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా పనిచేస్తుందని, రాత్రికి రాత్రే నిర్ణయాలు తీసుకోదని, అధికారులతో, మంత్రులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. అభివృద్ధి అనేది ఒక సంవత్సరంలో సాధ్యం కాదని ఒక్క సంవత్సరంలోనే 50 సంవత్సరాల పేదరికం దూరం కాదని అలా భావించడం కూడా కష్టతరమని ఆయన అన్నారు. రైతును బ్రతికించుకోవడం, నాణ్యమైన విద్యను, వైద్యాన్ని ఉచితంగా అందించడం, నిరుద్యోగ యువతకు అండగా నిలిచి ఉపాధి అందించడం ఇవి మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని, అందుకే బడ్జెట్ లో సైతం ఎక్కువ నిధులు వీటికి కేటాయించి బడ్జెట్ లో కేటాయించిన ప్రతి పైసా నిజమైన లబ్ధిదారుడికి చేరాలన్నదే మా ప్రభుత్వ ప్రధాన లక్షమని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి మీ ఆలోచనలు, మీ సలహాలు తీసుకొని మహబూబ్ నగర్ ను తెలంగాణ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, నూరూల్ హాసన్, రఫీక్ పటేల్, సమద్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, మోయిూస్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో 'రెసోనెన్స్' విద్యార్థుల ప్రతిభ

**• ఎన్ఏటీ, ఐఈఎల్టీఎస్ పరీక్షలలో అపూర్వ విజయం**




**హైదరాబాద్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** రెసోనెన్స్ గ్లోబల్ క్యాంపస్కు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో అద్భుతంగా రాణించారని రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్ర రావు తెలిపారు. రెసోనెన్స్ విద్యార్థులు ఎస్ఏటీ, ఐఈఎల్టీఎస్ వంటి పోటీ పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచారన్నారు. ఈ మేరకు మాదాపూర్ గ్లోబల్ క్యాంపస్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశానికి విద్యార్థులను సిద్ధం చేయడమే లక్ష్యంగా 'రెసోనెన్స్ గ్లోబల్' ఆవిర్భవించిందన్నారు. మాదాపూర్ క్యాంపస్కు చెందిన విద్యార్థులు ఈ పరీక్షల్లో అద్భుతమైన స్కోర్లను సాధించారన్నారు. ప్రపంచంలో ప్రతిభావంతులైన విద్యార్థులతో పోటీ పడి ఎంఐటీ, హార్వర్డ్, స్టాన్ఫోర్డ్, ఆక్స్ఫర్డ్, ఎన్యూఎస్ వంటి ప్రఖ్యాత సంస్థల్లో ప్రవేశానికి మార్గాన్ని తెరిచారన్నారు. ఈ విజయాలు అంతర్జాతీయ అవకాశాలను తెరవడమే కాకుండా, రెసోనెన్స్ గ్లోబల్ క్యాంపస్ అసాధారణ విద్యా ప్రమాణాలను తెలియజేస్తున్నాయని తెలిపారు.

## ఎన్ని అక్రమ కేసులు పెట్టినా సర్కార్ను నిలదీస్తాం

**• ఎర్రోళ్ల శ్రీనివాస్ అక్రమ అరెస్టు ప్రజాస్వామ్య వ్యతిరేకం**

**• తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్**

**హైదరాబాద్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** ఇందిరమ్మ రాజ్యమంటే నిర్బంధ పాలన అని కాంగ్రెస్ మరోసారి రుజువు చేసిందని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ మండిపడ్డారు. ఇవాళ ఉదయం ఎర్రోళ్ల శ్రీనివాస్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడం కాంగ్రెస్ సర్కార్ కు పరిపాటిగా మారిందన్నారు. అసలు ఎఫ్ఐఆర్ లో పేరు లేకుండా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. సర్కార్ తప్పిదాలను ప్రశ్నిస్తే సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు కేసుల పేరుతో భయభ్రాంతులకు కాంగ్రెస్ గురిచేస్తుందన్నారు. బీఆర్ఎస్ సైన్యానికి కేసులు కొత్తకాదన్నారు. ఎన్ని కేసులు పెట్టిన సరే తప్పకుండా ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారెంటీలను అటకెక్కించి, ఏడో గ్యారెంటీగా "ఎమర్జెన్సీ"ని ముఖ్యమంత్రి అమలుచేస్తున్నారని విమర్శించారు.

# ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలు నివారించాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనా రాయణ చౌరస్తా, యాద్గిరి ప్రధాన రహదారి పై ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు, వాహన దారులకు రోడ్డు భద్రత నియ మాలపై అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాల్ రాజు మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదు అని, సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే వాహనదారులు మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదానికి గురై అవకాశం ఉంటుందని, జాగ్రత్తగా వచ్చే వారి వాహనాలకు కూడా రోడ్డు ప్రమాదాలు జరిగా అవకాశం ఉంటుంది అని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానా తో పాటు జైలుకు పంపించడం జరుగుతుంది అని తెలిపారు. మద్యపానం సేవించడం వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఏకువ ఉంది కాబట్టి వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదు. టూ వీలర్స్ పై ఇద్దరకు మించి ప్రయాణించ రాదు. ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను మరియు కూలీలను ఎక్కించుకోరాదు. ఆటోలో సీట్ పర్మిట్ ఉన్నం తవరకే ప్యాసింజర్ ఎక్కించు కోవాలి. డ్రైవింగ్ చేస్తూ సెల్ఫోన్ మాట్లాడరాదు. రాష్ డ్రైవింగ్ చేయరాదు. పరిమిత వేగంలో వాహనాలు నడపాలి. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు లు రాజు, ఆంజనేయులు వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలు రెండు ఇండ్లలో చోరీ

**• బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ**

**మిడ్జిల్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** పట్టపగలే రెండు ఇళ్లలో చోరీ జరిగిన సంఘటన మిడ్జిల్ మండలంలోని బోయినపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శివ నాగేశ్వర్ నాయుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బోయినపల్లి గ్రామానికి చెందిన మునీర్, వస్పరి కృష్ణయ్య లకు చెందిన తాళాలు వేసిన ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం జరిగిందని, మునీర్ ఇంటిలో 30 తులాల వెండి, 33 వేల నగదు, ఒక తులం బంగారు, అదే గ్రామానికి చెందిన వసపరి కృష్ణయ్య ఇంట్లో 20 తులాల వెండి, రెండు మాసాల బంగారం దొంగతనం జరిగినట్లు వెల్లడించారు. సమాచారం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని క్లోస్ టీంతో ఆధారాలు సేకరించి ఇంటి పరిసరాలను పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## నాటు సారాయి తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు

**ఎక్సైజ్ సిఐ బాలగంగాధర్**



**తాండూరు, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** ప్రభుత్వ నిషేధిత నాటు సారాయి తయారుచేసిన విక్రయించిన కఠిన చర్య తప్పవని ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ పేర్కొన్నారు. బుధవారం విశ్వసనీయ సమాచారము మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ అదేశానుశారం ఊరేంటితాండలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ మాట్లాడుతూ రాంసింగ్ తాండ నుండిఊరేంటితాండ వైపు హీరో హెూండా ద్విచక్ర వాహనం ఏపీ 09బిసి 8240 పైన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నారని, వారిని పరిశీలించగా, వాహనము పై ఇద్దరువ్యక్తుల మధ్యలో,ఒక సంచిలో, (2) ప్లాస్టిక్ బాటల్ లో కలిపి (4) లీటర్ల గుడంబా కలదు. వారిని ప్రశ్నించగా, కర్ణాటక రాష్ట్రము లోని కుంచారం నుండి బెల్లము కొద్ది కొద్దిగా తెచ్చి రాంసింగ్ తాండలో గుడంబా తయారుచేసి ఊరేంటి తాండలో అమ్ముతామని తెలిపారు. వారిని అరెస్టు చేసి సెక్షన్ 35(3)బిఎన్.ఎస్.ఎస్ ప్రకారము నోటీసులు అందజేశారు. పట్టుబడిన నిందితులు రాథోడ్ రవి, చవాన్ సోని భాయిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ ఐ నిజాముద్దీన్, ఈ.సి రవి కిషోర్, రాజేందర్, మహేష్, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

# బీసీ కులగణనపై బీజేపీ వైఖరి చెప్పాలి

**• బీసీల సంక్షేమాన్ని గాలికొదిలేసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం**

**• బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసిన శాలివాహన, అరెకటిక సంఘం నేతలు**



**హైదరాబాద్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** బీసీ కులగణనపై తమ వైఖరి ఏంటో బీజేపీ పార్టీ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలు, కామారెడ్డి డిక్లరేషన్ అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ పార్టీ ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. బీసీలంటే బీజేపీ పార్టీకి లెక్కలేదా అని అడిగారు. గురువారం నాడు కుమ్మరి సంఘం నేతలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తన నివాసంలో కలిశారు. బీసీలు, ముఖ్యంగా కులవృత్తుల వారు ఎదుర్కొంటున్న సమస్యలను వారు ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని స్పష్టం చేశారు. కేసీఆర్ కులవృత్తులకు అన్ని విధాలా మద్ధతిచ్చారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కులవృత్తులను కుదేలు చేస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా బీసీల సంక్షేమాన్ని, అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నా... బీజేపీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. బీసీలు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్ లు అవ్వడం బీజేపీ పార్టీకి ఇష్టం లేదా అని ప్రశ్నించారు. బీసీ కులగణన విషయంలో ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదని సూచించారు. దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టం తీసుకొస్తే అన్ని రాష్ట్రాల్లో కులగణన జరుగుతుందని, కానీ కేంద్రం ఆ దిశగా అడుగులు వేయకపోవడం అంటే బీసీలపై ప్రేమ లేనట్లే మనం అర్థం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో యునైటెడ్ ఫులే ఫ్రంట్ నాయకులు బొల్ల శివ శంకర్, తెలంగాణ రాష్ట్ర శాలివాన సంఘ నాయకులు దుగుంట్ల నరేష్, నిమ్మలూరి శ్రీనివాస్, రేపాక రాంబాబు, రావులకోల్ ఎన్ మరియు తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక సంఘం నాయకులు హాకింకారి సురేందర్, జి. కే జహంగీర్, జీ. కే పరమేశ్వర్, ఏ వెంకటేశ్వర్, జి.కే అఖిల బాయి పాల్గొన్నారు.

## పాఠశాలను తెరిపించి ఉపాధ్యాయులను కేటాయించాలి

**• లంబాడి యువసేన నాయకుడు**

**కరాటే కిరణ్ నాయక్**



**ఉర్కొండ, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** మండలంలోని ఉరుకొండపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఠాగూర్ తండాలో పాఠశాలను తెరిపించి ఉపాధ్యాయులను కేటాయించాలని ఎంజెఆర్ లంబాడి యువసేన నాయకుడు కరాటే కిరణ్ నాయక్ తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా వ్యవస్థకు, రోడ్డు సౌకర్యాలకు అభివృద్ధికి అమడదూరంలో ఉన్న తండా ఉర్కొండ పేట గ్రామపంచాయతీకి ఎన్నికలు వస్తే నామినేషన్ అభ్యర్థులకు గెలుపును నిర్ణయించే తండా, ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ స్కూలు తెచ్చినా, తండాలో ఉన్న స్కూల్ తెరువక చాలా మంది బడి పిల్లలు తండా నుండి ప్రైవేటు స్కూల్కి వెళ్తున్నారన్నారు. చివరికి ప్రైవేట్ స్కూల్లో స్కూల్ ఫీజులు కట్టలేక, పిల్లలు బడికి వెళ్ళలేక చిన్న వయస్సులోనే చదువుని అర్థాంతరంగా మధ్యలో ఆపేసి ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం మగ పిల్లలు బాల కార్మికులుగా పనులు చేసుకోవడం జరుగుతుంది. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వ పాలకులు, మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) స్పందించి వెంటనే మారుమూల ఠాగూర్ తండాకు ఉపాధ్యాయులను కేటాయించి పిల్లల భవిష్యత్తుకు నాంది పలకాలని తెలియజేశారు.

# దాశరథి కవిత్వాలు శక్తిమవంతమైనవి

**హైదరాబాద్, డిసెంబర్ 26 (జనంసాక్షి)**



తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో కుసుమ ధర్మన్న కళాపీఠం ముద్రించిన మహాకవి దాశరథి శతజయంతి సందర్భంగా దాశరథిపై రాసిన పుస్తక పరిచయ సభ హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో జరిగింది. ముఖ్య అతిథి డా. నందిని సిధారెడ్డి వచ్చారు. సభాధ్యక్షులు రామకృష్ణ చంద్రమౌళి, విశిష్ట అతిథులు హైదరాబాద్ బుక్ ఫేర్ అధ్యక్షులు డా. యాకూబ్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. యన్. బాలాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా నందినీ సిద్ధా రెడ్డి మాట్లాడారు. నిజాం కాలంలో దాశరథి పోరాటు ఘట్టాలను వివరించారు. జైలు గోడలపై ఆయన రాసిన కవిత్వాలు ఎంతో శక్తిమవంతమైనవన్నారు. ఆ కవిత్వాలతో వట్టి కోట అల్వారు స్వామి, దాశరథి మధ్య ఉండే ఉద్యమ మైత్రిని వివరించారు. అనోన్యం, స్నేహానికి వారి పోరాటం ప్రతీక అని తెలిపారు. దర్పణం సాహిత్యవేదిక అధ్యక్షులు డా. రాయరావు సూర్యప్రకాష్ రావు, ఆత్మీయ అతిథులు: ప్రముఖ కవి విమర్శకులు శ్రీ గంటా మనోహర్ రెడ్డి, నాగయ్య కళాపీఠం చైర్పర్సన్ సరోజినీ దేవి, గోల్కొండ సాహితీ కళాసమితి అధ్యక్షులు అర్థ చంద్రప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. రాధా కుసుమ, పి. బడేసాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కలకలం రేపిన ఎస్సై, మహిళా కానిస్టేబుల్. నిఖిల్

# ఆత్మహత్యలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26 (జనం సాక్షి)**



రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఎస్ ఐ. మహిళ కానిస్టేబుల్, మరో యువకుడు నిఖిల్ అడ్లూరు ఎల్లారెడ్డి పెద్ద చెరువులో ఒకే ఆత్మహత్య చేసుకున్న వైనం బుధవారం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. మొదటగా కానిస్టేబుల్ శృతి, నిఖిల్ మృతదేహాలు లభ్యమయ్యాయి. బిక్కనూరు ఎస్సై సాయికుమార్ మృత దేహం కోసం బుధవారం రాత్రి అంతా రెస్క్యూటీమ్ గాలించి గురువారం తెల్లవారు జామున గుర్తించారు, ఎస్సై బిబిపేట్ మహిళా కానిస్టేబుల్ శ్రుతి, బిబిపేట్ సొసైటీ ఆపరేటర్ నిఖిల్ లు. బుధవారం సాయంత్రం నుండి ఫోన్ స్విచ్ ఆఫ్ ఉన్నట్టు సమాచారం.శృతి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు సమాచారం . శృతిని చెరువులో నుండి తీశాక కూడా తల భాగం నుండి రక్తం రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలేం జరిగింది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. అర్ధరాత్రి ఒంటిగంట వరకు చీమ్మ చీకట్లో కామారెడ్డి ఎస్పీ. సింధు శర్మ మరియు పోలీసులతో అధికారుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు నిర్వహించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్పి సింధు శర్మను వివరణ కోరగా పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత అన్ని విషయాలు వెల్లడిస్తామని తెలిపారు.

# పదేళ్లు కౌలు రైతులను పట్టించుకోని బిఆర్ఎస్..!

**నేడు వారి గురించి గగ్గోలు పెట్టడం హాస్యాస్పదం**

**విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**

**మంథని, (జనంసాక్షి) :**



పది సంవత్సరాల పాటు కౌలు రైతులను పట్టించుకోని టిఆర్ఎస్ పార్టీ కౌలు రైతుల గురించి గగ్గోలు పెడుతున్నారని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు విమర్శించారు. మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ఉపవాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమిలేని ప్రతి కౌలు రైతుకు వారు పండించిన పంటకు బోనస్ నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి అందించడంతో కౌలు రైతులకు మేలు జరిగిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ఇద్దరు కలిసి సమావేశం ఏర్పాటు చేసి రైతు భరోసా ఇంకా మెరుగైన రీతిలో అమలు చేయాలని ప్రణాళికలను రూపొందించారని త్వరలోనే రైతులకు రైతు భరోసా అమలు చేస్తామని తెలిపారు. కొద్దిగా ఆలస్యమైన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి మాటను నిలుపుకుంటుందని ప్రతి హామీని నెరవేరుస్తుందని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అనాడు ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని, దానిని గాడిలో పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను త్వరలో పూర్తిస్థాయిలో అమలు పరుస్తామని తెలిపారు. ఇప్పటికే మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేశాం ఇంకా కొన్ని త్వరలోనే అమలు చేస్తామన్నారు. రైతులకు ఇప్పటికే రెండు లక్షల రుణమాఫీ చేశామని, కౌలు రైతుల విషయంలో పంట పండించిన ప్రతి రైతుకు న్యాయం చేయాలని ఆలోచించి రైతు బోనస్ అందించి నేరుగా వారి ఖాతాలో డబ్బు చేరే విధంగా ఏర్పాటు చేయడంతో లక్షలాది మంది రైతులు సంతోషంగా ఉన్నారు.

# అభివృద్ధి పట్ల నిబద్ధత లేని కాంగ్రెస్ సర్కారు..

**ఆర్మూర్,డిసెంబర్ 26 ( జనం సాక్షి):**



కాంగ్రెస్ సర్కారుకు అభివృద్ధి పట్ల నిబద్ధత లేక ఆలూరు బైపాస్ రోడ్డు అనాథగా మారిందని బిఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం ఉదయం బ్రిడ్జి నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు.బైపాస్ రోడ్డు పొడవునా కరెంటు లైట్లు పెట్టడానికి ఆర్మూర్ మున్సిపాలిటీలో నిధులు లేవా అని నిలదీశారు.గత ప్రభుత్వంలో చేపట్టిన పథకాలు, నిర్మాణాల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది నుంచి ఆలూరు బైపాస్ రోడ్డును నిర్లక్ష్యం చేస్తోందని, ఆలనాపాలనా కరువైందన్నారు.ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్,కమిషనర్

ఇకనైనా ఆలూరు బైపాస్ రోడ్డుపై శ్రద్ధ పెట్టి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు.నందిపేట్ డబుల్ రోడ్డు పొడవునా మొక్కలు నాటాలని,డబుల్ రోడ్డు డివైడర్ పొడవునా విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటి వాటి సంరక్షణ పై శ్రద్ధ పెట్టాలని జీవన్ రెడ్డి కోరారు

# కోటి రూపాయలు వృధా ఖర్చేనా.?

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం ఎక్కడికక్కడే నిలిచిపోయాయి**

**భీమదేవరపల్లి డిసెంబర్ 26(జనం సాక్షి)**



గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామంలో 41 డబుల్ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసి పనులు కూడా ప్రారంభించారు.కానీ ఈ డబుల్ ఇండ్లు ప్రారంభమైన నాటి నుంచి పనులు నత్తనడకన సాగి ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సంవత్సరాలు గడుస్తున్న డబుల్ ఇండ్ల పనులు నేటికీ పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి.భీమదేవరపల్లి మండల ముల్కనూర్ లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యం నెరవేరలేదు.ఇక్కడ డబుల్ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టిన కాంట్రాక్టర్ ప్రారంభ దశ నుండి బిల్లులు సమయానికి రావడంలేదనే కారణంతో..తీవ్ర జాప్యం చేసుకుంటూ వచ్చాడు. ఎలాగో అలా ఈ 40 ఇండ్లకు బేస్మెంట్ పూర్తయి పిల్లర్లు నిర్మించేందుకు స్టీల్ ను ఏర్పాటు చేశారు. తదనంతరం ఇప్పటివరకు చేసిన బిల్లులు రావడం లేదంటూ కాంట్రాక్టర్ పనులను నిలిపివేయడంతో.. అక్కడే పనులు ఆగిపోయాయి. తాజాగా పూరి చేసిన పనులన్నింటికీ సదరు కాంట్రాక్టర్ కు సుమారు కోటి రూపాయల వరకు బిల్లులు కూడా వచ్చాయి. ఒక్కో డబుల్ బెడ్ రూమ్ ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల నాలుగు వేల రూపాయలను టెండర్లకు ఆహ్వానించింది. అయితే ఇక్కడ నిర్మించబోయే 40 ఇండ్లకు సుమారు 2 కోట్లకు పైగా ఖర్చు వస్తుంది. ఇప్పటికే కోటి రూపాయలు చెల్లించిన ప్రభుత్వం మరో రెండు కోట్లు విడుదల చేసి నిర్మాణాన్ని పూర్తి చేయిస్తే.. సుమారు 40 కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించవచ్చు. కానీ ప్రస్తుత కాంట్రాక్టర్ గత ప్రభుత్వంలో ఇచ్చిన యూనిట్ ధర సరిపోడం లేదంటూ పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పేదలకు డబుల్ ఇండ్లను అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా ఇప్పటికే సర్వే బాధ్యతలను స్థానిక పంచాయతీ కార్యదర్శులకు అప్పగిస్తూ..ప్రభుత్వము ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజాపాలనలో డబుల్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి.. నెల క్రితం నుంచి సర్వేను కూడా ప్రారంభించారు.

అయితే మరో రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే సుమారు 40 కుటుంబాలకు మండలంలో డబుల్ ఇండ్లను అందించే అవకాశం ఉన్నం దున స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర రవాణా బీసీ,సంక్షేమ శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్,ప్రత్యేక చొరవ తీసుకొని కాంట్రాక్టర్ చేత మిగిలిన పనులను పూర్తి చేయించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. ఇంకా ఆలస్యం చేస్తే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం ఏర్పాటుచేసిన స్టీల్ తుప్పు పట్టి ప్రభుత్వ పెట్టిన ఖర్చు వృధా అయ్యే అవకాశం ఉందని వాపోతున్నారు.

# ధర్మపురి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

**జగిత్యాల బ్యూరో ధర్మపురి డిసెంబర్ 26(జనం సాక్షి):**



ధర్మపురి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వం చొరవ చూపాలని ధర్మపురి రెవెన్యూ డివిజన్ సాధన సమితి నాయకులు, హైకోర్టు న్యాయవాది కూర్మా చలం ఉమా మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ.... నూతన మండలాలు, రెవెన్యూ డివిజన్ ల ఏర్పాటుపై ప్రభుత్వం చొరవ తీసుకుంటుందనే వార్తలు వస్తున్నందున ప్రజల అభిష్టన్ని గుర్తించి ధర్మపురి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి మండలాన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా చేసినట్లయితే బీర్పూర్, బుగ్గారం, వెల్గాటూర్, ధర్మపురి మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. స్థానిక ఎంఎల్ఏ అడ్లూరి లక్ష్మణ్ రాష్ట్ర అసెంబ్లీలో ధర్మపురి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు పై మాట్లాడటం పట్ల ధర్మపురి రెవెన్యూ డివిజన్ సాధన సమితి పక్షాన కృతజ్ఞతలుతెలిపారు. గత పాలకులు ప్రజల అభీష్టన్ని గుర్తించలేక పోయారని గుర్తు చేశారు. త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి స్థానిక ఎంఎల్ఏ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపి గడ్డం వంశి ల సహకారంతో ముఖ్యమంత్రి సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తామని ఈ సందర్భంగా తెలిపారు.

# చలితో ఉత్తరాది గజగజ



**న్యూఢిల్లీ:** జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ , ఉత్తరాఖండ్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌ను మంచు దుప్పటి కప్పేసింది. ఎడతెరిపి లేకుండా మంచు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్లపై అడుగుల మేర మంచు పేరుకుపోయింది. అప్రమత్తమైన అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా రహదారులను తాత్కాలికంగా మూసివేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో మూడు జాతీయ రహదారులు సహా మొత్తం 226 రోడ్లను మూసివేశారు. ఇందులో సిమ్లాలో 123 రోడ్లు, లాహౌల్, స్పితిలో 36, కులులో 25 రోడ్లు ఉన్నాయి. 173 ట్రాన్స్‌ఫార్మర్‌లకు అంతరాయం ఏర్పడింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో తీవ్రమైన చలి పరిస్థితుల కారణంగా భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దట్టమైన పొగమంచు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఇక ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో మంచు దట్టంగా కురుస్తోంది. దీంతో త్యుని-చక్రతా-ముస్సోరీ జాతీయ రహదారి, ధరణాధర్-కోటి కనసర్ రహదారి పూర్తిగా మంచుతో కప్పుకుపోయింది. జమ్ము కశ్మీర్‌లోని పలు ప్రదేశాలు చలికి అల్లాడిపోతున్నాయి. శ్రీనగర్‌లో మైనస్ 7 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ విభాగం తెలిపింది. రాబోయే రెండు రోజుల్లో ఇది మరో 2 నుంచి 3 డిగ్రీల వరకూ తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది.

# అనుమానాస్పద స్థితిలో భిక్కనూరు ఎస్సై మృతి

**బంధుమిత్రుల ఆశ్రు నయనాల మధ్య కొల్చారంలో అంత్యక్రియలు**

**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 26 (జనం సాక్షి):**



కామారెడ్డి జిల్లా భిక్కనూరు ఎస్సైగా పనిచేస్తున్న మెదక్ జిల్లా కొల్చారం గ్రామ వాస్తవ్యులు సాతెల్లి సాయికుమార్ (33) మృతదేహం ఎల్లారెడ్డి పెద్ద చెరువులో గురువారం తెల్లవారుజామున లభ్యం అయింది. దీంతో మెదక్ జిల్లాలోని అతని స్వగ్రామైన కొల్చారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అతని మృతిపై కుటుంబీకులు, గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం మవుతున్నాయి. అందరితో కలుపుగోలుగా సాయికుమార్ కొల్చారం లోని సంఘమిత్ర యువజన సంఘం లో చురుకైన సభ్యుడిగా తోటి స్నేహితులతో పాటు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. చిన్నప్పటి నుంచి కష్టపడే తత్వం ఉన్న అతడు... అతని బాబాయ్ లక్ష్మీనారాయణ ను స్ఫూర్తిగా తీసుకొని పోలీస్ శాఖలో ఎస్సైగా ఎంపికై అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇదిలా ఉండగా కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి చెరువులో బుధవారం రాత్రి నుంచి పోలీసులు తీవ్ర గాలింపు చర్యలు చేపట్టగా బిబిపేట పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న శృతి, మరో ప్రైవేటు ఉద్యోగి నిఖిల్ మృతదేహాలతో పాటు భిక్కనూర్ ఎస్సై సాయికుమార్ మృతదేహం బయటపడడంతో వీరి మృతి వెనుక అనుమానాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా సాయికుమార్ అంత్యక్రియలు గురువారం సాయంత్రం కొల్చారంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అశ్రు నయనాల మధ్య జరిగాయి. అతని అంత్యక్రియలకు నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి హాజరై పుష్పాంజలి ఘటించారు. అలాగే అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్ జిల్లాలకు చెందిన పలువురు పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.



జనంసాక్షి www.janamsakshi.org | శుక్రవారం 27 డిసెంబర్ 2024

# అధికారుల దాగుడు మూతలు..!

- కబ్జాదారులకు అండగా మూడు శాఖల అధికారులు
- నోటీసులకే పరిమితమవుతున్న బాధ్యతలు

తప్పించుకు తిరగువాడు ధన్యుడు సుమతి..అనే సామెత ఆర్మూర్ అధికారులకు అచ్చు గుద్దినట్లుగా వర్తిస్తుందని చెప్పవచ్చు. అక్రమార్కులకు, భూ కబ్జాకోరులకు రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు అండగా నిలబడుతున్నారు. ఆక్రమణలపై, భూ కబ్జాలపై ఉక్కు పాదం మోపాల్సిన ఆయా శాఖ అధికారులు దాగుడు మూతలు ఆడుతున్నారు. అసైన్మెంట్, ఇరిగేషన్ కెనాల్,పది శాతం భూములకు కబ్జాలకు పాల్పడిన వారికి అధికారులు అండగా నిలుస్తున్నారని ఆర్మూర్ ప్రజలు కోడైకూస్తున్నారు.

ఆర్మూర్, డిసెంబర్ 26 (జనంసాక్షి)



ఒక ఇంటి నిర్మాణం, భారీ కమర్షియల్ నిర్మాణం అనుమతి రావాలంటే మూడు శాఖల అధికారుల అనుమతి తప్పనిసరి. ఏదైనా భారీ నిర్మాణానికి పర్మిషన్ ఎలా ఇచ్చారని పలువురు సమస్యను తీసుకువస్తే అట్టి నిర్మాణానికి రెవెన్యూ అధికారులకు రాతపూర్వకంగా ఇచ్చామని మున్సిపల్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.ఇదే విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు తమ పని కాదని చేతులు ముడుచుకుని చెప్పేస్తున్నారు.ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తే ఆ ప్రాంతంలో ఇరిగేషన్ స్థలం లేదని బుకాయిస్తున్నారు.పంచాయతీ అధికారులు సైతం ఇదే తీరు కనిపిస్తున్నారు.

### ఆర్మూర్ ప్రాంత అధికారులారా... దాగుడు మూతలు ఇంకెన్నాళ్లు..

అక్రమాలకు, ఆక్రమణలకు ఇంకెన్నాళ్లు ఆజ్యం పోస్తారని ఆర్మూర్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.లక్షల్లో జీతాలు తీసుకుంటూ బాధ్యతలు నిర్వర్తించేందుకు ఎందుకింత బాధ్యతా రహిత్యం అర్థం కాకుండా పోయింది. ముందు ఎన్నడూ లేనంతలా రెవెన్యూ శాఖ కార్యాలయం మరింత అద్వాన్న స్థితికి జారుకుంది. రెవెన్యూ అధికార బాధ్యతలు నిర్వర్తించకపోతే లిఖితపూర్వకంగా జనాలకు మా పని కాదని జవాబుదారీగా ఇవ్వాలని ఆర్మూర్ ప్రజలు అడుగుతున్నారు. మరికొందరు అధికారులైతే చిన్న పనికి అధికార, ప్రతిపక్ష నేతలని చూడకుండా పగలు రాత్రి తేడా లేకుండా వారిని చెప్పులు అరిగేలా తిరిగించుకుంటున్నారు.వివిధ శాఖల నుండి చాలా నోటీసులు రెవెన్యూ శాఖ కార్యాలయంలో పనికిరాని చిత్తు కాగితంలా అలా పడి ఉంటున్నాయి.వివిధ శాఖల నుండి నోటీసులు వచ్చినప్పటికీ వాటిపైన చర్యలు తీసుకోవాలి. ఇవేమీ పట్టనట్టు రెవెన్యూ శాఖ అధికారులు గాడ నిద్రలో ఉన్నట్టు తెలుస్తుంది.పలు శాఖల అధికారుల చాప కింద నీరులా కొందరు నాయకులకు మాత్రమే తల ఊపి పనులు చేస్తున్నారు. ఆ అధికారులు ఆమ్యామ్యాలకు అలవాటు పడ్డారా..! ఆక్రమణలపై, అక్రమార్కులపై, భూకబ్జాలపై కన్నెత్తి చూడరా..! అని ఆర్మూర్ ప్రజలు నిక్కచ్చిగా ప్రశ్నిస్తున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి రహదారి లేక అవస్థలు

- ఇబ్బందులు పడుతున్న గర్భిణీలు విద్యార్థులు
- పట్టించుకోవాలని వేడుకోలు



**ఆళ్లపల్లి, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** అంగన్వాడి కేంద్రానికి రహదారి లేక గర్భిణీలు, బాలింతలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని మర్కోడు గ్రామపంచాయతీ అంగన్వాడి కేంద్రానికి సరైన రహదారి లేదు. దీంతో మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలో ,జీసిసి ఆవరణలో నుండి వెళు_న్నారు. వర్షాకాలం సైతం అంగన్వాడి కేంద్రం వద్ద ప్రాంగణంలో బురదమయంగా ఉండడంతో భయం భయంగా అంగన్వాడి కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని పలువురు అంటున్నారు. అంగన్వాడి కేంద్రం ,రామాలయం మధ్యలో నామమాత్రంగా ఓ రహదారి ఏర్పాటు చేశారు. కానీ సరైన మరమ్మతులు లేక రహదారి వెంట చెత్తాచెదారం ఉండడంతో అ మార్గం ఉపయోగంలో లేదు. అ మార్గంకి సిసి రోడ్డు లేదా తాత్కాలికంగా మరమ్మత్తులు చేపడితే అంగన్వాడి కేంద్రానికి రహదారి ఉంటుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించి తత్కాలిక రహదారి ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి భారీ ఏర్పాట్లు



- నేడు నల్లగొండ పట్టణంలో కాంగ్రెస్ జోడో ర్యాలీ
- సాయంత్రం 5 గంటలకు క్లాక్ టవర్ సెంటర్ లో సభ
- హాజరు కానున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్లగొండ రూరల్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 28న ఘనంగా నిర్వహించడం జరుగుతుందని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ తెలిపారు.గురువారం నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ 139వ వ్యవస్థాపనోత్సవానికి సంబంధించి పోస్టర్‌ను నల్లగొండ, తిప్పర్తి, కనగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంగూరి లక్ష్మయ్య, జూకూరి రమేష్, గడ్డం అనుఫ్ రెడ్డిలతో కలిసి,ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 28న మధ్యాహ్నం 3 గంటలకు ఎన్జీ కళాశాల నుంచి శివాజీ నగర్,రామగిరి,బస్టాండ్ మీదుగా క్లాక్ టవర్ వరకు కాంగ్రెస్ జోడో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు క్లాక్ టవర్ సెంటర్ లో సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిందని స్పష్టం చేశారు.బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మతతత్వంతో ప్రజలను రెచ్చగొడుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవంలో పార్టీ దేశానికి చేసిన సేవలను వివరించడం జరుగుతుందని అన్నారు.కాంగ్రెస్ జోడో ర్యాలీ,బహిరంగ సభకు నల్గొండ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఈ విలేకరుల సమావేశంలో డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కిన్నెర అంజి,జూలకంటి సైదిరెడ్డి,యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్,నల్గొండ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జహంగీర్ బాబా,యువజన కాంగ్రెస్ నలగొండ మండల అధ్యక్షుడు కె.వి.ఆర్ సతీష్, కనగల్ మండల అధ్యక్షుడు కట్టబోయిన పవన్ కళ్యాణ్, కంచర్ల ఆనంద్ రెడ్డి, ఎండి అజ్జు, బొడ్డుపల్లి రాజేష్, బైరు ప్రసాద్,ఆవుల నందిని తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో అనుమానాస్పద స్థితిలో కూలి మృతి

**అల్వాల్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ కు చెందిన ఏద్దు నర్సింలు (50), కూలి మేస్త్రిగా పనిచేసే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. గురువారం మధ్యాహ్నం ఇందిరా గాంధీ విగ్రహం వద్ద గల కూలీల అడ్డాలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నర్సింలు మృతిచెందినట్లు ధృవీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నర్సింలు భార్య స్ట్రీట్ ఫుడ్ వ్యాపారం చేస్తూ కుటుంబన్ని పోషణకు భర్త కు అండగా నిలిచింది. ప్రతీ రోజు ఉదయం 5 గంటలకే లేచి కూలి పనికి వెళ్లే నర్సింలు, గురువారం కూడా అదే విధంగా పనికి బయలుదేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం ఈ ఘటన గురించి తెలిసిన కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడు మద్యం సేవించాడని, మృతికి ముందు అతనికి మూర్ఛ వచ్చి ఉంటుందని పోలీస్‌లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతని మరణానికి గల కారణాలను తెలుసుకోవడానికి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



## దమ్మపేటలో మంత్రి పొంగులేటి పర్యటన..

- ఇందిరమ్మ ఇంటి నమూనా కార్యక్రమం ప్రారంభోత్సవం
- జనం లేక అధికారులతోనే సభా కార్యక్రమం
- కార్యక్రమానికి దూరంగా తుమ్మల వర్గం



**దమ్మపేట, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** దమ్మపేట మండలంలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి,రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు,స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి దమ్మపేట మండలం నాచారం, గున్నేపల్లి గ్రామపంచాయతీలకు 40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాలను ప్రారంభించారు. అనంతరం దమ్మపేట ఎంపీడీవో కార్యాలయంలో త్వరలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించబోయే ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన మోడల్ హౌస్ నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4 లక్షల 50 వేల ఇండ్లు ఈ సంక్రాంతి నుంచి ప్రారంభించి పేద ప్రజలకు కానుకగా ఇస్తామన్నారు.అందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయించామని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అభ్యర్థన మేరకు ఈ గిరిజన నియోజకవర్గానికి అదనంగా మరికొన్ని ఇందిరమ్మ ఇండ్లు కేటాయించటానికి ఆలోచన చేస్తున్నామన్నారు. అదనంగా ఇండ్లు కేటాయించే విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుని తప్పకుండా ఎమ్మెల్యే అభ్యర్థనకు అనుగుణంగా ఇండ్లు కేటాయించి ఏజెన్సీ ప్రాంతానికి లబ్ది చేకూరుస్తామన్నారు.అలాగే ఈ ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పేద ప్రజలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ పథకాలు అందించే విషయంలో పార్టీలు వర్గాలు రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క పేదవాడికి న్యాయం చేస్తామన్నారు.

### దమ్మపేట ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన మంత్రి పొంగులేటి

పర్యటనలో భాగంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దమ్మపేట ఎమ్మార్వో కార్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి ఆ రికార్డుల్లో పొందుపరిచిన అంశాలకు సంబంధించిన సమాచారం ఇంచార్జ్ ఎమ్మార్వో ని అడిగి తెలుసుకున్నారు.ఆ రికార్డుల ఆధారంగా బాధితులకు ఫోన్ చేసి కార్యాలయంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అధికారులు ఎవరైనా లంచాలు అడిగారా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారా అని బాధితులను అడిగి తెలుసుకున్నారు.అధికారులు ఎవరైనా ఇబ్బందులకు గురిచేసిన లంచం అడిగిన వెంటనే తమకు తెలియపరచాలని తెలిపారు.

### కార్యక్రమానికి దూరంగా తుమ్మల వర్గం..

దమ్మపేట మండలంలో పొంగులేటి పర్యటన కార్యక్రమం నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఒంటెద్దు పోకడగా వెళుతున్నారని తుమ్మల వర్గం ఈరోజు జరిగిన పొంగులేటి పర్యటన కార్యక్రమానికి దూరంగా ఉంటామని సోషల్ మీడియా వేదికగా చర్చలు జరిపారు. అన్నట్లుగానే తుమ్మల వర్గం పొంగిలేటి పర్యటనకు దూరంగా ఉండటం దమ్మపేటలో చర్చనీయాశమైంది.మరి కొద్ది రోజులలో సర్పంచ్ ఎన్నికలు మొదలవుతున్న తరుణంలో కాంగ్రెస్లో వర్గ విభేదాలు స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా మంత్రి తుమ్మల,పొంగులేటి చొరవ తీసుకుని వర్గ విభేదాలకు తావు లేకుండా అందరిని ఏకతాటిపైకి తీసుకురాకపోతే రాబోవు సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ తీవ్ర ఇబ్బందులకు గురికాక తప్పదని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## న్యూఢిల్లీ ఐఏఆర్ఐ డైరెక్టర్‌గా డాక్టర్ సిహెచ్. శ్రీనివాసరావు నియామకం



**రాజేంద్రనగర్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్‌లోని నార్మ్ డైరెక్టర్ గా విధులు నిర్వహించే డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు న్యూఢిల్లీలోని ఐఏఆర్ఐ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. కృష్ణా జిల్లాకు చెందిన ఆయన గత ఎనిమిదేళ్లుగా రాజేంద్రనగర్ లోని నార్మ్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఐసిఏఆర్ లో అంతర్భాగమైన ఐఏఆర్ఐ (ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్) డైరెక్టర్‌గా నియమితులైన తొలి తెలుగు వ్యక్తి. ఆయన స్థానంలో నార్మ్ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించే రామ సుబ్రహ్మణ్యం ఇన్చార్జి డైరెక్టర్‌గా కొనసాగనున్నారు.

# వంద పడకల ఆసుపత్రిలో మెరుగైన వైద్యం

- ఈ ఏడాదిలో ఓపి 84175, ఐపి 7,150 మందికి వైద్యం
- ఒకే రోజు 12 మందికి సాధారణ కాన్పులు చేసిన ఘనత
- ప్రభుత్వ ఆసుపత్రిలో 304 మందికి కంటి ఆపరేషన్లు



**మణుగూరు, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ ప్రభుత్వ ఆసుపత్రి లో ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని అందిస్తోంది. గతంలో మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రిలో తగిన వైద్య సదుపాయాలు వైద్యులు లేక ప్రజల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలంటే పేద ప్రజలకు వైద్య ఖర్చులు పెరిగి భూములు, ఇళ్ళు ,వాకిలి అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడేది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజారోగ్యం మీద దృష్టి సారించి దీర్ఘకాలిక అత్యవసర సేవలను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మెరుగైనా వైద్యాన్ని అందిస్తుంది. గతంలో ఐదు లక్షలున్న ఆరోగ్యశ్రీ పథకం ఈనాడు 10 లక్షలకు పెంచి పేద ప్రజలను ఆదుకుంటుంది. మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 2023 సంవత్సరంలో సూపరిండెంట్ డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో పేదలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు. ఈ ఏడాదిలో ఓపి (అవుట్ పేషెంట్) 84175 కాగా ఐపి (ఇన్ పేషెంట్) 7,150 మంది వైద్య సేవలు పొందుతున్నారు. ఇందులో మలేరియా 8553 కేసులు రాగా అందులో 73 కేసులు పాజిటివ్ నమోదయ్యాయి. టైఫాయిడ్ 10742 కేసులు రాగా అందులో 9429 కేసులు నమోదు అయ్యాయి. డెంగ్యూ కేసులు 4,905 పాజిటివ్ కేసులకు మెరుగైనా వైద్యాన్ని అందిస్తోంది.

### విభాగాల వారీగా..

పినపాక నియోజకవర్గం లో కంటి సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలు, వృద్ధులకి కంటి వైద్యులు డాక్టర్ సంజీవరావు ఆధ్వర్యంలో సుమారు 2000 మందికి పరీక్షలు చేయగా అందులో 304 మందికి కంటి ఆపరేషన్లు చేయించారు. ప్రతి సోమవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. గైనకాలజిస్ట్ 2023 ఆగస్టు నుంచి అందుబాటులో లేకపోవడం వల్ల సాధారణ కాన్పులు 222 శస్త్ర చికిత్స ద్వారా 199 కాన్పులు చేశారు. ఆగస్టు నుంచి ఇప్పటివరకు గైనకాలజిస్ట్ ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడం గర్భిణీ స్త్రీలకు ఇబ్బందికరంగా మారింది.

ఈ ఏడాదిలో దంత సంబంధించిన రోగులు ఓ పీ 4009 రాగా 2511 మంది రోగులలో పళ్ళు పీకటం, క్లీనింగ్, సిమెంట్ దంతాలు అమర్చటం చేశారు మిగతా రోగులు రూట్ కెనాల్ కేసులు, కొత్త దంతాలు అమర్చే కేసులను మన దగ్గర అందుబాటులో లేని కారణంగా కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు.

### వైద్యులు, వైద్య పరికరాలు..

మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సిటి స్కాన్, ఎక్స్ రే , క్రాన్ మిషన్ ,ఆపరేషన్ థియేటర్లో కావలసిన వైద్య పరికరాలు, అంబులెన్స్ అవసరం ఉంది.అలాగే గైనకాలజిస్ట్, చిన్నపిల్లల వైద్యులు, ఆర్థోపెడిక్, ఈ ఎన్ టీ, ఎక్స్ రే టెక్నీషియన్స్, బ్లడ్ బ్యాంకు స్టాఫ్ అవసరం ఉందని సూపరింటెండెంట్ సునిల్ తెలిపారు. వైద్యులు అందుబాటులో లేని కారణంగా ఇక్కడి నుంచి భద్రాచలం కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి పంపించాల్సి వస్తోంది. ముఖ్యంగా గైనకాలజిస్ట్ చిన్నపిల్లల వైద్యులు అవసరం ఎక్కువగా ఉందని తెలిపారు.

## దురాజ్‌పల్లి పెద్దగట్టుపై శాశ్వత నిర్మాణాలు చేపడతాం



- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** రాష్ట్రంలో రెండవ అతిపెద్ద జాతరగా గుర్తింపు పొందిన దురాజ్ పల్లి పెద్దగుట్ట లింగమంతుల స్వామి వారి గుడి వద్ద శాశ్వత నిర్మాణాలు చేపడుతామని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు.గురువారం దురాజ్ పల్లి పెద్దగుట్ట ఆలయాన్ని సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వచ్చే ఏడాది ఫిబ్రవరి 16 నుండి 20వ తేదీ వరకు జరిగే లింగమంతుల స్వామి జాతరకు గుట్టపై పరిసరాలలో ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దగట్టు అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడి జాతరకు 10 కోట్ల రూపాయల నిధులను కోరినట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్, ఎస్పి ఇప్పటికే జాతర జరిగే ఆలయాన్ని సందర్శించినట్లు తెలిపారు.త్వరలోనే గుట్ట చైర్మన్ నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. గుట్టపైకి వాహనాలు వెళ్లడానికి రోడ్డు నిర్మాణం చేస్తామని అన్నారు.గుట్ట పైన భక్తులు రాత్రి పూట నిద్ర చేయడానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేస్తామని, దేవాలయం పైన పూజారులు నివాసం ఉండేలా రెసిడెన్షియల్ క్వార్టర్ల నిర్మాణం చేస్తామని, భక్తులకు మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్మాణాలు చేపడతామని తెలిపారు.

# డిసెంబర్ 27 నుంచే అమలు..

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి అలర్ట్. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌కి చెందిన ఆ స్కీమ్‌లో కొత్తగా చేరేందుకు అవకాశం లేదు. ఇంటర్నేషనల్ ఫండ్ కొత్త సబ్‌స్క్రిప్షన్లు నిలిపివేసినట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. అందుకు గల కారణాలను వెల్లడించింది. ఇటీవలి కాలంలో ఈక్విటీల్లో పెట్టుబడులు పెడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతి నెలా కోట్లాది రూపాయలు మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఈక్విటీల్లోనూ కొన్ని స్కీమ్స్‌కు మంచి ఆదరణ ఉంటుంది. వాటిల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. అలాంటి వాటిల్లో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించిన పలు స్కీమ్స్ ఉన్నాయని చెప్పవచ్చు. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ నుంచి ఇంటర్నేషనల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి అలర్ట్. తమ ఏఎంసీ నుంచి వచ్చిన ఇంటర్నేషనల్ ఫండ్స్‌లోని ఓ ఫండ్ కొత్త సబ్‌స్క్రిప్షన్లు నిలిపివేస్తున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది.

అంటే ఇకపై ఆ ఫండ్‌లో కొత్తగా ఇన్వెస్ట్ చేసేందుకు ఉండదు. ఇప్పటికే సబ్‌స్క్రైబ్ చేసుకున్న వారికి మాత్రమే ఫండ్ నిర్వహణ ఉంటుంది. అదే ఎస్‌బీఐ ఇంటర్నేషనల్ యాక్సెస్ యూఎస్ ఈక్విటీ ఫండ్




ఆఫ్ ఫండ్ ఈ ఫండ్‌లో కొత్త సబ్‌స్క్రిప్షన్లు ఆగిపోయాయి. అందుకు ప్రధాన కారణం ఉంది. ఇప్పటికే ఈ పథకంలో పరిమితి మేర పెట్టుబడులు వచ్చేశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విధించిన ఓవర్సీస్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిట్ దాటకూడదనే ఉద్దేశంతోనే కొత్త సబ్‌స్క్రిప్షన్లు ఆపేసినట్లు ఎస్‌బీఐ తెలిపింది.

ఈ మేరకు తమ యూనిట్ హోల్డర్లకు నోటీసు ద్వారా ఈ విషయాన్ని తెలియజేసినట్లు ఎస్‌బీఐ ఫండ్ హౌస్ తెలిపింది. డిసెంబర్ 27, 2024 నుంచే కొత్త నిబంధనలు అమలులోకి వస్తాయని తెలిపింది. లంప్‌సమ్ పెట్టుబడుల ద్వారా సబ్‌స్క్రిప్షన్లు (అదనపు కొనుగోళ్లు, స్విచ్ ఇన్స్ సహా), ఐడీసీడబ్ల్యూ బదిలీ కోసం సిప్, ఎస్‌టీపీ ద్వారా కొత్త సబ్‌స్క్రిప్షన్లు నిలిపివేయబడతాయని నోటీసులో పేర్కొంది. డిసెంబర్ 26వ తేదీ కట్ ఆఫ్ టైమ్ తర్వాతనే ఈ ఆంక్షలు అమలులోకి వచ్చేస్తాయని గుర్తు చేసింది. బదిలీ వంటి ప్రస్తుత సిస్టమాటిక్ రిజిస్ట్రేషన్లు తదుపరి నోటీసు వచ్చే వరకు పథకం కింద కొనసాగుతాయని పేర్కొంది. అలాగే స్కీమ్ పరిధిలో జరిగే బదిలీలు కొత్త రూల్స్ వర్తించవని తెలిపింది. అలాగే ఇతర షరతులు, నిబంధనలు ఏమీ మారవని స్పష్టం చేసింది.

# ఐఫోన్‌తో క్యాబ్ బుక్ చేస్తే ఎక్కువ ఛార్జీ పడుతుందా?


పెద్ద పెద్ద నగరాలతో పాటు ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ క్యాబ్ సర్వీసులు అందుబాటులోకి వస్తున్నాయి. యాప్ ద్వారా బుక్ చేయగానే నిమిషాల వ్యవధిలో ఉన్న చోటికి వచ్చి పికప్ చేసుకుంటాయి. అయితే, ఇటీవల సోషల్ మీడియా వేదికగా యాప్స్ ఛార్జీలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఆండ్రాయిడ్ డివైజ్‌ల కంటే ఐఫోన్‌లోని యాప్స్ ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తున్నాయని ఫోటోలతో సహా కొందరు పోస్టులు పెడుతున్నారు.

సిటీల్లో ఉండే వారికి క్యాబ్ సర్వీసుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. చాలా కంపెనీలు క్యాబ్ సేవలు అందిస్తున్నాయి. యాప్ ద్వారా బుక్ చేసుకున్న నిమిషాల వ్యవధిలో ఉన్న చోటుకే వచ్చి పికప్ చేసుకుంటాయి. తాము ఎంచుకున్న గమ్య స్థానాలకు చేరుస్తాయి. బుక్ చేసుకునే సమయంలోనే ఎంత ఛార్జీ అవుతుందని చెబుతాయి. బైక్, ఆటో, కార్, మినీ బస్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. దేని ఛార్జీలు దానికే ఉంటాయి. అయితే, కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో ఈ క్యాబ్ ఛార్జీల విషయంపై వినియోగదారులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఒక రైడ్ కోసం ఒకేసారి ఆండ్రాయిడ్ ఫోన్, ఐఫోన్‌లో బుక్ చేస్తే వేరు వేరుగా ఛార్జీలు చూపిస్తున్నట్లు ప్రూఫ్స్‌తో సహా పోస్టులు పెడుతున్నారు. యాపిల్ డివైజ్ యూజర్లకు ఎక్కువ ఛార్జీలు వసూలు చేసేలా తమ ప్రైసింగ్ అల్గారిథమ్ తయారు చేశారంటూ ఆరోపిస్తున్నారు.

ఈ విషయంపై టైమ్స్ ఆఫ్ ఇండియా సైతం ఓసారి ప్రయత్నించి చూసింది. చెన్నైలోని మూడు లొకేషన్ల నుంచి ఒకే దూరంలోని గమ్య స్థానాలకు ఐఫోన్, ఆండ్రాయిడ్ డివైజ్‌ల ద్వారా రైడ్స్ కోసం సర్చ్ చేసింది. ప్రతి కేసులో ఆండ్రాయిడ్ కంటే ఐఓఎస్ డివైజుల్లోనే ఎక్కువ ఛార్జీలు చూపించినట్లు తేలిందని టైమ్స్ ఆఫ్ ఇండియా ఓ కథనం ప్రచురించింది. టీఓఐ ప్రకారం.. చెన్నైలోని మడిపక్కమ్ నుంచి ఫోనిక్స్ మాల్ వెలాచరికి ఆండ్రాయిడ్‌లో రూ.195 చూపించగా ఐఫోన్‌లో రూ.260 చూపించినట్లు తెలిపింది. ఇక అవాడీ నుంచి చెన్నై ఎయిర్‌పోర్ట్‌కి ఆండ్రాయిడ్‌లో రూ.961, ఐఫోన్‌లో రూ.1010 చూపించినట్లు పేర్కొంది. ఇక టీ నగర్ నుంచి ఎగ్మోర్ వరకు ఆండ్రాయిడ్‌లో రూ.180, ఐఫోన్‌లో రూ.344 చూపించిందని తెలిపింది.

అయితే, ఇలా కావాలని ఎక్కువ ఛార్జీలు చూపిస్తున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవు. మరో రోజున అవే గమ్య స్థానాలకు రైడ్స్ సర్చ్ చేస్తే వేరు వేరు ఛార్జీలు చూపించింది. పైన చెప్పినట్లు సింగిల్ రైడ్స్, తక్కువ దూరం ఉన్న రైడ్స్‌కి అలా జరుగుతున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయంపై స్పందించిన ఉబర్ రైడర్ల ఫోన్ల ఆధారంగా ఛార్జీలు వసూలు చేయాలనే పాలసీ ఏమీ లేదని స్పష్టం చేసింది. అయితే ఛార్జీలు అనేవి రైడ్ బుక్ చేసే సమయం, దూరం, రియల్ టైమ్ డిమాండ్ వంటి అంశాలపై ఆధాపడి ఉంటాయని పేర్కొంది. అయితే, ఈ విషయంపై ఓలా నుంచి ఎలాంటి స్పందన రాలేదని టైమ్స్ ఆఫ్ ఇండియా తెలిపింది.

అయితే, యాప్ ఇన్‌స్టాల్ చేసేటప్పుడు వినియోగదారులు సమ్మతి ఇవ్వాల్సిన హార్డ్‌వేర్ డేటాను రైడ్ హెయిలింగ్ యాప్స్ ఎలా యాక్సెస్ చేస్తాయనే దాని నుంచి ఈ అసమానతలు ఉత్పన్నమవుతాయని నిపుణులు చెబుతున్నారు. సెంట్రల్ సర్వర్ వినియోగదారుల పరికరానికి అనుగుణంగా ఛార్జీల అంచనాలను సులభంగా రూపొందించగలదని రైడ్ హెయిలింగ్ ప్లాట్‌ఫామ్ ఫాస్ట్రాక్ ఎండీ సి అంబిగపతి తెలిపారు. డైనమిక్ ప్రైసింగ్ అల్గారిథమ్ అనేది హార్డ్‌వేర్ వివరాల ఆధారంగా కంపెనీలు ఛార్జీలను సర్దుబాటు చేయడం




జరుగుతుందన్నారు. మరోవైపు.. రైడ్ ధరలు ఫోన్ మోడళ్ల మధ్య వ్యత్యాసానికే పరిమితం కాదని, ఇది తరుచూ యాప్స్ ఉపయోగించే వారికి, ఒకే పరికరంలో ఛార్జీలను పదే పదే తనిఖీ చేసే వారికి సైతం వర్తిస్తుందని కేంద్ర ప్రభుత్వ అగ్రిగేటర్ పాలసీ రూపొందించడంలో పాల్గొన్న ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ నిపుణుడు ఒకరు తెలిపారు.



## స్టాండర్డ్ డిడక్షన్ పెంపు సహా ఏడాదిలో ఎన్నో మార్పులు..

# పన్ను శ్లాబుల్లో మార్పులు..

టాక్స్‌పేయర్లు.. ఎప్పటికప్పుడు ఆదాయపు పన్నుకు సంబంధించిన మార్పుల గురించి తెలుసుకుంటూ ఉండాలి. ముఖ్యంగా టాక్స్ రేట్లు, డిడక్షన్స్, ఎగ్జెంప్షన్స్, టీడీఎస్ వంటి వాటిపై అవగాహన ఉంచుకోవాలి. ఐటీఆర్ ఫైలింగ్‌లో ఇవన్నీ కీలకంగా ఉంటాయని చెప్పొచ్చు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వచ్చే సంవత్సరం రిటర్న్స్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాదిలో వచ్చిన మార్పుల్ని కచ్చితంగా తెలుసుకోవాలి. 2024 సంవత్సరం కొద్ది రోజుల్లో ముగుస్తోంది. అయితే ఈ ఏడాదిలో ఎన్నో మార్పులొచ్చాయి. ముఖ్యంగా ఆర్థిక పర నిర్ణయాల్లో ఎక్కువగా మార్పులు గమనించొచ్చు. కొద్ది రోజుల కిందట యూపీఐ మార్పుల గురించి తెలుసుకున్నాం. దీని గురించి ఇక్కడ తెలుసుకోండి. ఇప్పుడు మనం 2024 సంవత్సరంలో వచ్చిన ఆదాయపు పన్ను మార్పుల గురించి చూద్దాం. 2024 బడ్జెట్ సమయంలో వేతన జీవులకు స్వల్ప ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పాత పన్ను విధానాన్ని అస్సలు టచ్ చేయకుండా.. కొత్త పన్ను వేతనంలో పలు కీలక మార్పులు చేసింది. పన్ను శ్లాబుల్లో మధ్యతరగతికి కాస్త ఊరట కలిగేలా మార్పులు చేసింది. ఇంకా స్టాండర్డ్ డిడక్షన్ కూడా కొత్త పన్ను విధానంలోనే పెంచడం విశేషం. వీటిల్లో చాలా వరకు పన్ను చెల్లింపుదారులు మర్చిపోయే అవకాశం ఉంది. అందుకే 2024లో ఏమేం మారాయో ఒకసారి చూద్దాం. వచ్చే ఏడాది ఐటీ రిటర్న్స్ ఫైలింగ్ సమయంలో ఇది ఉపయోగపడనుంది.

బడ్జెట్‌లో ప్రతిపాదించిన మార్పుల ప్రకారం.. కొత్త పన్ను విధానంలో పన్ను శ్లాబులు మారాయి. రూ. 3 లక్షల వరకు ఎలాంటి పన్ను లేదు. ఇక గతంలో రూ. 3-6 లక్షలపై 5 శాతం పన్ను ఉండగా.. ఇప్పుడు ఈ ఇన్‌కం బ్రాకెట్‌ను రూ. 3-7 లక్షలకు చేర్చిన సంగతి తెలిసిందే. అంటే ఇక్కడ రూ. 7 లక్షల వరకు ఆదాయంపైనా 5 శాతం పన్నే ఉంటుంది. రూ. 6-9 లక్షల శ్లాబుకు 10 శాతంగా ఉండగా.. దీనిని రూ. 7-10 లక్షలకు సవరించింది. ఇప్పుడు రూ. 10 లక్షల వార్షికాదాయం ఉన్న వారు కూడా 10 శాతం పన్ను పరిధిలోకే రానున్నారు. పాత విధానంలో ఈ మార్పులేం లేవు. రూ. 10-12 లక్షల ఆదాయవర్గానికి 15 శాతం పన్ను ఉంటుంది. 12-15 లక్షల మధ్య ఆదాయం ఉంటే 20 శాతం టాక్స్ చెల్లించాలి. ఆపైన ఉంటే 30 శాతం టాక్స్ పరిధిలోకి వెళ్తారు. స్టాండర్డ్ డిడక్షన్‌ను కొత్త పన్ను విధానంలో రూ. 50 వేల నుంచి ఇప్పుడు రూ. 75 వేలకు పెంచింది. పాత పన్ను విధానంలో అస్సలు మార్చలేదు. ఇక్కడ ఇది రూ. 50 వేలుగానే ఉంది. ఫ్యామిలీ పెన్షనర్లకు రూ. 15 వేల నుంచి రూ. 25 వేలకు పెంచింది ప్రభుత్వం. వ్యవసాయేతర స్థిరాస్తి క్రయవిక్రయ ట్రాన్సాక్షన్స్‌లో వాస్తవ ధర, స్టాంప్

**బడ్జెట్‌లో ప్రతిపాదించిన మార్పుల ప్రకారం.. కొత్త పన్ను విధానంలో పన్ను శ్లాబులు మారాయి. రూ. 3 లక్షల వరకు ఎలాంటి పన్ను లేదు. ఇక గతంలో రూ. 3-6 లక్షలపై 5 శాతం పన్ను ఉండగా.. ఇప్పుడు ఈ ఇన్‌కం బ్రాకెట్‌ను రూ. 3-7 లక్షలకు చేర్చిన సంగతి తెలిసిందే. అంటే ఇక్కడ రూ. 7 లక్షల వరకు ఆదాయంపైనా 5 శాతం పన్నే ఉంటుంది. రూ. 6-9 లక్షల శ్లాబుకు 10 శాతంగా ఉండగా.. దీనిని రూ. 7-10 లక్షలకు సవరించింది.**

డ్యూటీల్లో ఏది ఎక్కువ ఉంటే దానిని పరిగణనలోకి తీసుకొని ఒక శాతం మూలం వద్ద పన్ను కోత విధించాలని స్పష్టం చేసింది. రూ. 50 లక్షలకు మించి విలువ ఉన్నప్పుడు ఇది వర్తిస్తుంది. ఆదాయపు పన్ను వివాదాలకు సంబంధించినటువంటి పరిష్కారాల కోసం వివాద్ సే విశ్వాస్ స్కీంను 2020లో కేంద్రం తీసుకొచ్చింది. దీనిని కొనసాగింపుగా బడ్జెట్‌లో వివాద్ సే విశ్వాస్ 2.0 ను ప్రభుత్వం ప్రతిపాదించింది. మరోవైపు పాన్ కార్డు దరఖాస్తు, టాక్స్ రిటర్న్స్ ఫైల్ చేసే సమయంలో ఆధార్ నంబర్, ఎన్‌రోల్‌మెంట్ ఐడీ రెండింట్లో ఏదో ఒకటి సరిపోయేది. ఇక మీదట కేవలం ఆధార్ సంఖ్యను మాత్రమే వినియోగించాలి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన బాండ్లపై వచ్చిన వడ్డీకి మూలం వద్ద పన్ను కోత 10 శాతం వర్తిస్తుంది. కంపెనీ షేర్ల బైబ్యాక్ చేసినప్పుడు ఇప్పటి వరకు సంస్థలకు పన్ను బాధ్యత ఉండేది. ఇప్పుడు మాత్రం ఇది వాటాదారులకు బదిలీ అయిందని గుర్తుంచుకోవాలి. అంటే డివిడెండ్ల తరహాలోనే షేర్ల బైబ్యాక్ సమయంలో కూడా పన్ను వర్తిస్తుంది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో కాంట్రాక్టును విక్రయిస్తే .. ఆప్షన్ ప్రీమియంపై సెక్యూరి టీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ 0.0625 శాతం నుంచి 0.1 శాతానికి పెరగనుంది. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై ఇది 0.02 శాతంగా ఉంది.

# విమానం బాడీపై బుల్లెట్ల ఆనవాళ్లు.. కజిక్ ప్రమాదం వెనుక కుట్ర

ప్రయాణికులతో వెళ్తున్న విమానం గాల్లో ఉండగా నియంత్రణ కోల్పోవడంతో నేరుగా భూమిపైకి దూసుకువచ్చింది. ఈ క్రమంలోనే భూమిని తాకగానే పేలిపోవడంతో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ విమానంలో సిబ్బంది, ప్రయాణికులు సహా మొత్తం 67 మంది ఉన్నారు. ఈ ఘోర ప్రమాదంలో 42 మంది ప్రాణాలు కోల్పోగా.. 25 మంది ప్రాణాలతో బయటపడ్డారు. వారిలో కొందరికి స్వల్ప గాయాలు అయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. 11 ఏళ్ల బాలిక, 16 ఏళ్ల బాలుడు సహా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే, ఈ ఘటన వెనుక కుట్రకోణం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కజకిస్థాన్‌లో అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ప్రయాణికుల విమానం కుప్పకూలిన ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 40 మందికి పైగా మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ప్రమాద సమయంలో విమానంలో 67 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బందితో కలిపి మొత్తం 72 మంది ఉన్నారు. వీరిలో 28 మంది



ప్రాణాలతో బయటపడినట్లు న్యూస్ ఏజెన్సీ రాయిటర్స్ వెల్లడించింది.

అజర్ బైజన్‌లోని బాకు నగరం నుంచి రష్యాలోని గ్రోజ్నికి వెళ్తోన్న విమానం బుధవారం కజికిస్థాన్‌లోని ఆక్టావ్‌లో కూలిపోయింది. పక్షి ఢీకొనడంతో పైలట్ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తుండగా ప్రమాదం జరిగిందని రష్యా ఏవియేషన్ చెబుతుండగా.. ప్రమాద దృశ్యాలను చూసిన నెటిజన్లు మాత్రం పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఆ సమయంలో రష్యా – ఉక్రెయిన్ మధ్య దాడులు జరగడమే అందుకు కారణం. దానిని కీవ్‌కు చెందిన డ్రోన్‌గా భావించడం వల్లే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ కూల్చివేసినట్లు అనుమానిస్తున్నారు. ఉక్రెయిన్ డ్రోన్ దాడులను రష్యా తిప్పికొడుతున్న సమయంలోనే పైలట్ అప్రమత్తమై ఓ కాల్ పంపించారని కొన్ని మీడియా సంస్థల కథనాలు పేర్కొన్నాయి. అలాగే కొన్ని చిత్రాల్లో విమానం బాడీపై బుల్లెట్ ఆనవాళ్లు కనిపించినట్లు వెల్లడించాయి. అయితే, ఈ కథనాలపై కజఖ్‌స్థాన్ డిప్యూటీ ప్రధానిని మీడియా ప్రశ్నించగా కచ్చితమైన సమాధానం రాలేదు.

పక్షి ఢీకొట్టిన తర్వాత అత్యవసర పరిస్థితి తలెత్తడంతో.. విమానాన్ని ఆక్టావ్‌కు దారి మళ్లించి అత్యవసరంగా ల్యాండింగ్ చేయాలని పైలట్లు భావించారని రష్యా పౌర విమానయాన ప్రాధికార సంస్థ 'రొసావియాత్సియా' తెలిపింది. అత్యవసర ల్యాండింగ్ క్రమంలో విమానం నియంత్రణ కోల్పోయిందని,. ఆక్టావ్‌కు 3 కిలోమీటర్ల దూరంలో ఏటవాలుగా కిందకు దిగి నేలను బలంగా ఢీకొట్టిందని వెల్లడించింది. దీంతో విమానం ముక్కలై.. మంటలు చెలరేగాయని పేర్కొంది. ఈ ప్రమాదం తాలూకు వీడియోలు సోషల్‌మీడియా వైరల్‌గా మారాయి.

మరోవైపు, ప్రపంచమంతా క్రిస్మస్ పండగని జరుపుకుంటుంటే రష్యా, ఉక్రెయిన్ మాత్రం ఢీ అంటే ఢీ అంటూ దాడులకు పాల్పడ్డాయి. ఉక్రెయిన్‌లోని ప్రధాన విద్యుత్తు కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని 70కిపైగా క్షిపణులు, 100కుపైగా డ్రోన్లతో రష్యా విరుచుకుపడింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్వయంగా ఈ వివరాలను వెల్లడించారు. రష్యా ప్రయోగించిన వాటిలో బాలిస్టిక్ మిసైల్స్ కూడా ఉన్నాయని తెలిపారు. తాము కనీసం 50 క్షిపణులు, పలు డ్రోన్లను కూల్చివేసినట్లు వెల్లడించారు. అటు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉద్దేశపూర్వకంగానే క్రిస్మస్ రోజున తమపై దాడులు జరిపించారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలిడిమీర్ జెలెన్‌స్కీ ఆరోపించారు.

# భారత్ నెత్తిన చైనా మరో బాంబ్..

## టిబెట్ వద్ద ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రోపవర్ డ్యామ్

ప్రపంచలోనే అత్యంత పెద్ద హైడ్రో ప్రాజెక్ట్ చైనాలో ఉంది. యాంగ్జి కియాంగ్ నదిపై నిర్మించిన త్రీ గోర్జెస్ డ్యామ్ వల్ల భూమికి భారీ ముప్పు ఉందని, ఇది భూమిని ప్రభావితం చేస్తోందని ఇటీవల ఓ అధ్యయనం వెల్లడించింది. దీని వల్ల భూభ్రమణ వేగం తగ్గిపోయిందని తెలిపింది. ఇక, ఈ ప్రాజెక్ట్ కారణంగా జీవారణం కూడా దెబ్బతింది. ఈ క్రమంలో చైనా దీనికి మూడు రెట్ల సామర్థ్యంతో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతోంది.

సరిహద్దుల్లో పాకిస్థాన్ కంటే చైనా రూపంలోనే పెను ప్రమాదం పొంచి ఉంది. ఓవైపు వివాదాలను పరిష్కరించుకుందామని చెబుతూనే.. ఇంకోవైపు కొత్త సమస్యలను సృష్టిస్తోంది. తాజాగా, జలవిద్యుత్ కోసం ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్ నిర్మాణానికి డ్రాగన్ ఆమోదం తెలిపింది. సరిహద్దుల్లోని టిబెట్‌లో యార్లంగ్ జంగ్పో నది (బహ్మాపుత్ర) సామర్థ్యాన్ని అలాగే ప్రత్యేకమైన ఇంజనీరింగ్ సవాళ్లను అందిస్తుంది. ఇంజినీరింగ్ ఖర్చులతో సహా నిర్మాణ వ్యయం త్రీ గోర్జెస్ డ్యామ్ (254.2 బిలియన్ యువాన్లు (%వి%34.83 బిలియన్లు)కు కంటే నాలుగు రెట్లు అధికంగా ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.

అయితే, ఈ ప్రాజెక్ట్ వల్ల టిబెట్ పీఠభూమిలోని పర్యావరణంతో పాటు ఎంతమంది ప్రజలు ప్రభావితవుతారనేది మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. కానీ చైనా అధికారుల ప్రకారం.. చైనా జలవిద్యుత్ సామర్థ్యంలో మూడింట ఒక వంతు మాత్రమే ఉండే టిబెట్‌లోని ప్రాజెక్టులు...పర్యావరణంపై లేదా దిగువకు నదీ ప్రవాహాలపై పెద్ద ప్రభావం ఉండదు. అయినప్పటికీ, భారత్, బంగ్లాదేశ్‌లు మాత్రం ఈ డ్యామ్ గురించి ఆందోళన లేవనెత్తుతాయి. ఈ ప్రాజెక్ట్ స్థానిక జీవావరణాన్ని మాత్రమే కాకుండా బ్రహ్మపుత్ర



దిగువ భాగంలో ఈ ప్రాజెక్ట్ నిర్మించనున్నట్లు అక్కడి మీడియా కథనాలు ప్రచురించాయి. ఈ ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 300 బిలియన్ కిలోవాట్ అవర్స్ అని 2020లో చైనాకు చెందిన పవర్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ అంచనావేసింది. ప్రస్తుతం అతి పెద్ద డ్యామ్ త్రీగోర్జెస్ సామర్థ్యం కంటే (88.2 బిలియన్ కిలోవాట్ అవర్స్) మూడు రెట్లు అధికం.

చైనా ఉమ్మడి లక్ష్యాలు, ఉద్దీపన పరిశ్రమలైన ఇంజినీరింగ్, టిబెట్‌లో ఉద్యోగ కల్పనలో ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషించనుందని చైనా అధికారిక వార్త ఏజెన్సీ జున్హు నివేదించింది. యార్లంగ్ జంగ్పో నది కేవలం 50 కిలోమీటర్ల తక్కువ పరిధిలోనే 2000 మీటర్ల ఎత్తు నుంచి మైదానంలోకి ప్రవేశిస్తుంది. ఇది భారీ ఎత్తున జలవిద్యుత్ నది ప్రవాహం, గమనాన్ని కూడా మార్చే అవకాశం ఉంది. ఇప్పటికే దీనికి ఎగువ ప్రాంతంలో చైనా జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించింది. టిబెట్‌లో జన్మించిన బ్రహ్మపుత్ర నది.. భారత్‌లోకి అసోం ద్వారా ప్రవేశించి.. తర్వాత బంగ్లాదేశ్ మీదుగా బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈశాన్య రాష్ట్రాలకు అత్యంత కీలకమైన ఈ నదీ జలాల ప్రవాహం, పంపిణీ వంటి అంశాలపై సమాచార మార్పిడి కోసం భారత్-చైనాల మధ్య ఒప్పందం ఉంది. అసోం దుఃఖదాయినిగా గుర్తింపు పొందిన బ్రహ్మపుత్రకు వర్షాకాలంలో విపరీతమైన వరదలు వస్తుంటాయి. అసోం, బంగ్లాదేశ్‌లో అపార నష్టం వాటిళ్లుతుంది. ఒకవేళ, ఈ ప్రాజెక్ట్ పూర్తయితే భారత్‌కు ఇబ్బందికర పరిస్థితి నెలకుంటుంది.



# సిరియాలో హింసాత్మక ఘర్షణలు..

సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పాలనలో వేలాది మంది ఖైదీలకు మరణశిక్ష విధించిన ఓ అధికారిని ప్రస్తుత ప్రభుత్వం అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించింది. ఈక్రమంలోనే పెద్ద ఎత్తున ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఓవైపు బలగాలు కాల్పులు జరుపుతుంటే మరోవైపు సాయుధులు ఎదురు కాల్పులు జరపారు. ఈ ఘటనలో మొత్తం 17 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవలే తిరుగుబాటుదారులు సిరియాను వారి అధీనంలోకి తీసుకోగా.. అధ్యక్షుడు బషల్ అల్ అసద్ అక్కడి నుంచి రష్యాకు పారిపోయారు. ఇక అప్పటి నుంచి కొత్త ప్రభుత్వమే సిరియాను పాలిస్తోంది. అన్ని గొడవలు తగ్గి దేశం శాంతియుతంగా నడుస్తుందనుకుంటే.. పలు చోట్ల హింసాత్మక ఘటనలు ఇంకా చెలరేగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మాజీ అధ్యక్షుడు అసద్ పాలనలో వేలాది మంది ఖైదీలకు అన్యాయంగా మరణశిక్ష విధించిన ఓ అధికారిని అరెస్ట్ చేసేందుకు కొత్త ప్రభుత్వంలోని బలగాలు వెళ్లాయి. ఈక్రమంలోనే రెండు వర్గాల మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మొత్తం 17 మంది చనిపోగా.. 10 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి.

**అవసరం లేకపోయినా మరణ శిక్షలు విధిస్తూ.. అమాయక ప్రజల ప్రాణాలు తీసిన ఆ అధికారిని అరెస్ట్ చేయాలని అల్ జోలానీ ప్రభుత్వం బలగాలకు సూచించింది. దీంతో వాళ్లు సదరు అధికారిని అరెస్ట్ చేసేందుకు టార్టస్ ప్రావిన్సులో ఉన్న అతడి ఇంటికి వెళ్లారు. ఈక్రమంలోనే రెండు వర్గాల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకున్నారు.**

అసద్ దేశం విడిచి పారిపోయిన తర్వాత నుంచి దేశాధ్యక్ష పదవిని అబు మహ్మద్ అల్ జోలానీ చేజిక్కించుకున్నారు. ఈ ఘటనలో సిరియా ప్రజలు అంతా పండుగ చేసుకున్నారు. 50 ఏళ్లుగా కుటుంబ నియంత పాలను చూశామని.. ఇప్పుడు స్వేచ్ఛగా బతకొచ్చు అనుకుంటూ కలలు కన్నారు. ఆ దిశగానే అల్ జోలానీ ప్రభుత్వం కూడా అడుగులు వేసింది. కానీ తాజాగా జరిగిన ఓ ఘటనలో మరోసారి హింస చెలరేగింది. ముఖ్యంగా అసద్ పాలన సమయంలో సైనిక న్యాయ విభాగం డైరెక్టర్, ఫీల్డ్‌కోర్ట్ చీఫ్‌గా మహమ్మద్ కంజో హాసన్ బాధ్యతలు నిర్వహించారు.

అయితే మహమ్మద్ కంజో హాసన్ అన్యాయంగా అనేక మంది ఖైదీలకు మరణశిక్షలు విధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అవసరం లేకపోయినా మరణ శిక్షలు విధిస్తూ.. అమాయక ప్రజల ప్రాణాలు తీసిన ఆ అధికారిని అరెస్ట్ చేయాలని అల్ జోలానీ ప్రభుత్వం బలగాలకు సూచించింది. దీంతో వాళ్లు సదరు అధికారిని అరెస్ట్ చేసేందుకు టార్టస్ ప్రావిన్సులో ఉన్న అతడి ఇంటికి వెళ్లారు. ఈక్రమంలోనే రెండు వర్గాల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకున్నారు.

దీంతో కొత్త ప్రభుత్వంలోని మొత్తం 14 మంది జనరల్ సెక్యూరిటీ అధికారులు ప్రాణాలు కోల్పోయారు. అలాగే ముగ్గురు సాయుధులు కూడా మృతి చెందారు. అంతేకాకుండా మరో 10 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ విషయాన్ని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమాన్ రైట్స్ సంస్థ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఇదిలా ఉండగా.. అసద్ పాలన సమయంలో చివరి 13 ఏళ్లలోనే మొత్తం 5 లక్షలకు పైగా ఖైదీలకు మరణ శిక్షలు విధించారు. దీన్ని చూస్తుంటేనే అసద్ పాలనలో ఎన్ని దుర్మార్గాలు జరిగాయో, ప్రజలపై ఎంత కఠినంగా వ్యవహరించారో అర్థం అవుతుంది.

# అధికారుల దాగుడు మూతలు !



## కబ్జాదారులకు అండగా మూడు శాఖల అధికారులు.
## నోటీసులకే పరిమితమవుతున్న బాధ్యతలు.

**ఆర్మూర్,డిసెంబర్ 26 ( జనం సాక్షి):**

తప్పించుకు తిరగువాడు ధన్యుడు సుమతి..అనే సామెత ఆర్మూర్ అధికారులకు అచ్చు గుద్దినట్లుగా వర్తిస్తుందని చెప్పవచ్చు. అక్రమార్కులకు, భూ కబ్జాకోరులకు రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు అండగా నిలబడుతున్నారు. ఆక్రమణలపై, భూ కబ్జాలపై ఉక్కు పాదం మోపాల్సిన ఆయా శాఖ అధికారులు దాగుడు మూతలు ఆడుతున్నారు. అసైన్మెంట్,ఇరిగేషన్ కెనాల్,పది శాతం భూములకు కబ్జాలకు పాల్పడిన వారికి అధికారులు అండగా నిలుస్తున్నారని ఆర్మూర్ ప్రజలు కోడైకుస్తున్నారు.ఒక ఇంటి నిర్మాణం, భారీ కమర్షియల్ నిర్మాణం అనుమతి రావాలంటే మూడు శాఖల అధికారుల అనుమతి తప్పనిసరి. ఏదైనా భారీ నిర్మాణానికి పర్మిషన్ ఎలా ఇచ్చారని పలువురు సమస్యను తీసుకువస్తే అట్టి నిర్మాణానికి రెవెన్యూ అధికారులకు రాతపూర్వ కంగా ఇచ్చామని మున్సిపల్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.ఇదే విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు తమ పని కాదని చేతులు ముడుచుకుని చెప్పేస్తున్నారు.ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తే ఆ ప్రాంతంలో ఇరిగేషన్ స్థలం లేదని బుకాయిస్తున్నారు.పంచాయతీ అధికారులు సైతం ఇదే తీరు కనిపిస్తున్నారు. ఆర్మూర్ ప్రాంత అధికారులారా... దాగుడు మూతలు ఇంకెన్నాళ్లు..అక్రమాలకు, ఆక్రమణలకు ఇంకెన్నాళ్లు ఆజ్యం పోస్తారని ఆర్మూర్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.లక్షల్లో జీతాలు తీసుకుంటూ బాధ్యతలు నిర్వర్తించేందుకు ఎందుకింత బాధ్యతా రహిత్యం అర్థం కాకుండా పోయింది. ముందు ఎన్నడూ లేనంతలా రెవెన్యూ శాఖ కార్యాలయం మరింత అధ్వాన్న స్థితికి జారుకుంది. రెవెన్యూ అధికార బాధ్యతలు నిర్వర్తించకపోతే లిఖితపూర్వకంగా జనాలకు మా పని కాదని జవాబుదారీగా ఇవ్వాలని ఆర్మూర్ ప్రజలు అడుగుతున్నారు. మరికొందరు అధికారులైతే చిన్న పనికి అధికార, ప్రతిపక్ష నేతలని చూడకుండా పగలు రాత్రి తేడా లేకుండా వారిని చెప్పులు అరిగేలా తిరిగించుకుంటున్నారు.వివిధ శాఖల నుండి చాలా నోటీసులు రెవెన్యూ శాఖ కార్యాలయంలో పనికిరాని చిత్తు కాగితంలా అలా పడి ఉంటున్నాయి.వివిధ శాఖల నుండి నోటీసులు వచ్చినప్పటికీ వాటిపైన చర్యలు తీసుకోవాలి. ఇవేమీ పట్టనట్టు రెవెన్యూ శాఖ అధికారులు గాడ నిద్రలో ఉన్నట్టు తెలుస్తుంది.పలు శాఖల అధికారుల చాప కింద నీరులా కొందరు నాయకులకు మాత్రమే తల ఊపి పనులు చేస్తున్నారు. ఆ అధికారులు ఆమ్యామ్యాలకు అలవాటు పడ్డారా..! ఆక్రమణలపై, అక్రమార్కులపై, భూకబ్జాలపై కన్నెత్తి చూడరా..! అని ఆర్మూర్ ప్రజలు నిక్కచ్చిగా ప్రశ్నిస్తున్నారు.

# ఘనంగా వేం నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**ప్రభుత్వంలో వేం నరేందర్ రెడ్డి కీలక పాత్ర.**

**సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.**

**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 26 (జనంసాక్షి) బీ**



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సిఎం ప్రజా వ్యవహారాలు చూసే వేం నరేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా నగరంలోని మార్కెట్ రోడ్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కోసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా పాలనలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ప్రభుత్వానికి మంచి సలహాలు సూచనలు చేస్తూ ప్రభుత్వాన్ని మరింత ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్న వేం నరేందర్ రెడ్డికి భగవంతుడు ఎల్లప్పుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు దన్న సింగ్, ఎండి తాజ్, ఎండి చాంద్, జీడి రమేష్, పెద్దిగారి తిరుపతి, మూల జైపాల్, మిరాజ్, శేహెన్షా, షబానా మహమ్మద్, మాసుం ఖాన్, ఊరడి లత, ముల్కల కవిత, జ్యోతి రెడ్డి, అశ్రఫ్, బషీర్, ఎల్లారెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో భద్రత కరువవుతుందా....?

## సిబ్బంది పర్యవేక్షణ ఎక్కడ ...?

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26 (జనంసాక్షి).**

వేములవాడ రాజన్న ఆలయంలో భద్రత కరువవుతుందా...సిబ్బంది పర్యవేక్షణ కొరవడుతుందా...అంటే అవుననే సమాధానం వస్తుంది.ఆలయము లోని హుండీలకే కన్నం వేయడం చూస్తుంటే పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. నాలుగు రోజులుగా మైనర్లు హుండీల నుండి డబ్బులు తీస్తున్నప్పటికీ ఆలయ సిబ్బంది గుర్తించకపోవడం పలు విమర్శలకు తావిస్తున్నది. రాజన్న ఆలయంలో నాలుగు పెద్ద హుండీలు,ఎనిమిది చిన్న హుండీలు ఉన్నాయి. భక్తులు తమ మొక్కుబడులను నగదు కానుకలతో హుండీలు నిండిపోయాయి. బుధవారం ముగ్గురు మైనర్లు సాధారణ భక్తుల్ల రాజన్న ఆలయంలోకి వచ్చి హుండీలోని నగదు తీస్తుండగా సిబ్బందికి చిక్కారు. ఆలయ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారి వద్ద నుంచి రూ 2800 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసు విచారణలో ఆదివారం కూడా వారు రూ 7 వేలు హుండీలో నుండి తీసినట్లు తెలుస్తుంది. ఆలయ భద్రత సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు వారిని విచారిస్తున్నట్లు వేములవాడ పట్టణ ఇన్చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

# శంకర్‌కు అపోలోరిచ్ హాస్పిటల్ వైద్యుల ద్వారా కొత్త జీవనం

**ముందస్తు గుర్తింపుతో ప్రాణాలకు హాని ఉండదు.**

**కరీంనగర్ అపోలోరిచ్ ఆస్పత్రి ప్రముఖ కార్డియోలజిస్టు డాక్టర్ కృష్ణ చైతన్య.**

**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 26 (జనం సాక్షి) :**

గోదావరిఖని కి చెందిన వై. శంకర్ బ్రెయిన్లో రక్తనాళం క్లాట్ కారణంగా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొన్నారు. కరీంనగర్ లోని అపోలో రిచ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్. కృష్ణచైతన్య నేతృత్వంలో నిర్వహించిన వైద్యచికిత్స ఆయనకు కొత్త జీవనాన్ని అందించింది. గురువారం నగరంలోని అపోలో రిచ్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గుండె రక్తనాళ్లల్లో కొవ్వు పెరిగినట్టే, మెదడులో కూడా రక్తనాళల్లో కూడా బ్లాక్స్ ఏర్పడతాయని, వాటిని సరైన సమయంలో గుర్తించి సమర్థవంతమైన వైద్యం అందించడం ద్వారా రోగులను ప్రాణాలతో కా పా డ వ చ్చ ని తెలిపారు. పక్షవాతం వచ్చిన వారికి కెరోటిడ్ డాప్లర్ పరీక్షల ద్వారా రక్తనాళాల్లో బ్లాక్స్ ఉంటే బయటపడుతాయని తెలిపారు.



70శాతం పైగా బ్లాక్ లు ఉంటే వారికి స్టంట్ వేయడం ద్వారా సురక్షితంగా కాపాడవచ్చని తెలిపారు. గోదావరిఖని కి చెందిన వై.శంకర్ బ్రెయిన్ రక్తనాళలు బ్లాక్ అయి సిరియస్ కండిషన్లో తమ ఆసుపత్రి కి వచ్చారని తెలిపారు. వెంటనే శంకర్ కి అంజియోగ్రామ్ టెస్ట్ చేయగా 95 శాతం బ్లాక్ ఉందన్నారు. వెంటనే తమ టీం న్యూరో సర్జన్ సుబ్రత ఖుమార్, న్యూరో ఫిజిషియన్ డాక్టర్. అన్నం హరికృష్ణ తో కలసి విజయవంతంగా స్టంట్ వేయడం ద్వారా సంపూర్ణగా కోలుకొని మరుసటి రోజే డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. బ్లాక్స్ ను తొలగించుకుంటే భవిష్యత్లో బ్రెయిన్ స్ట్రోక్ రాకుండా కాపాడవచ్చని తెలిపారు. జిల్లాలో ఇలాంటి వైద్య చికిత్సలు అందించ డానికి పలు హాస్పిటల్స్ ముందుకు రావడం లేదన్నారు.

అపోలో రిచ్ హాస్పిటల్ ఏఓ డాక్టర్. నాగసతీష్ కుమార్ మాట్లాడుతూ, అరుదైన చికిత్సలకు కేరాఫ్గా అపోలో రిచ్ నిలుస్తోందన్నారు. సామాన్యలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం ను అందిస్తూ.. ఎంతో మందికి పునర్జన్మను అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం పేషంట్ కూతురు మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మాది, మా నాన్న యేదుల శంకర్ బ్రెయిన్ బ్లెడ్ క్లాట్ అవ్వడం ద్వారా అత్యవసరపరిస్థితిల్లో అపోలో ఆస్పత్రి కి వచ్చామని తెలిపారు. ఇక్కడ ప్రముఖ కార్డియోలోజి డాక్టర్. కృష్ణచైతన్య చూసి అంజియోగ్రామ్ టెస్ట్ చేసి 95శాతం బ్లాక్ ఉందని చెప్పారు. వెంటనే వైద్య చికిత్స ఇచ్చి తన తండ్రిని బతికించాలని వేడుకున్న వెంటనే డాక్టర్ స్పందించి మెరుగైన వైద్యం అందించి మా నాన్నకు పునర్జన్మను అందించారు. అపోలోరిచ్ హాస్పిటల్ ప్రముఖ కార్డియోలజిస్ట్ డాక్టర్. కృష్ణచైతన్య కు కృతజ్ఞతలు తెలిపారు.



# కరీంనగర్ వాసవి వృద్ధాశ్రమంలో "డా.చిట్టుమల్ల ప్రదీప్ కుమార్" కు ఘన సన్మానం

**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 26 (జనం సాక్షి) :**

కరీంనగర్ వాసవి వృద్ధాశ్రమం వారి ఆధ్వర్యంలో శ్రీ సాయి లైఫ్ లైన్ హాస్పిటల్ కరీంనగర్ డాక్టర్ చిట్టుమల్ల ప్రదీప్ కుమార్ కు ఉత్తమ వైద్యుడిగా ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు అందుకున్నారు. ప్రముఖ డాక్టర్ ప్రదీప్ కుమార్ ను కరీంనగర్ వాసవి వృద్ధాశ్రమం వారు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం వృద్ధులకు పాలు, బ్రేడ్, పండ్లు, ఉచిత వైద్య శిబిరం, రక్త పరీక్షలు నిర్వహించి వారికి మందులు ఉచితంగా డా. చిట్టుమల్ల ప్రదీప్ కుమార్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో వృద్ధాశ్రమం అధ్యక్షులు చిట్టుమల్ల కొండయ్య, లక్ష్మన్ రావు , స్వరాజ్ బాబు, వెంకట నరసయ్య, శ్రీ సాయి లైఫ్ లైన్ హాస్పిటల్ మేనేజ్మెంట్ డైరెక్టర్ చిట్టుమల్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు




# కరీంనగర్ లో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్సీ అభ్యర్థి "అల్ఫోర్స్ " డా.వి.నరేందర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 26 (జనం సాక్షి) :**



పట్టభద్రులకు అన్ని విధాలుగా చేయూతనిస్తానని వారి అభ్యున్నతే నా ప్రధాన ధ్యేయమని ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కరీంనగర్ లోని వివిధ విద్యాసంస్థల్లో నిర్వహించినటువంటి పలు ముఖాముఖి కార్యక్రమాలలో పాల్గొని వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టభద్రుల అభివృద్ధికై అన్ని వేళల్లో అందుబాటులో ఉంటానని, వారి కావలసిన వనరులు కల్పించడానికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి అభివృద్ధి పధాన పయనించేందుకు కృషి చేస్తానని చెప్పారు. పర్యటన లో భాగంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఒక ప్రవేత్వేడుక మందిరంలో పట్టభద్రులతో ముఖాముఖి నిర్వహించి వారిని ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో పట్టభద్రులను అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తానని, నిరుద్యోగ నిర్మూలన కై ప్రత్యేక ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తానని, తద్వారా వారికి జీవనోపాధి కల్పించడమే కాకుండా సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని వారు తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అందరికీ ఆరోగ్య భీమా వర్తించేందుకు కృషి చేస్తానని, వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఉద్యోగులకు వర్తిస్తున్న వివిధ పథకాలను వారికి కూడా అమలుపరిచేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశాలలో పాల్గొన్న పలువురు ఉపాధ్యాయులు, పట్టభద్రులందరూ నరేందర్ రెడ్డి కి మద్దతు ఇస్తామని, వారిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని ప్రకటించారు.

# రాజన్న నీ ఆలయంలో ఏమి జరుగుతుంది...

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26 (జనంసాక్షి).**

పేదల కొంగు బంగారమైన వేములవాడ రాజన్న ఆలయంలో ఏమి జరుగుతుందో అర్థం కావడం లేదు. గత నెల రోజుల నుండి జరుగుతున్న పలు ఘటనలపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని భాజపా పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చితే భక్తులు కోడెమొక్కులు చెల్లించుకుంటారు కొంతమంది స్వామివారికి నిజ కోడలను అందజేస్తుంటారు.గత నెల రోజుల క్రితం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి సిఫారసు లెటర్ మీద గీసుకొండ మండలానికి సంబంధించిన ఒక వ్యక్తికి వేములవాడ గోశాల నుండి దాదాపు 60 కోడెలను ఆలయ అధికారులు అందజేశారు.వాటిలో 30 కోడెలను గోవదశాలకు అమ్ముకున్న విషయంలో గీసుకొండ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఈ విషయంపై రాజన్న ఆలయ అధికారులు, ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఇటీవల కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రాగా ఒక్కొక్క భోజనానికి రూ 32 వేలని అనేక మీడియా కథనాలలో వార్తలు రావడం జరిగిందన్నారు.వార్తలు రావడంతో ఆలయ అధికారులు సీఎం భోజనాలతో మాకు సంబంధం లేదు అని ప్రకటన విడుదల చేశారన్నారు. క్రిస్మస్ రోజున కొంతమంది వ్యక్తులు అన్యమత ప్రచారం చేస్తూ ఆలయ ప్రాంగణంలో భక్తులకు మాంసాహార భోజనాలను పంపిణీ చేసి ఆలయ పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్న ఆలయ అధికారులు స్పందించకపోవడం, సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతుంది అన్నారు.బుధవారం జరిగిన సంఘటన పై పోలీస్ స్టేషన్లో వేములవాడ బీజేపీ పార్టీ పక్షాన ఫిర్యాదు చేశామ న్నారు. బుధవారం జరిగిన క్రిస్మస్ రోజు జరిగిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ చేపట్టి ఆ సంఘటనకు వెనుక ఉన్న అసలైన బాధ్యులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నెల రోజుల నుండి రాజన్న ఆలయంలో ఏదో ఒక సంఘటన జరుగుతున్న ఆలయ ఈఓ స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి భక్తుల మనోభావాలు కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన వెంట భాజపా నాయకులు వాసం మల్లేశం,రేగుల రాజ్ కుమార్,నామాల శేఖర్,బిల్ల కృష్ణ, నేరేళ్ల సాయి,మానిండ్ల లక్ష్మీరాజం,రేగుల శ్రీకాంత్,మైలారం శ్రీనివాస్,చిలువేరి బాబు, కొరెపు నరేష్,ఖమ్మం పృథ్వీరాజ్, కొరెపు వెంకటేష్ పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన షబ్బీర్ అలీ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26 (జనం సాక్షి)**



కామారెడ్డి పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం దాదాపు 16 లక్షల రూపాయలు లబ్దిదారులకు పంపిణి చేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెండింగ్లో ఉన్న సిఎంఆర్ఎఫ్ ఫైళ్లను ముఖ్యమంత్రితో మాట్లాడి కామారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 26 మందికి సీఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేయించడం జరిగింది అన్నారు.అనారోగ్యంతో అప్పుల పాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో కొంత కలిగిస్తాయి అన్నారు.పేదలకు సహాయంగా అండగా నియోజకవర్గం ప్రజల మంచి మాత్రమే కోరుకుంటామన్నారు.ఎల్ఓసి సరైన సమయంలో అందక ఎంతోమంది సరైన పత్రాలు సమయానికి అందక ఇబ్బంది పడుతున్నారు.సమగ్ర సర్వే అనంతరం డిజిటల్ హెల్త్ కార్డు అందించి 10 లక్షల వరకు నిమ్స్ ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందిస్తామన్నారు.

# రాష్ట్ర స్థాయి సి.ఎం కప్ జూనియర్ హ్యాండ్బాల్ పోటీలకు ఎంపికైనా పారమిత పాఠశాల విద్యార్థులు

**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 26 (జనం సాక్షి) :**



రాష్ట్ర స్థాయి సి.ఎం కప్ జూనియర్ హ్యాండ్బాల్ పోటీలకు ఎంపికైనా పారమిత పాఠశాల విద్యార్థులు

ఈ నెల 22 వ తేదీన అకాడమిక్ హైట్స్ పాఠశాలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సి.ఎం కప్ హ్యాండ్బాల్ పోటీలను నిర్వహించారు. ఇందులో బాగంగా, నగరంలోని పారమిత పాఠశాల విద్యార్థులు సీహెచ్.భువన, జే.సమిత్ నందన్ లు పాల్గొని అత్యున్నత ప్రతిభ కనబరిచి 27, 28, 29, డిసెంబరు తేదీల్లో వరంగల్లోని జరిగే సి.ఎం కప్ జూనియర్ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యారు. దీనికి గాను పాఠశాల చైర్మన్ డా. ఇ. ప్రసాదా రావు, డైరెక్టర్లు ప్రసూన,అనుకర్ రావు, రష్మిత , వి.యు.మ్.ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ టి ఎస్ వి రమణ, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రాము, భవాని, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, మహేష్, అమరేందర్ లు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో అభివృద్ధి పరిఢవిల్లుతుంది



## ముస్లీం మైనార్టీల కోసం పెద్దఎత్తున నిధులు తీసుకువస్తా

## ఏడుపాయలను దర్శించుకోని మాజీ ముఖ్యమంత్రి ప్రజలను వంచించిండు

## మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్

**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 26 (జనం సాక్షి):**

మెదక్ నియోజక వర్గం అభివృద్ధి ఏలా ఉంటుందో.. ఒక ఏడాది కాలంలోనే ప్రజలు గుర్తించేలా 780 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ గురువారం వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఎమ్మెల్యేగా గెలుపొందిన సంవత్సరంలోపే సామాజిక న్యాయం కులమతాలకు అతీతంగా సంపూర్ణంగా జరిగిందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి పాలనల మధ్య సమతు ల్యత... సమగ్రంగా సాక్షి బూతం అయ్యిందన్నారు. ప్రజల హృదయాలను గెలుచుకోని అతి చిన్నవయస్సులో ఎమ్మెల్యే గా నేను గెలుపొందానని ఆయన గుర్తుచేశారు. మెదక్ చర్చికి కనివినీ ఎరుగని రీతిలో 29 కోట్ల 18 లక్షల 50 వేల రూపాయలు నిధులను వందేళ్ళ చర్చికి ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి ఇచ్చిన తీరును చూసి గురువులు చర్చిలో ప్రార్ధనలు, ప్రసంగాలు ప్రపంచానికి చర్చి గుడి గంటల ద్వారా అభివృద్ధి నినాదాలు మారుమ్రోగాయి. అలాగే పది సంవత్సరాల కాలంలో ఒక్కసారిగా కూడా ఏడుపాయల దుర్గామాతను దర్శించుకోని ఆనాటి మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ సిగ్గుతో తలవంచుకోవాలని ఎద్దేవా చేశారు. సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి హెూదాలో రేవంత్ రెడ్డి రావడం... 780 రూపాయల కోట్లతో శంకుస్థాపన జరిగిన తీరు మెదక్ జిల్లా చరిత్ర లో నిలిచిపోతుందన్నారు.

**మైనార్టీల కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తా..**

మెదక్ నియోజక వర్గ మైనార్టీల ముస్లీంల కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నియోజక వర్గ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ అన్నారు. హజ్ హౌజ్, తాజ్ మినార్, మైనార్టీ ఫంక్షన్ హాల్ లను నిర్మాణం చేపడ్తానని... మొదటి సంవత్సరంలో ఖాళీ ఖాజాన చేతికిచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో విధ్వంసం నుంచి వికాసంవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలు తీసుకెల్తున్నారని ఆయన కొనియాడారు. ఈ స్థితిలో మెదక్ నియోజక వర్గానికి 780 కోట్లు మంజూరు చేయడం ఆశామాషీ కాదని ఆయన అన్నారు.

**సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా సుసంపన్నం చేస్తా..**

మెదక్ నియోజక వర్గంలోని ఏడుపాయల దుర్గాభవాని, మెదక్ రాచవీడు ఖిల్లా, ప్రపంచఖ్యాతి గాంచిన చర్చి, పోచారం అభయారణ్యం... కోంటూర్ చెరువు లను అత్యాదునిక పర్యాటక కేంద్రాలుగా ఒక హబ్ గా తీర్చిదిద్ది... ప్రపంచ పర్యాటకులు ఆకర్షించేలా ప్రణాళికను రూపొందిస్తున్నట్లు నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ తెలిపారు.

**రాజకీయ చరిత్రను తిరిగి రాస్తా..**

రాజకీయాల కోసం వాడుకునే నాయకులకు మెదక్ ప్రాంతం కావాలని, అభివృద్ధికి మాత్రం మెదక్ ప్రాంతం వైపు కన్నెత్తి చూడని నాయకులకు రాజకీయం అంటే ఎంటో అసలు రంగు ముందుంది చూపిస్తా అని మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ మండిపడ్డారు. రాజకీయాల కోసం మెదక్ ప్రాంతం కు వచ్చి అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై నిందలు వేయడం సరియైంది కాదని ఆయన హెచ్చరించారు.

# ఎమ్మెల్యే దొంతి కృషితో పాఖాలకు గోదావరి జలాలు విడుదల ..



**ఖానాపురం, డిసెంబర్ 26 (జనంసాక్షి)**

ఈ సీజన్లో పాకాల చెరువుకు, గంగమ్మకు పూజలు నిర్వహించి పుష్పాంజలి సమర్పించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యడ్ల జగన్మోహన్ రెడ్డి, నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు లు పూజలు నిర్వహించారు. గురువారం మండలం లోని పాకాల చెరువుకు ఈ వేసంగి పంటకు పూర్తి ఆయకట్టుకు నీరం దిం చాలనే కృతనిశ్చయంతో నియోజ కవర్గ అభివృద్ధి ప్రధాత నర్సంపేట ఎమ్మెల్యే ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవ చూపి పాఖాల సరస్సు కు గోదావరి జలాలు విడుదల చేయించారు. బుధవారం అర్థరాత్రి పాఖాల సరస్సుకు చేరడంతో గంగమ్మ తల్లికి పుష్పాంజలి సమర్పించి ప్రత్యేక పూజలను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యడ్ల జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు పూజలు నిర్వ హించి ఈ ప్రాంతం సత్యశ్యామలం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డి ఈ రమేష్ బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్, మండల నాయకుడు వీరమనేని సాగర్ రావు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షు లు ఎలగందుల రాజు, రంగాపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు పిండి కుమార్, నేటి ప్రార్ధన శాసనసభ అధికారులు పాల్గొన్నారు.

# టిఎస్ యూఈఈయూ జెన్ కో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మల్లయ్య

**గణపురం , డిసెంబర్ 26 (జనం సాక్షి ):**



మండలంలోని కాకతీయ థర్మల్ విద్యుత్తు కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న చిలివేరు మల్లయ్య టిఎస్ యూఈఈయూ జెన్ కో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా కె. కిరణ్ లను ఏన్నుకున్నాట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె ఈశ్వరరావు తెలిపారు. కె టి పి పి లో పనిచేస్తున్న ఈ ఇద్దరు ఉద్యోగులను వారి సేవలను గుర్తించి కె టి పి పి నుండి రాష్ట్ర కమిటీ లోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెన్ కో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కె టి పి పి ఉద్యోగులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటామన్నారు. కె టి పి పి తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జెన్కో ఉద్యోగుల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేస్తామని వారి హక్కులు సాధించుకునే వరకు వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. కె టి పి పి నుండి ఇద్దరికీ రాష్ట్ర కమిటీ లోకి తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి రైతుకు సాగు నీరు అందిస్తాం రైతులెవరు

# ఆందోళన చెందొద్దు...



**ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్..**

**కడెం : డిసెంబర్ 26(జనం సాక్షి)**

రబీ పంటకు ప్రతి రైతుకు సాగునీరు అందిస్తామని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం కడెం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఖానాపూర్,కడెం,దస్తురాబాద్ జన్నారం రైతులతో రబీ సాగునీటి సరఫరాపై ఇరిగేషన్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనలో కడెం ప్రాజెక్టు మరమ్మత్తులకు చిల్లిగవ్వ ఇవ్వలేదని, దాని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి,జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ద చూపి కడెం ప్రాజెక్టు మరమ్మత్తులకు 9 కోట్ల 46 లక్షలు మంజూరు చేసిందని, ఇప్పుడు ప్రాజెక్టు సురక్షితంగా ఉందని అన్నారు. ఖానాపూర్,కడం దస్తురాబాద్, జన్నారం రైతుల పంట సాగుకు నిరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల గురించి ఆలోచించి ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. జనవరి 5వ తేదీ నుండి నీటిని విడుదల చేస్తామని ప్రకటించారు. కొందరు మూరు?లు ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారని, తప్పుడు సమాచారాన్ని ప్రజల్లో తీసుకెళు_న్నారని, ప్రజలేవరు అలాంటి తప్పుడు మాటలను అపోహాలను నమ్మకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రోళ్లను వెంటనే విడుదల చేయాలి

## ఇంట్లోకి చొరబడి ఎందుకు అరెస్ట్ చేశారు

## బిఆర్ఎస్ నేతలు పల్లె, కేతిరెడ్డిల విమర్శ

**హైదరాబాద్:** విద్యార్థి ఉద్యమ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్‌ను బీఆర్ఎస్ నేత పల్లె రవికుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ రాజ్యమంటే ప్రజల కోసం పనిచేసే వారి ఇళ్లల్లోకి పోలీసులే దొంగల్లా చొరబడి అరెస్టులు చేయడమా? అని ఆయన ప్రశ్నించారు. సమయం, సందర్భం లేకుండా.. ఎప్పుడంటే ఎప్పుడు అరెస్టులు చేయడం ఏంటని నిలదీశారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ విద్యార్థి నాయకుడిగా తెలంగాణ కోసం నిజాయితీ, నిబద్ధతతో కొట్లాడినవాడు. బహుజనుల అభ్యున్నతి కోసం ఆరాటపడే యోధుడు అని రవికుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సబ్బండ వర్గాలకు చేసిన వంచనను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడమే ప్రజా పాలననా? ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయడం ఏంటని, అరెస్టు చేసిన డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు రవి కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. ప్రజా పాలనలో అర్ధరాత్రి, అపరాత్రి, తెల్లవారకముందే అరెస్టులు చేయడం ఏందీ? అని ప్రశ్నించారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ ఏమైనా బందిపోటా? ఉగ్రవాదా? గజదొంగనా? అని నిలదీశారు. ప్రశ్నించే గొంతులను అరెస్టు చేయడమే ప్రజా పాలననా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్దతిలో వ్యవహరించడం ఈ ప్రభుత్వంలో లేనట్టు కనిపిస్తుంది? నిజంగా నేరం చేసి ఉంటే ముందుగా నోటీసులు ఇవ్వండి? అరెస్టు చేయాలంటే అరెస్ట్ వారెంట్ చూయించండి? ఇవేమి లేకుండా ఉగ్రవాది లెక్క తెల్లవారకముందే ఇంటికి వచ్చి పట్టుకెళ్ళడం ఇదెక్కడి ప్రజాస్వామ్యం? ప్రజాస్వామ్యక వాదులందరూ ఖండించాల్సిన అరెస్ట్ ఇది కేతిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఇచ్చిన హామీలు అమలు చేస్తేలేవని ప్రజల పక్షాన నిలబడితే అరెస్టులు చేయడము ప్రజా పాలనలో కామన్ అయిపోయింది. అరెస్టులతో బెదిరింపులతో ప్రశ్నించే గొంతులను నొక్కలేరు ఇది ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యంలో అన్యాయం జరిగితే ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. తెలంగాణ రాష్ట్రంలో అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు, బ్లాక్‌మెయిల్ దందాలు రాష్ట్రంలో శరమాము లైపోయాయి.

తస్మాత్ జాగ్రత్తగా ఉండాల్సిన సమయం. ఈ సమయములో ప్రజలంతా ఏకధాటిపై ఉండి అన్యాయం ఎదిరించాల్సిందే. న్యాయం కోసం పోరాడాల్సిందే. ఆ పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు, అరెస్టులు, గొంతు నొక్కడాలు ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయింది. అక్రమ అరెస్టులకు భయపడేది లేదు ప్రజల పక్షాన నిలబడతాం.. నిలదీస్తాం.. కొట్లాడుతాం. అరెస్టు చేసిన డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాసులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాని కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి పేర్కొన్నారు.

# కేంద్ర కార్మిక శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారిగా అంగోత్ ఆనంద్





**నియామక పత్రాన్ని అందించిన కేంద్ర కార్మిక ఉపాధి మంత్రి**

**చెన్నారావుపేట, డిసెంబర్ 26 (జనం సాక్షి)**

కేంద్ర కార్మిక శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారిగా అంగోత్ ఆనంద్ ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకున్నారు. మండలంలోని భోజేర్వు గ్రామ శివారు జగ్గు తండాకు చెందిన గిరిజన యువకుడు అంగోతు ఆనంద్. ఇతని తల్లిదండ్రులు అంగోతు భద్రయ్య–అరుణ. భద్రయ్య చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయగూడెం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అరుణ వైద్య ఆరోగ్యశాఖలో ఎంఎస్ డబ్ల్యూ గ్రేడ్–1 అధికారిగా పనిచేస్తున్నారు. ఈ దంపతుల చిన్న కుమారుడు ఆనంద్. ఇటీవల ప్రకటించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాలలో ఆనంద్ కేంద్ర కార్మిక శాఖలో లేబర్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారిగా ఉద్యోగం సాధించాడు. గురువారం చెన్నైలో కేంద్ర కార్మిక శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారిగా ఆనంద్ ను నియమిస్తూ కేంద్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి మన్సు కమాండవియ ఉద్యోగ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు భద్రయ్య–అరుణలు కుమారుడు ఆనంద్ ను అభినందించారు. అలాగే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

# ఫసల్ భీమా యోజన అమలు చేయాలి

## కేంద్ర మంత్రికి బికేఎస్ వినతి



**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి)**

రైతుల సంక్షేమం కోసం ప్రధాని ఫ సల్ భీమా యోజన అమలు చేయాలనీ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నీ నారాయణపేట జిల్లా బి కే ఎస్ నాయకులు కోరారు. నారాయణపేట వెనుకబడిన జిల్లా మరుమూల ప్రాంతమైన తెలంగాణలో కర్ణాటక సరిహద్దులో ఉన్నందున ఎలాంటి అభివృద్ధి నోచుకోక ఈ ప్రాంతంలో రైతులు ఉపాధి లేక వలస పోతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు ఈ ప్రాంతంలో అమాలు కావడం లేదనీ గత పది సంవత్సరాల నుండి న్యాయం చేయాలని కోరుతున్న ఫలితం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా రైతులు ఆరుగాలం పండించిన పంటకు ఫసల్ బీమా యోజన అమలు కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం యొక్క వ్యవసాయ యంత్ర పరికరణ పనిముట్లు సబ్సిడీపై ట్రాక్టర్లు. కిసాన్ క్రెడిట్ కార్డులు. డైరీ ఫామ్ లు పి ఎం ఈ జి పి రుణ సదుపాయము అమలు కావడం లేదన్నారు. ఈ ప్రాంతానికి వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ముఖ్యంగా కావాలనీ,ఎత్తిపో తల పథకం ద్వారా 69 జీవో అమలు చేసి సాగునీరు అందించాలనీ వివిధ బ్యాంకులో కేంద్రం అనుస రించిన బ్యాంకు రుణా లు ఇవ్వడం లేదు మంత్రికివ్విన్నవించారు. ఈమేరకు గురువారం నారాయణపేట కు వచ్చిన మంత్రి బండి సంజయ్,ఎంపి. డికె. అరుణను వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బికే ఎస్ రాష్ట్ర,జిల్లా,మండల నాయకులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**లక్సెట్టిపేట, డిసెంబర్ 26 (జనంసాక్షి)**



రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్దనుండి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని, ఈ క్రమంలో ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం మోదెల, జెండా వెంకటాపూర్, చందారం, బలరావుపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను లక్షెట్టిపేట మండల తహసీల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 326 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి 2 వేల 320 రూపాయలు, సాధారణ రకానికి 2 వేల 300 రూపాయలను మద్దతు ధరగా నిర్ణయించడం జరిగిందని, సన్న రకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ అదనంగా చెల్లించడం జరుగుతుందని తెలిపారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యాలను వేరువేరుగా కొనుగోలు చేయడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలో టాగింగ్ చేయబడిన రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, నీడ ఇతర సదుపాయాలు కల్పించడంతో పాటు గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించే సమయంలో తేమశాతం, తాలు, మట్టి గడ్డలు లేకుండా నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు తప్పనిసరిగా రసీదు జారీ చేయాలని, ధాన్యం, రైతుల వివరాలను ట్యాబ్ లలో నమోదు చేసి త్వరితగతిన సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
27 డిసెంబర్ 2024

# తెలుగు వికీపీడియాపై అవగాహన అవసరం

తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ




**హైదరాబాద్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** తెలుగు వికీపీడియాలో వ్యాసాలు దాటిన సందర్భంగా 2024, డిసెంబరు 26న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో తెలుగు వికీపీడియా లక్ష వ్యాసాల ప్రస్థానం కార్యక్రమంలో 'వికీపీడియా గురించి మీకు తెలుసా?' అనే ఉచిత పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని, ఆవిష్కరించి వికీపీడియా సభ్యులను అభినందించారు. హరికృష్ణ మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఎన్‌సైక్లోపీడియాకు ఉన్న ప్రాముఖ్యత మనందరికీ తెలిసిందేనని, ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా పుస్తకాల్లో ఉన్న విధంగా 2001లో ఆన్‌లైన్‌లో ప్రారంభించబడిన ఈ వికీపీడియాకు కూడా ఎంతో ప్రాముఖ్యత ఉందని పేర్కొన్నారు. అలాగే తెలుగు వికీపీడియా కూడా చాలా వేగంగా అభివృద్ధి చెందుతూ లక్ష వ్యాసాలను దాటి, భారతీయ భాషల వికీపీడియాల్లో ఎక్కువ వ్యాసాలను కలిగివున్న జాబితాలోకి చేరడం గర్వించదగ్గ విషయం అన్నారు. మనిషి నాగరికత నేర్చిన నాటి నుంచి నుంచి ఇప్పటివరకు కూడా నాలెడ్జి ఈజ్ పవర్ అనేది కొనసాగుతూ వచ్చిందన్నారు. మిగతా జీవ రాశుల సృష్టి నుంచి మనిషిని భిన్నంగా చేసిన ప్రధాన అంశాలలో మొదటి అంశం నాలెడ్జ్ అని, ఈ నాలెడ్జి ఒక్కరిది కాదని, ఒక సమూహానిది మొత్తం ఒక కలెక్టివ్ గ్రూప్‌కి సంబంధించిన సామూహిక జ్ఞాన సంచయమే మనం అనుకుంటున్న జ్ఞానం. సామూహిక అనుభవాల సమాహారమే మనం అనుభవిస్తున్న నాలెడ్జి. కలెక్షన్ ఆఫ్ ఆల్ ది ఎక్స్‌పీరియన్స్ అవన్నీ కలిపితేనే ఒక నాలెడ్జిగా కొలమానంగా అయిందని, ఈ నాలెడ్జిని స్ట్రీమ్ లైన్ చేయాల్సిన అవసరంలో భాగంగా వికీపీడియా ఎనలేని సాధనంగా మారుతోందని, వికీపీడియన్స్ అంతా కలిసి స్వచ్ఛందగా వీకీ వ్యాసాలు రాస్తున్నారని తెలిపారు. అనంతరం వికీపీడియాలో వ్యాసాలు రాసిన వారికి సన్మానం చేశారు. బుక్ ఫెయిర్ లోని తెలుగు వికీపీడియా స్టాల్ నిర్వహణలో పాల్గొన్న వికీమీడియన్లకు సత్కారాన్ని చేసి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫైర్ అధ్యక్షులు యాకూబ్, వికీమీడియన్లు కృపాల్ కశ్యప్, వి.జె. సుశీల, గుంటుపల్లి రామేశం, ప్రణయ్ రాజ్ వంగరి, నాగరాణి బేతి తదితరులు పాల్గొన్నారు.

# విషమంగా మంద జగన్నాథం ఆరోగ్యం



**హైదరాబాద్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు వెల్లడించారు. దీంతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తోపాటు పలువురు రాజకీయ ప్రముఖులు పరామర్శించారు. 1996లో ఆయన తొలిసారిగా టీడీపీ తరఫున నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో తెలుగు దేశం టికెట్‌పై విజయం సాధించారు. ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 2009 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2014లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో ఆయనకు టికెట్ దక్కలేదు. ఈ నేపథ్యంలో 2022, జూలై 1న ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా అప్పటి సీఎం కేసీఆర్ ఆయనను నియమించారు. 2023 నవంబర్ 17న బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే నాగర్‌కర్నూల్ టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీ తీర్థం పుచ్చుకున్నారు.

# ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ సేవలో అంతరాయం

- అసహనం వ్యక్తం చేసిన ప్రయాణికులు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** రైల్వే టికెట్ల బుకింగ్ కోసం ఏర్పాటైన ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. మెయింటెనెన్స్ కారణంగా సర్వర్ డౌన్ అయ్యింది. ఫలితంగా గురువారం ఉదయం కొన్ని గంటల పాటు ఐఆర్‌సీటీసీ సేవలు నిలిచిపోయాయి. ఉదయం తత్కాల్ టికెట్స్ బుకింగ్ సమయంలో ఈ సమస్య తలెత్తింది. దీంతో యూజర్లు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెబ్‌సైట్, మొబైల్ యాప్ ఓపెన్ అవ్వట్లేదని పలువురు యూజర్లు ఉదయం నుంచి సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. తాము రైలు ప్రయాణ టికెట్లు బుక్ చేసుకోలేక పోతున్నామంటూ పేర్కొంటున్నారు. ఈ సమస్యపై ఐఆర్‌సీటీసీ స్పందించింది. మెయింటెనెన్స్ కారణంగా ఈటికెట్ సేవలు అందుబాటులో లేవని తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. టికెట్ రద్దు చేసుకోవడానికి, ఫైల్ టీడీఆర్ కోసం కస్టమర్ కేర్ నెంబర్ 14646, 08044647999, 08035734999కు ఫోన్ చేయాలని సూచించింది. కాగా, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ సేవల్లో అంతరాయం కలగడం ఈ నెలలో ఇది రెండో సారి. రెండు వారాల క్రితం కూడా ఇదే సమస్య తలెత్తిన విషయం తెలిసిందే. అప్పుడు కూడా తత్కాల్ బుకింగ్ సమయంలోనే సమస్య తలెత్తింది. తరచూ ఇలాంటి సమస్యల కారణంగా ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

# ఖరీదైన కారుకు మంటలు

- 45 నిమిషాలు శ్రమించి మంటలు ఆర్పివేసిన సిబ్బంది



**ముంబై, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** మహారాష్ట్ర ముంబైలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కోస్టల్ రోడ్‌లో కోట్ల ఖరీదైన లగ్జరీ లాంబోర్గినీ కారు మంటల్లో చిక్కుకుంది. బుధవారం రాత్రి 10:20 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని దాదాపు 45 నిమిషాలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియరాలేదు. గుజరాత్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఆరెంజ్ కలర్ కారు క్యాబిన్‌లో మంటలు వస్తున్న వీడియోను వ్యాపార దిగ్గజం గౌతమ్ సింఘానియా ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. ఈ కారు ఖరీదు రూ.9 కోట్లు అని సమాచారం.

# జొమాటో బాయ్‌ను నిలదీసిన సుమిత్ హర్దియా

- దీపావళి రోజు రాముని వస్త్రాధరణలో డెలివరీ చేస్తారా..?



**న్యూఢిల్లీ, డిసెంబర్ 26 జనంసాక్షి) :** దీపావళి రోజున రాముని వేషంలో వస్తారా?.. ఇది శాంటా క్లాజ్ వేషధారణలో ఉన్న ఓ ఫుడ్ డెలివరీ బాయ్‌కి ఎదురైన ప్రశ్న. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో.. క్రిస్మస్ కావడంతో శాంటా క్లాజ్ దుస్తులు వేసుకున్న ఓ జొమాటో డెలివరీ బాయ్ వినియోగధారులకు ఫుడ్ సప్లయ్ చేస్తున్నారు. ఈ క్రమంలో హిందూ జాగరన్ మంచ్ ఇండోర్ అధ్యక్షుడు సుమిత్ హర్దియా అతడిని అడ్డుకున్నారు. మీరు శాంటా క్లాజ్‌లా దుస్తులు ధరించి ఆర్డర్‌ని డెలివరి చేస్తున్నారా అని ప్రశ్నించాడు. దీంతా ఆ ఏజెంట్ అవునని చెప్పాడు. ఇలాగే దీపావళి పండుగ నాడు ఎప్పుడైనా రాముని వేశం వేసుకుని ప్రజల ఇండ్లకు వెళ్లారా అని నిలదీశారు. లేదని, కానీ ఇప్పుడు మాత్రం కంపెనీ ఆదేశాలతోనే ఈ దుస్తులు ధరించాలని, ప్రజలకు సందేశం ఇవ్వాలని చెప్పిందని డెలివరీ బదులిచ్చారు. అనంతరం ఆ దుస్తులను అతడు విప్పేశాడు. మనం హిందువులం. ఇలాంటి దుస్తులు వేసుకుని పిల్లలకు ఏం సందేశం ఇస్తున్నామని సుమిత్ ప్రశ్నించారు. అలాంటి సందేశం ఏదైనా ఇవ్వాలనుకుంటే శాంటాక్లాజ్ దుస్తులు వేసుకోవడం తప్పనిసరా అన్నారు. అలాంటప్పుడు భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్‌లా కూడా దుస్తులు ధరించాలని తెలిపారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నది.

# మహాకుంభమేళాకు భారీగా ఏర్పాట్లు

- ముఖ్య అతిథుల కోసం ప్రత్యేకంగా విభాగాలు
- అడర్ టన్నెట్ డ్రోన్లతో ప్రమాదాల నివారణ చర్యలు



**అలహాబాద్, డిసెంబర్ 26 (జనంసాక్షి) :** మహాకుంభమేళ.. 12 ఏళ్లకు నిర్వహించే వేడుక. సాధువులు, భక్తులు, పర్యాటకులు భారీగా కుంభమేళాకు తరలివస్తారు. ఈసారి 45 కోట్ల మంది రావచ్చనే అంచనాల మేరకు యూపి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. .అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లపై దృష్టి పెట్టింది. ఈ వేడుకను విజయవంతం చేసేందుకు ఈసారి విరివిగా ఆధునిక టెక్నాలజీని వాడుతున్నారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్ రాజ్‌లో జరిగే మహాకుంభమేళాకు ఉత్తరప్రదేశ్ సర్కార్ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రత్యేకంగా హైఎండ్ టెక్నాలజీని వాడుతున్నారు. అండర్ వాటర్ డ్రోన్లను అందుబాటులోకి తెస్తున్నారు. సీసీ కెమెరా నిఘా నేత్రాలు ఎటూ వుంటాయి. ఐతే ఈసారి సరికొత్తగా అండర్‌వాటర్ డ్రోన్లను వినియోగించబోతున్నారు. ట్రయిల్స్ కూడా నిర్వహించారు.ఎవరైనా నీళ్లలో మునిగిపోతే వెంటనే గుర్తించే వారిని కాపాడేలా అండర్ వాటర్ డ్రోన్లను వినియోగంలోకి తెస్తున్నారు. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లో పర్యాటకుల వసతి సహా భద్రత కోసం పకడ్బందీ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తలెత్తకుండా .. మహాకుంభమేళ-2025ని విజయవంతం చేసేలా చర్యలు చేపడుతున్నారు. అధికారులు.ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించనున్న మహా కుంభ మేళా 2025 సందర్భంగా భారతదేశం నుంచి మాత్రమే కాదు విదేశాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు అలాగే భారీ సంఖ్యలో సెలబ్రేటీలు పాల్గొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ ఫెయిర్ అథారిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ మహా కుంభమేళాలో పాల్గొనే ప్రముఖులందరికీ ఆహ్లాదకరమైన అనుభూతిని అందించడానికి, వారి బస, ఇతర ప్రోటోకాల్‌లకు సంబంధించిన సౌకర్యాలు కల్పించడానికి సన్నాహాలు చేయబడ్డాయి. మహాకుంభమేళా 2025 మొదటి ప్రధాన స్నానోత్సవం (పుష్య మాసం పౌర్ణమి) నుండి అంటే 13 జనవరి 2025న ప్రారంభమవుతుంది. చివరి ప్రధాన స్నానోత్సవం (మహాశివరాత్రి) 26 ఫిబ్రవరి 2025న జరగనుంది. ఈ మహా కుంభ మేళాను మొత్తం 45 రోజుల పాటు నిర్వహించనున్నారు.మహా కుంభమేళా జరిగే సమయంలో యాత్రికులు, పర్యాటకులు, భారతదేశం, విదేశాల నుంచి ప్రముఖులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు వస్తారు. జాతర ప్రాంతంలో విశిష్ట/అతి విశిష్ట వ్యక్తుల రాక సమయంలో సౌలభ్యం కోసం, 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేయబడింది. ఇక్కడ అధికారులు, ఉద్యోగులు మోహరించనున్నారు. జాతరకు వచ్చే ప్రముఖుల ప్రోటోకాల్ ఏర్పాట్ల కోసం ప్రభుత్వ స్థాయిలో ముగ్గురు అదనపు జిల్లా మెజిస్ట్రేట్లు, ముగ్గురు డిప్యూటీ జిల్లా మెజిస్ట్రేట్లు, ముగ్గురు నాయబ్ తహసీల్దార్లు, నలుగురు అకౌంటెంట్లను నియమించారు. దీనితో పాటు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను మొత్తం 25 సెక్టార్‌లలో సెక్టార్ మేజిస్ట్రేట్‌లుగా నియమించారు. వారు వారి సంబంధిత రంగాలలో ప్రోటోకాల్ ఏర్పాట్లను నిర్ధారిస్తారు. ప్రత్యేక ప్రముఖులకు ప్రోటోకాల్ ప్రకారం మహా కుంభ మేళా -2025 సందర్భంగా 50 మంది టూరిస్ట్ గైడ్‌లను , ఇతర సహాయక సిబ్బందిని నియమించడం కూడా జరుగుతుంది. జాతరకు వచ్చే ప్రముఖులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు జాతర ప్రాంతంలో ఐదు చోట్ల 250 టెంట్ల సామర్థ్యంతో సర్క్యూట్ హౌస్ లను ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే విశిష్ట, అతి విశిష్ట ప్రముఖుల సౌకర్యార్థం టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా 110 కాటేజీలతో కూడిన టెంట్ సిటీ, ఉత్తరప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నారు. 2200 కాటేజీలతో టెంట్ సిటీని అభివృద్ధి చేస్తున్నారు. దీని బుకింగ్ ప్రయాగ్‌రాజ్ ఫెయిర్ అథారిటీ ద్వారా చేయబడుతుంది. దీనిని వెబ్‌సైట్ ద్వారా నావిగేట్ చేయవచ్చు. నదిలో స్నానానికి ఘాట్ సిద్ధం చేయడమే కాదు.. జెట్టీ, మోటారు బోటు సౌకర్యం కల్పించనున్నారు. జాతర ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన మొత్తం 15 శాఖలు తమ సొంత శిబిరాలను నిర్మించుకున్నాయి, వీటిలో శాఖల అధికారులు రాక బస చేసేందుకు కాటేజీలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన మొత్తం 21 శాఖలు జాతర ప్రాంతంలో తమ సొంత శిబిరాలను ఏర్పాటు చేశాయి, అందులో డిపార్ట్‌మెంటల్ అధికారులు వచ్చే సమయంలో బస చేసేందుకు కాటేజీలు ఏర్పాటు చేశారు. అంతేకాదు జిల్లా పరిపాలన అధికారులు ప్రయాగ్‌రాజ్‌లో అందుబాటులో ఉన్న 21 అతిథి గృహాలలో వీఐపీలు వసతి కోసం మొత్తం 314 గదులను ఏర్పాటు చేశారు.

# అధికారులు చిత్తశుద్ధితో కృషి పని చేయాలి

- కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి):** మారుమూల వెనకబడిన ప్రాంతాల నిరుపేదల అభ్యున్నతికి అధికారులు చిత్త శుద్ధితో కృషి చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.2028 సంవత్సరం నాటికి ఆర్థిక ప్రగతిలో భారత్ మూడో స్థానంలో ఉండే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా పర్యటన లో భాగంగా నర్వ మండలం రాయికోడ్ గ్రామంలో కేంద్ర హెూం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి, బండి సంజయ్ కుమార్ కు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ శాలం, ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల పూల మొక్కలు అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర హెూం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి, బండి సంజయ్ కుమార్ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.తర్వాత ఎంపీ డీకే అరుణ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ఆయన అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్ వాడీ పిల్లలను ఊరి పేరు, మండలం,జిల్లా పేరు అడిగి వారితో జవాబు రాబట్టారు. సెంటర్ లో ఎంత మంది పిల్లలు ఉన్నారని,అందులో శ్యాం మ్యాం పిల్లలు ఎంతమంది అని టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆట వస్తువులను చూశారు. పిల్లలికి ఇచ్చే పౌష్టికాహారాన్ని పరిశీలిం చారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని టీచర్ ను అడగడంతో ఫర్నీచర్ అవసరమని, నీటి సమస్య ఉందని టీచర్ తెలిపారు. అధికారులకు చెప్పి ఫర్నీచర్ ను సమకూర్చుతానని, నీటి సమస్యను పరిష్కారింప చేస్తామని ఆయన చెప్పారు.వంటగది శుభ్రంగా ఉందని మెచ్చుకున్నారు.గర్భిణీలకు అందించే ఆహారం ఎలా ఉంటుందని ఆరా తీశారు. అక్కడే ఉన్న ఐదుగురు గర్భిణీలకు శ్రీమంతంలో భాగంగా పండ్లు, పసుపు, కుంకుమ, గాజుల కిట్లును అందజేశారు.ఇద్దరు చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. కిచెన్ గార్డెన్ లో ఏ ఏ కూరగాయలు పండిస్తారని అడిగారు. పూల మొక్కలను నాటారు.అనంతరం గ్రామంలోని పల్లె దవాఖా నాను సందర్శించి రోగులకు ఎలాంటి వైద్య సేవలు అంది స్తారని, రోజుకు ఎంతమంది రోగులు వస్తారని, ఎమర్జెన్సీ పెసెంట్లను ఎక్కడికీ రెఫర్ చేస్తారని అడిగి తెలుసు కున్నారు. మందులన్ని అందుబాటులో ఉన్నాయా? అన్ని రికార్డులు సక్రమంగా రాస్తున్నారా లేదా ? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఎమర్జెన్సీ రోగులను 108 వాహనంలో మక్తల్, జిల్లా ఆసుపత్రికి తరలిస్తామని, రోజుకు 20 మంది దాకా రోగులు వస్తారని, అవసరమైన మందులన్ని ఉన్నాయని వైద్యుడు మంత్రికి తెలిపారు. అనంతరం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి జిల్లాకు నవోదయ పాఠశాలను మంజూరు చేయాలని మంత్రి బండి సంజయ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు.అక్కడే ఉన్న ఓ దివ్యాంగుడు కూడా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. చివరగా కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాలకు వెళ్ళి అక్కడ విద్యార్థులు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్నీ పరిశీలించారు.పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని? రోజూ మధ్యాహ్న భోజనం ఇలాగే పెడుతు న్నారా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవర ణలో వంటగదిని నిర్మింప చేసి,గ్యాస్ స్టవ్ ను ప్రొవైడ్ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలోనే మీడియాతో మాట్లాడారు. వెనక బడిన ప్రాంతాలను కేంద్రం గుర్తించి వాటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని దేశవ్యాప్తంగా 112 జిల్లాలలో 500 బ్లాక్ ల మండలాలలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజల బాగోగులు తెలుసుకోవడం జరుగుతుం దన్నారు. ఎంపిక చేసిన జిల్లాలలోని గ్రామాల్లో కేంద్ర మంత్రులు పర్యటించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు జరుగుతున్నాయా లేదని పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు.అభివృద్ధి చెందిన మండలాలకు దీటుగా ఆయా గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరుగు తుందని తెలిపారు.తెలంగా ణ రాష్ట్రంలో భూపాలపల్లి, ములుగు నారాయణపేట జిల్లాలలో 10 ఆస్పిరేషన్ బ్లాక్ లు ఉన్నాయన్నారు. గురువారం సాయంత్రం కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా, శుక్రవారం రాయచూర్, గద్వాల జోగులాంబ జిల్లాలో పర్యటిస్తున్నట్లు మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు.నీతి అయోగ్ ద్వారా సంపూర్ణత అభియాన్ నడుస్తుందని తెలిపారు. రాయికోడ్ గ్రామంలో అంగ న్వాడి పిల్లలు, గర్భిణీలు, పాఠశాల విద్యార్థుల తో మాట్లాడడం జరిగిందని ఏమై నా సమస్యలు ఉన్నాయా ? లేదా అని తెలుసుకోవడం జరిగిందన్నారు.2028 సంవత్సరం నాటికి ఆర్థిక ప్రగతిలో భారత్ మూడవ స్థానంలో ఉండే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచే స్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్

- కేసులతో భయపెట్టలేరని విమర్శలు
- ఇచ్చిన హామీలపై శ్రద్ధ పెట్టాలి
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



**నిజామాబాద్, డిసెంబర్26 (జనంసాక్షి) :** ఏడాది పాలనలోనే కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయే తప్ప ఏ రంగం పైనా శ్రద్ధ చూపడం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు సినీ హీరో అల్లు అర్జున్ మీద ఉన్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా రాక, రుణమాఫీ రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తున్నందుకే రేవంత్ సర్కారు అక్రమంగా కేసులు పెట్టిస్తున్నదని వేముల మండిపడ్డారు. కేసులతో తమ గొంతు నొక్కలేరని స్పష్టం చేశారు.కేటీఆర్‌పై నమోదు చేసిన కేసు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని గురువారం విమర్శించారు. ఈ రకమైన కాంగ్రెస్ దుశ్చర్యలు బీఆర్‌ఎస్ నేతల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయలేవని స్పష్టం చేశారు. కేటీఆర్ అంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వణుకు పుడుతున్నదని, ప్రజా సమస్యలపై ఆయన సాగిస్తున్న పోరాటాలకు భయపడి కేసులతో వేధిస్తున్నదని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం దబాయింపు ధోరణితో అక్రమ కేసులు పెడుతున్నదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దుర్మార్గ విధానాలకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ శ్రేణులు పోరాడుతాయని హెచ్చరించారు. ప్రజాస్వామ్యవాదులు అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండించాలని రాజకీయంగా ఎదుర్కోలేని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని బనాయిస్తున్న కేసులను ప్రజలు గమనిస్తున్నారు. అసెంబ్లీలో చర్చకు ధైర్యం చేయలేని ముఖ్యమంత్రి.. క్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేయాలని చూడడం రాజకీయ అమాయకత్వం తప్ప మరొకటి కాదు. కేసీఆర్ సైనికులం, తెలంగాణ ఉద్యమ పోరాటం నుంచి పుట్టుకొచ్చిన మమ్మల్ని మీ చిల్లర వ్యూహాలు భయపెట్టలేవు. పోరాటం మాకు కొత్త కాదు. అక్రమ కేసులతో గొంతు నొక్కలేరని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా హామీలు అమలుచేయలేక ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని అన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370